www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
ప్రజల గొంతుక... దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 216 శుక్రవారం, మే 01, 2026, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad




## కవిత పార్టీ పేరు తెలంగాణ రక్షణ సేన

- ఆమోదించిన కేంద్ర ఎన్నికల సంఘం
- టీఆర్ఎస్ రాసిపెట్టి ఉందంటూ కవిత పోస్ట్



2లో

## తెలుగు రాష్ట్రాలకు చల్లటి కబురు

- తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి
- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం



2లో



## రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రత

- భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్
- అధికారులతో సమీక్షించిన డిప్యూటి సిఎం భట్టి
- కరెంట్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తరాదని ఆదేశం

**హైదరాబాద్,ఏప్రిల్ 30 :** రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయడమే ప్రభుత్వ మిగతా2లో...

## జవాబుదారీతనం పెంచేందుకే సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం

- విద్యార్థులకు సకాలంలో పాఠ్య సామగ్రి అందాలి
- వస్తువుల నాణ్యత విషయంలో రాజీపడొద్దు
- ప్రతి విద్యార్థి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి
- సంక్షేమ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్ 30 :** విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా సకాలంలో అందేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందితే విద్యార్థులు చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపుతారని సీఎం అన్నారు. విద్యా శాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖల పరిధిలోని విద్యా సంస్థల్లోని విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై ముఖ్యమంత్రి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. గతంలో ఏ శాఖకు ఆ శాఖ ప్రొక్యూర్‌మెంట్, సరఫరా చేపట్టడంతో ఏకరూపత లోపించడంతో పాటు అనేక అక్రమాలు చోటుచేసుకునేవని... వాటిని అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని సీఎం మిగతా2లో...





## త్వరలో ట్రైబల్ వర్సిటి క్యాంపస్ నిర్మాణం

- రూ.7,823 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు
- ప్రధాని పర్యటనపై కిషన్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,ఏప్రిల్ 30 :** సమ్మక్క- సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. మే 10న హైదరాబాద్ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ.. మిగతా2లో...

## యువ పోలీసుల చేతుల్లోనే పోలీస్ శాఖ ప్రతిష్ట

- ఫ్రెండ్లీ పోలీసింగ్ ప్రస్తుతం అత్యావశ్యకం
- వీడ్కోలు సన్మానంలో డిజిపి శివధర్ రెడ్డి
- కొత్త డిజిపి సివి ఆనంద్‌కు అభినందనలు



**హైదరాబాద్,ఏప్రిల్ 30 :** రాష్ట్ర డీజీపీ బి. శివధర్‌రెడ్డికి తెలంగాణ పోలీస్ అకాడమిలో ఘనమైన వీడ్కోలు లభించింది. గురువారం ఆయన రిటైర్డ్ అవుతున్న సందర్భ ంగా పోలీస్ అధికారులు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా శివధర్ రెడ్డి మాట్లాడుతూ..32 ఏళ్ల సుదీర్ఘకా లంలో ఎన్నో అనుభవాలు, అనుభూతులు మిగి లాయన్నారు. వృత్తిలో భాగంగా పలు సంస్క రణలు తీసుకొచ్చామన్నారు. మిగతా2లో...

## ఏపీ పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదల

● 85.25 శాతం ఉత్తీర్ణత నమోదు ● 87.90 శాతం ఉత్తీర్ణతతో బాలిలు టాప్ ● 96.07శాతంతో పార్వతీపురం మన్యం జిల్లా ఫస్ట్ ● ఫలితాలు విడుదల చేసిన మంత్రి లోకేశ్




**అమరావతి,ఏప్రిల్ 30 :** ఏపీ పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదల య్యాయి. గురువారం ఉదయం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఫలితా లను ప్రకటించారు. టెన్త్ ఫలితాల్లో 85.25 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది 81.14 శాతం ఉత్తీర్ణతతో పోలిస్తే ఈసారి మెరుగైన ఫలితాలు వచ్చాయి. టెన్త్ ఫలితాల్లో బాలికలు ముందంజలో ఉన్నారు. బాలికలు 87.90 శాతం ఉత్తీర్ణత సాధించ గా.. బాలురు 82.68 శాతం ఉత్తీర్ణత పొందారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశా లల్లో ఉత్తీర్ణత శాతం పెరిగింది. 72.8 నుంచి 78.39కి ఉత్తీర్ణత శాతం మిగతా2లో...

## సలహాదారుగా విహెచ్ నియామకం



2లో

## హైదరాబాద్ పోలీసుల 'వ్యూహం'.. దేశానికే దిక్సూచి


● ఢిల్లీని కదిలించిన ఆపరేషన్ ఆక్టోపస్ ఉన్నత స్థాయి సమీక్షకు దారితీసిన పోలీసుల తెగువ 'మ్యూల్' ఖాతాల వేటకు జాతీయ కార్యాచరణ ● రంగంలోకి ఐ4సీ, సీబీఐ, ఆర్బీఐ



**న్యూఢిల్లీ, ఏప్రిల్30 :** నగరం లో తమ పంజా విసురుతున్న సైబర్ నేరగాళ్ల అక్రమ సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో పెకిలించేం దుకు హైదరాబాద్ పోలీసులు ఎక్కుపెట్టిన 'ఆపరేషన్ ఆక్టోపస్' అస్త్రం ఇప్పుడు దేశవ్యాప్త సమరానికి దిక్సూచిగా మారింది. 32 మంది బ్యాంక్ అధికారులను నగర సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నగర పోలీస్ యంత్రాంగం ప్రదర్శించిన అసమాన తెగువ, వ్యూహాత్మక చొరవ దేశ రాజధాని ఢిల్లీని కదిలించడమే కాక, కేంద్ర ప్రభుత్వం అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించేలా ప్రేరేపించింది. డిజిటల్ ఆర్థిక మోసాల్లో కీలకమైన 'మ్యూల్' ఖాతాల అక్రమ చలామణీని ఛేదించడంలో హైదరాబాద్ పోలీసులు సాధిం చిన అద్భుత విజయాలను కేంద్ర ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) ఒక ఆదర్శ నమూనాగా తీసుకుంది. ఈ నేపథ్యంలోనే కేంద్ర ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి నేతత్వంలో ఢిల్లీలో గురువారం జరిగిన కీలక సమావేశం.. సైబర్ నేరాల నియంత్రణలో ఒక నవశకానికి నాంది పలికింది. హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ పాల్గొన్నారు. ముఖ్యంగా అమాయకుల పేరిట తెరిచే మ్యూల్ ఖాతాలను మిగతా 2లో...

## 20పైగా అంశాలకు కేబినేట్ ఆమోదం

- ఢిల్లీలో రూ.124.50 కోట్లతో కొత్త ఏపీ భవన్ నిర్మాణం
- క్వాంటం వ్యాలీ ట్విన్ టవర్ల నిర్మాణానికి రూ.1,208 కోట్లు
- మార్క్‌ఫెడ్‌కు రూ.1800 కోట్ల రుణం పొందేందుకు గ్యారెంటీ
- ల్యాండ్ పూలింగ్ స్కీమ్ నిబంధనల్లో సవరణ




2లో

## అసైన్డ్ భూములలో ఇటుక బట్టీలా. ?

- అధికారులు చూసినా.. అడ్డుకోరా..?
- ఒకవైపు పొల్యూషన్, మరోవైపు బాల కార్మికులు.!
- ఇటుకబట్టీని తరలిస్తారా... అక్రమార్కులకు అండగా ఉంటారా..?



వివరాలు 4లో

## తెలుగు రాష్ట్రాలకు చల్లటి కబురు

**హైదరాబాద్/అమరావతి,ఏప్రిల్ 30 :** తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో వాతావరణ శాఖ ఉపశమనం కలిగించే వార్త చెప్పింది. ద్రోణి ప్రభావంతో అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వచ్చే మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురు గాలులు సహా పిడుగులతో కూడిన జల్లులు కురుస్తాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో ద్రోణి విస్తరించి ఉంది. ఫలితంగా.. ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో మూడు రోజుల పాటు అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముంది. గురువారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా పిడుగులతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో గంటకు 50- 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశ ముంది. శుక్ర, శనివారాల్లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవడం సహా గంటకు సుమారు 40 - 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో వేడి, తేమ సహా అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడనున్నట్టు సమాచారం. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకా రం.. ద్రోణి/వాయు అస్థిరత ఇప్పుడు దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉంది. అంతర్గత మహారాష్ట్ర సహా దానిని ఆనుకుని ఉన్న తెలంగాణపై సముద్ర మట్టానికి 3.1 కి.మీ. ఎత్తులో ఒక ప్రతిచక్రవాత వలయం ఏర్పడింది. దీంతో రానున్న మూడు రోజుల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలో రానున్న మూడు రోజులలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు దాదాపు ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉంది.ఇదిలావుంటే తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. హైదరాబాద్, వరంగల్, ఆదిలాబాద్, విశాఖ, విజయవాడ, నెల్లూరు వంటి ప్రాంతాల్లో ఎండలు దంచికొడుతున్నాయి. తెలంగాణలో వడదెబ్బ మృతుల సంఖ్య పెరిగిపోతోంది. పగలంతా ఎండ కొడుతుండగా.. సాయంత్రం మాత్రం అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు గురు, శుక్రవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఏపీలోనూ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయని అధికారులు తెలిపారు.

## జవాబుదారీతనం పెంచేందుకే సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో దుస్తులు, నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ఇతర సామగ్రి సరఫరాకు సంబంధించి ఏ శాఖకు ఆ శాఖ చేపట్టడంతో అవకతవకలకు ఆస్కారం ఉండేదన్నారు. అటువంటి అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సీఎం స్పష్టం చేశారు. సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానంతో జవాబుదారీతనం పెరుగుతుందని సీఎం అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నం చేస్తుందని... సరఫరాదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కాదన్నారు. విద్యార్థులకు అందజేసే నోటు పుస్తకాలు, ట్రంక్ పె÷-టటెలు, ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్ షూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగ్లు, ఐడీ కార్డులు, యూనిఫాంలు అన్నీ నాణ్యమైనవే ఉండాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యతతో పాటు సకాలంలో అందడంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా అందాలని, అలా అందగానే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. విద్యార్థులకు అందజేసే వస్తువులకు సంబంధించి మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోని పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువులు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని, సరఫరాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలన్నారు. ప్రతి విద్యార్థికి వారికి అవసరమైన సామగ్రి అంతా అందిందా లేదా అనే దానిని చెక్ చేసుకోవాలని సీఎం ఆదేశించారు. నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి క్వాలిటీ... వాటిని అందుకున్న తర్వాత వారి భావాలను తెలియజేసేం దుకు విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయా దేవి, సెర్ప్ సీఈవో దివ్య, ఉన్నత విద్యా శాఖ కమిష నర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సంతోష్, బిసి కార్యదర్శి బి.సైదులు పాల్గొన్నారు.

## అక్రిడేషన్ కార్డులను అందచేసిన పొంగులేటి

### అర్హులందరికీ అందచేస్తామని ప్రకటన



**హైదరాబాద్,ఏప్రిల్ 30 :** జర్నలిస్టులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కొత్త అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ ఎట్టకేలకు ప్రారంభమైంది. గురువారం హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జర్నలిస్టులకు ఈ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తామని, ఇందులో ప్రభుత్వానికి ఎలాంటి రెండో ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఒకవేళ కార్డు పొందిన తర్వాత ఎవరైనా సంస్థ మారితే, ఆ సమాచారాన్ని అధికారులకు తెలియజేస్తే వారి కార్డులను తొలగించబోమని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో అక్రిడిటేషన్ల సంఖ్య 32 వేల నుండి 35 వేల మధ్య ఉండేదని, తమ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జీవోల వల్ల సుమారు 46 వేల మందికి లబ్ది చేకూరుతుందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయి కార్డుల్లో 2500 మందికి క్లియరెన్స్ ఇచ్చామని, జిల్లా స్థాయి కార్డుల మంజూరుపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. రాబోయే 15 రోజుల్లో అర్హులందరికీ కార్డుల మంజూరు పూర్తి చేస్తామని మంత్రి ప్రకటించారు. కొత్త దరఖాస్తులకు ఒక గడువు నిర్ణయించాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఖచ్చితమైన సంఖ్య తెలిస్తే, దాని ఆధారంగా జర్నలిస్టుల కోసం మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పాత కార్డుల గడువు ముగియడంతో, యుద్ధ ప్రాతిపదికన కొత్త కార్డుల జారీని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు.

## హైదరాబాద్ పోలీసుల 'వ్యూహం'.. దేశానికే దిక్సూచి

(మొదటి పేజీ తరువాయి)

నేరగాళ్లు ఎలా వినియోగించు కుంటున్నారో పక్కా ఆధారాలతో సహా బహిర్గతం చేయడంతో కేంద్రం అప్రమత్తమైంది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అందించిన క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా ఐ4సీ, సీబీఐ, ఆర్బీఐ వంటి అగ్రశ్రేణి సంస్థలతో పాటు వివిధ బ్యాంకుల ఉన్నతాధి కారులతో కేంద్రం ప్రత్యేక సమీక్ష నిర్వహిం చింది. ఈ భేటీలో హైదరాబాద్ పోలీసుల పనితీరును ప్రత్యేకంగా కొనియాడడమే కాకుండా, ఇక్కడి విజయవంతమైన మోడల్‌ను దేశమంతటా అమలు చేయాలని నిర్ణయించింది.
నేరగాళ్ల వేటలో మరింత వేగం పెంచేందుకు 'మ్యూల్ హంటర్. ఏఐ' అనే కృత్రిమ మేధస్సు సాధనాన్ని తక్షణమే వినియో గంలోకి తీసుకు రావాలని ఆర్బీఐ బ్యాంకులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. సమన్వయ లోపం లేకుండా పోలీసులు, బ్యాంకులు రియల్ టైం డేటాను పంచుకో వాలని, ఎస్ఎల్బీసీల ద్వారా ప్రజల్లో విస్తృత అవగా హన కల్పించాలని ఈ సమావేశం దిశానిర్దేశం చేసింది.

హైదరాబాద్ పోలీస్ యంత్రాంగం ప్రదర్శించిన ఈ కార్యదక్షత మిగిలిన రాష్ట్రాలకు స్ఫూర్తిదాయ కమని కేంద్ర అధికారులు అభిప్రాయ పడ్డారు.

వెరసి, హైదరాబాద్ పోలీసుల అలుపెరగని పోరాటం ఇప్పుడు దేశవ్యాప్త సైబర్ భద్రతకు ఒక కొత్త మార్గదర్శిగా నిలు స్తూ, మోసగాళ్ల ఆట కట్టించేందుకు యావత్ యంత్రాంగాన్ని సన్నద్ధం చేసింది.

## 20పైగా అంశాలకు కేబినేట్ ఆమోదం

**అమరావతి,ఏప్రిల్ 30 :** ఉద్యోగ, మౌలిక వసతులు, వ్యవసాయం, పట్టణాభివృద్ధి, పెట్టుబడుల వంటి అంశాలపై క్యాబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన దాదాపు మూడున్నర గంటలపాటు సమావేశమైన మంత్రివర్గం.. దాదాపు 20కిపైగా అజెండా అంశాలకు ఆమోదం తెలిపింది. అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్.. క్యాబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. దిల్లీలో 11.5 ఎకరాల్లో రూ.124.50 కోట్లతో కొత్త ఏపీ భవన్ నిర్మాణానికి మంత్రివర్గం పచ్చజెండా ఊపిందన్నారు. మున్సిపాలిటీలకు చెందిన ఆస్తుల లీజ్ రెన్యువల్, అద్దె నిర్ణయ విధానాల సవరణలకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల్లో మ్యుటేషన్ ఛార్జీలను ఒకే విధంగా అమలు చేసే చట్టసవరణ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. దిల్లీలోని ఏపీ భవన్‌లో అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ కార్యాలయంలో ఆఫీస్ మేనేజర్ పోస్టును సెక్షన్ ఆఫీసర్‌గా అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదనకు ఆమోద ముద్ర వేసింది. రామాయపట్నంలో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ పోర్ట్ ప్రాజెక్టు నిర్మాణ పనులకు రూ.354 కోట్ల మేర పాలనా అనుమతులకు అంగీకారం తెలిపింది. ఏపీ మార్క్‌ఫెడ్‌కు రూ.1800 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ గ్యారంటీ ఇచ్చే ప్రతిపాదనకు ఆమోద ముద్ర వేసింది. అమరావతిలో క్వాంటం వ్యాలీ ట్విన్ టవర్ల నిర్మాణానికి రూ.1,208 కోట్ల వ్యయానికి అంగీకారం తెలిపింది. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ 2000 బ్యాచ్‌కు చెందిన 385 మంది కానిస్టేబుళ్లను హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతికి పచ్చజెండా ఊపింది. హైకోర్టు, జిల్లా న్యాయస్థానాల్లో 21 కొత్త పోస్టులు సృష్టించేందుకు అంగీకారం తెలిపింది.

రూ.2,540 కోట్లతో అమరావతిలో పలు అభివృద్ధి పనులు చేపట్టాలని కేబినెట్ నిర్ణయించింది. కృష్ణానది ఫ్లడ్ ప్రొటెక్షన్ పనులతో పాటు అమరావతిలోని సచివాలయం గ్లాస్ క్లాడింగ్ పనులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ల్యాండ్ పూలింగ్ స్కీమ్ నిబంధనల్లో సవరణలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పోలవరం ప్రాజెక్ట్ బాధితులకు గృహ యూనిట్ ఖర్చు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ పరిసరాల్లో సివిల్ వర్క్స్ కోసం రూ.798 కోట్ల ప్రణాళికతో పాటు ఉండవల్లి జోన్‌లో మౌలిక వసతుల కోసం రూ.580 కోట్ల ప్రణాళికకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది.

## శ్రామిక వర్గానికి ఎప్పుడూ అండగా ఉన్నాం

(మొదటి పేజీ తరువాయి)

కార్మికుల శ్రేయస్సు, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. మే డే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే అసంఘటిత రంగంలో పని చేస్తున్న గిగ్ వర్కర్ల కోసం రూ. 5 లక్షల ప్రమాద బీమా అమలు చేశామన్నారు. తెలంగాణ గిగ్, ఎ÷-లాట్ ఫాం వర్కర్స్ సంక్షేమ బిల్లు తీసుకువచ్చినట్టు తెలిపారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదని సీఎం పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ లో ఉన్న కారుణ్య నియామకాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ దేశానికే తలమానికంగా ఉన్న సింగరేణి కార్మికులకు, దసరా, దీపావళి పండుగలకు ముందే బోనస్ చెల్లించడం జరిగిందన్నారు. సింగరేణి చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 5 వేలు చొప్పున బోనస్ ఇచ్చినట్టు గుర్తు చేశారు. దాంతోపాటు, పలు బ్యాంకుల సహకారంతో కార్మికులకు కోటి రూపాయల బీమా సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించినట్టు వివరించారు. గల్ఫ్ దేశాల్లో పని చేసే తెలంగాణ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. తెలంగాణ కార్మికులు ఆయా దేశాల్లో ఏ కారణంతో మరణించినా.. వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు.

## త్వరలో ట్రైబల్ వర్సిటీ క్యాంపస్ నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

రూ.7,823 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తారని చెప్పారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి ఈమేరకు మీడియాతో మాట్లాడారు. 'హైదరాబాద్‌లో పెట్రోలియం ఉత్పత్తులకు సంబంధించి టెర్మినల్‌ను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. మహబూబ్‌నగర్‌లో రూ.3,175 కోట్ల విలువైన జాతీయ రహదారి పనులకు వర్చువల్‌గా శ్రీకారం చుట్టనున్నారు. హఫీజ్‌పేట, జోగులాంబ రైల్వేస్టేషన్లను, కాజీపేట- విజయవాడ మధ్య మూడో రైల్వే లైన్‌ను ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో రూ.85 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. హైదరాబాద్-యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ పనులు ప్రారంభమయ్యాయి. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నాం. 2030 నాటికి రూ.9 లక్షల కోట్ల విలువైన టెక్స్‌టైల్ ఉత్పత్తులను ఎగుమతి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం అని కిషన్‌రెడ్డి తెలిపారు.

## ఏపీ పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

పెరిగింది. వాట్సాప్ 'మన మిత్ర' సేవ ద్వారా 9552300009కు మెజేజ్ పంపి ఫలితాలను తెలుసుకోవచ్చు. టెన్త్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మంత్రి లోకేశ్ అభినందనలు తెలియజేశారు. 'మీ కృషి, అంకితభావం ఫలించాయి. ఫెయిల్ అయిన విద్యార్థులు నిరాశ చెందవద్దు. ఇది ఒక పరీక్ష మాత్రమే. మళ్లీ ధైర్యంగా ప్రయత్నించండి. మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధికి పూర్తి మద్దతు ఇస్తుంది' అని లోకేశ్ పేర్కొన్నారు.మొదటి స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా - 96.07శాతం ఉత్తీర్ణత సాధించగా, రెండో స్థానంలో డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ 95.85శాతం ఉత్తీర్ణత సాధించింది. మూడో స్థానంలో విజయనగరం - 91.08శాతం, చివరి స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా - 57.12శాతం ఉత్తీర్ణత సాధించాయి. జిల్లాల వారీగా ఉత్తీర్ణత వివరాలు ఇలావున్నాయి. కర్నూలు జిల్లా - 71.08,విశాఖపట్నం - 89.51,గుంటూరు - 88.89,తూర్పు గోదావరి - 88.49, కృష్ణా జిల్లా- 88.06, ఎన్టీఆర్ జిల్లా -87.91,నెల్లూరు - 87.37,అనంతపురం - 77.17, చిత్తూరు- 76.69 శాతం ఉత్తీర్ణత సాధించాయి. మొత్తం హాజరైన విద్యార్థులు - 6,18,131కాగా, ఉత్తీర్ణులైన విద్యార్థులు - 5,26,954 పాసయ్యారు. రీకౌంటింగ్ / రీ-వెరిఫికేషన్: ఫలితాలపై అసంతృప్తి ఉన్న విద్యార్థులు మే 1 నుంచి మే 7వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రీకౌంటింగ్‌కు సబ్జెక్టుకు రూ.500, రీ-వెరిఫికేషన్‌కు రూ.1,000 ఫీజు చెల్లించాలి. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని వారి కోసం మే 25 నుంచి జూన్ 4 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. అపరాధ రుసుము లేకుండా మే 9 వరకు, రూ.50 అపరాధ రుసుముతో మే 10 నుంచి మే 25 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. స్జబెక్టు వారీగా మార్కుల మెమోలు నాలుగు రోజుల్లో అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు.

## సలహాదారుగా విహెచ్ నియామకం

**హైదరాబాద్,ఏప్రిల్ 30 :**
తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావును రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించింది. క్యాబి నెట్ హోదా కల్పించి, వీహెచ్‌ను సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు డీజీపీగా పదవీ విరమణ చేసిన బత్తుల శివధర్‌రెడ్డిని ప్రభుత్వం రాష్ట్ర భద్రతా సలహాదారుగా నియమించింది.

## రాష్ట్రంలో పెరుగుతున్న ఎండల తీవ్రత

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లో విద్యుత్ సరఫరా పై ఇంధన శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.రాష్ట్రంలో భానుడి భగభగలకు తోడు ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీలు, కూలర్ల వాడకం విపరీతంగా పెరిగిందని అధికారులు మంత్రికి వివరించారు. దీనికి వ్యవసాయ అవసరాలు కూడా తోడవడంతో గ్రిడ్‌పై ఒత్తిడి పెరుగుతోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యుత్ మార్కెట్‌పై ఒత్తిడి ఉన్నప్పటికీ, రాష్ట్ర అవసరాలకు ఏమాత్రం లోటు రాకుండా పవర్ ఎక్స్ఛేంజీల ద్వారా అదనపు విద్యుత్ కొనుగోళ్లు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆసుపత్రులు, తాగునీటి సరఫరా పథకాలు మరియు అత్యవసర సేవలకు విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, జల విద్యుత్ ఉత్పత్తిని సమర్థంగా నిర్వహించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, అన్ని విద్యుత్ సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వివరించారు. రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ స్థిరంగా ఉందని, ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు తగిన ఏర్పాట్లు చేశామని అధికారులు మంత్రికి హామీ ఇచ్చారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని, అన్ని వర్గాల వినియోగదారులకు నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాను కొనసాగించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ అగ్ర ప్రాధాన్యమని స్పష్టం చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, క్షేత్రస్థాయి సిబ్బందిని నిరంతరం అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు.

## కవిత పార్టీ పేరు తెలంగాణ రక్షణ సేన

**హైదరాబాద్,ఏప్రిల్ 30 :** 'తెలంగాణ రక్షణ సేన' పేరును కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదించింది. ఆమె పెట్టుకున్న పేర్ల ఆధారంగా ఈ పేరును ఖరారు చేసింది. దీనిపై కవిత హర్షం వ్యక్తం చేశారు. 'ఈసీ నిబంధనలకు అనుగుణంగా జనవరిలో మొత్తం ఐదు పేర్లతో దరఖాస్తు చేసుకున్నాం. మూడో ప్రాధాన్యంగా ఇచ్చిన పేరును ఈసీ ఆమోదించింది. టీఆర్ఎస్.. నాకు రాసిపెట్టి ఉందేమో! రెండు దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక పరిరక్షణ, పునరుజ్జీవం కోసం చేస్తున్న కృషిని కొనసాగిస్తా. రాష్ట్ర అస్తిత్వ పరిరక్షణెళి ధ్యేయంగా అంకితభావంతో పనిచేస్తా' అని కవిత 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ఈ నెల 25న కవిత ప్రకటించిన రాజకీయ పార్టీ 'టీఆర్ఎస్'కు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదముద్ర వేసిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్ర సేన బదులు 'తెలంగాణ రక్షణ సేన' పేరును ఆమోదించింది. టీఆర్ఎస్ పార్టీకి అనుమతిస్తూ బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో ఎన్నికల సంఘం అధికారులు ఆమెకు లేఖ అందజేశారు. పార్టీ పేరుపై పత్రికల్లో ప్రకటన ఇవ్వాలని కవితకు ఈసీ సూచించింది. అదేవిధంగా కొత్త పార్టీ పేరుపై అభ్యంతరాలుంటే 30 రోజుల్లోపు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపింది.

## యువ పోలీసుల చేతుల్లోనే పోలీస్ శాఖ ప్రతిష్ట

(మొదటి పేజీ తరువాయి)


పోలీసింగ్ విధానంలో నేడు అనేక మార్పులు చోటు చేసుకున్నాయని, యువ పోలీస్ అధికారులు డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పోలీస్ విభాగం పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రస్తుత సిటిజన్స్‌కు ఫ్రెండ్లీ పోలీసింగ్ అవసరమన్నారు. సర్వీసులో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా, పదవీ విరమణ పొందిన శివధర్ రెడ్డికి నూతన డీజీపీగా నియామకమైన సీవీ ఆనంద్ అభినందనలు తెలిపారు. ఆయన ఉద్యోగ జీవితంలో ఎన్నో సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని పలు సంస్కరణలు తీసుకొచ్చారని ప్రశంసిచారు. తన సూచనలు, సలహాలు తీసుకునేందుకు తాను సిద్ధమేనని సీవీ ఆనంద్ తెలిపారు. 1970, 1980లో పోలీసుల పరిస్థితులు వేరని.. ఇప్పుడు పని చేస్తున్న పోలీస్ సిబ్బంది పరిస్థితులు వేరన్నారు. గతం కంటే ఇప్పుడున్న పోలీసింగ్‌లో చాలా మార్పులు వచ్చాయని అన్నారు. పోలీస్ విభాగం పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రస్తుత సిటిజన్స్‌కు ఫ్రెండ్లీ పోలీసింగ్ అవసరమన్నారు.

## ఫ్యాటీ లివర్ ఉన్న వారు ఈ నూనెలను వాడాలి.. వాటి విషయంలో రాజీ పడవద్దు..



మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్ల కారణంగా తలెత్తున్న అనారోగ్య సమస్యల్లో ఫ్యాటీ లివర్ కూడా ఒకటి. ఫ్యాటీ లివర్ కాలేయంలో అధిక కొవ్వు పేరుకుపోవడం వల్ల కలిగే సాధారణ ఆరోగ్య సమస్య. ప్రారంభ దశలో లక్షణాలు కనిపించకపోయినా, తర్వాత కాలేయంలో వాపు, నష్టం, తీవ్రమైన పరిస్థితుల్లో Cirrhosis వంటి సమస్యలకు దారి తీసే ప్రమాదం ఉంటుంది. అందుకే సరైన ఆహారం, జీవనశైలి మార్పులు పాటించడం చాలా ముఖ్యం. ఇక గ్యాస్ట్రోఎంటరాలజీ నిపుణుల ప్రకారం వంటలో ఉపయోగించే నూనెల ఎంపిక కూడా ఫ్యాటీ లివర్ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా సోయాబీన్, కార్న్, కాటన్‌సీడ్, గ్రేప్‌సీడ్, కనోలా వంటి నూనెలను అధికంగా వాడడం కాలేయ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది.మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్ల కారణంగా తలెత్తున్న అనారోగ్య సమస్యల్లో ఫ్యాటీ లివర్ కూడా ఒకటి. ఫ్యాటీ లివర్ కాలేయంలో అధిక కొవ్వు పేరుకుపోవడం వల్ల కలిగే సాధారణ ఆరోగ్య సమస్య. ప్రారంభ దశలో లక్షణాలు కనిపించకపోయినా, తర్వాత కాలేయంలో వాపు, నష్టం, తీవ్రమైన పరిస్థితుల్లో జఱతీతీష్ర్షశీంఱం వంటి సమస్యలకు దారి తీసే ప్రమాదం ఉంటుంది. అందుకే సరైన ఆహారం, జీవనశైలి మార్పులు పాటించడం చాలా ముఖ్యం. ఇక గ్యాస్ట్రోఎంటరాలజీ నిపుణుల ప్రకారం వంటలో ఉపయోగించే నూనెల ఎంపిక కూడా ఫ్యాటీ లివర్ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా సోయాబీన్, కార్న్, కాటన్‌సీడ్, గ్రేప్‌సీడ్, కనోలా వంటి నూనెలను అధికంగా వాడడం కాలేయ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది.ఎక్స్‌ట్రా వర్జిన్ ఆలివ్ ఆయిల్, ఆవ నూనె..అయితే కొన్ని ఆరోగ్యకర నూనెలు కాలేయానికి మేలు చేస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. ఎక్స్‌ట్రా వర్జిన్ ఆలివ్ ఆయిల్‌లో ఉన్న యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కాలేయ వాపును తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తుంది. దీనిని సలాడ్స్‌లో లేదా తక్కువ వేడి వంటల్లో ఉపయోగించవచ్చు. అవకాడో ఆయిల్ కూడా మంచి ఎంపికగా నిలుస్తుంది. ఇది బైల్ ప్రవాహాన్ని మెరుగుపరచి కొవ్వు జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. మధ్యస్థ ఉష్ణోగ్రతలో వంటకు లేదా సలాడ్స్‌లో ఉపయోగించడం మంచిది. కోల్డ్-ప్రెస్డ్ ఆవ నూనెలో ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉండటం వల్ల ఇది వాపును తగ్గిస్తుంది. అలాగే జీర్ణక్రియను మెరుగుపరచి మెటబాలిజాన్ని పెంచడంలో సహాయపడుతుంది. భారతీయ వంటల్లో దీన్ని తేలికపాటి ఫ్రై లేదా తాళింపు కోసం ఉపయోగించవచ్చు.నువ్వుల నూనె, అవిసె గింజల నూనె..సెసేమ్ (నువ్వుల) ఆయిల్‌లో యాంటీ ఆక్సిడెంట్లు, లిగ్నాన్లు ఉండటం వల్ల కాలేయ ఎంజైమ్‌లను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది మెటబాలిజానికి కూడా మద్దతు ఇస్తుంది. ఫ్లాక్స్ సీడ్ ఆయిల్ (అవిసె గింజల నూనె)లో ఉండే ప్లాంట్-బేస్డ్ ఒమేగా-3 కొవ్వులు కాలేయంలో కొవ్వును తగ్గించడంలో సహాయపడతాయి. అయితే ఇది వేడి పట్ల సున్నితంగా ఉండటం వల్ల దీనిని ముడి రూపంలోనే తీసుకోవడం ఉత్తమం. సరైన నూనెలను ఎంచుకోవడం ఫ్యాటీ లివర్ నియంత్రణలో ఒక ముఖ్యమైన అడుగు. అయితే దీనితోపాటు సమతుల్య ఆహారం, నియమిత వ్యాయామం కూడా అనుసరించడం ద్వారా కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## మీ పిల్లలు అధికంగా బరువు పెరుగుతున్నారా.. అయితే జాగ్రత్త వహించాల్సిందే..



చిన్నారుల్లో ఊబకాయం (Childhood Obesity) ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఒక పెద్ద ప్రజారోగ్య సమస్యగా మారుతోంది. గత కొన్ని దశాబ్దాల్లో ఇది గణనీయంగా పెరిగిందని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ వెల్లడించింది. 1990లో 2 శాతంగా ఉన్న ఈ సమస్య, 2022 నాటికి 8 శాతానికి పెరగడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. ముఖ్యంగా 5 సంవత్సరాలలోపు పిల్లల్లో కోట్ల సంఖ్యలో అధిక బరువు సమస్య నమోదవుతోంది. ఈ పెరుగుదలకు ఆధునిక జీవనశైలి, పర్యావరణ మార్పులు, శారీరక క్రియాశీలత తగ్గడం వంటి కారణాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఇటీవలి కాలంలో, స్క్రీన్ టైమ్ అధికం కావడం, జంక్ ఫుడ్ అలవాటు ఈ సమస్యకు ప్రధాన కారకాలుగా నిలిచాయి. స్క్రీన్ ముందు ఎక్కువ సమయం గడిపే పిల్లలు శారీరకంగా చురుకుగా ఉండలేరు. బయట ఆడుకోవడం తగ్గిపోవడంతో శరీరంలో కొవ్వు పేరుకుపోతుంది. అంతేకాకుండా ఎక్కువ స్క్రీన్ టైమ్ నిద్ర విధానాన్ని కూడా దెబ్బతీస్తుంది.

## పదవ తరగతి ఫలితాల్లో ప్రజ్ఞా విద్యార్థులు జయకేతనం

**విద్యార్థిని గాండ్ల జ్యోత్మిక 568/600**

**ప్రజ్ఞా స్కూల్ విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే గాంధీ..**



**కూకట్ పల్లి : ఏప్రిల్ 29 (పీపుల్స్ న్యూస్)**

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో స్థానిక పాపిరెడ్డి నగర్ ప్రజ్ఞా హై స్కూల్ దూసుకుపోతుంది. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రజ్ఞా పాఠశాల చెందిన విద్యార్థులు విద్యార్థినిలు మంచి మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారని ప్రజ్ఞా హై స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ పిల్లోడి ప్రీతమ్ యాదవ్ తెలిపారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే గాంధీ అభినందించారు. ఈసందర్భంగా ప్రజ్ఞా స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ ప్రీతమ్ యాదవ్ మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా మా పాఠశాల విద్యార్థులు వరుస విజయాలతో దూసుకుపోతున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపక సిబ్బంది విద్యార్థులు వారి తల్లిదండ్రులకు శుభాభినందనలు తెలిపారు.


# నోట్ల కట్టలకు నోటీసులు అమ్ముడుపోతాయా..?

**నోటీసులతోనే సరిపెట్టుకుంటారా.. అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపుతారా..?**

**జిన్నారం : ఏప్రిల్ 30 (పీపుల్స్ న్యూస్):** జిన్నారం మండలంలో అక్రమ నిర్మాణాల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ శాఖల అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించకపోవడంతో అనేక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల నియంత్రణ లేకుండా నిర్మాణాలు కొనసాగుతున్నాయని వారు విమర్శిస్తున్నారు. ప్రత్యేకంగా మంగంపేట్ వార్డు నెంబర్ 1లో చోటుచేసుకున్న ఘటన మరింత దృష్టిని ఆకర్షిస్తోంది. మాజీ సర్పంచ్ భర్త సుమారు 900 గజాల స్థలాన్ని ఆక్రమించారని ఆరోపణలు రావడంతో మున్సిపల్ అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. ఈ చర్య ఆలస్యంగా తీసుకున్నప్పటికీ, కనీసం ఇప్పటికైనా చర్యలు ప్రారంభించారని కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఒకే ఘటనపై చర్యలు తీసుకోవడం సరిపోదని, మండలవ్యాప్తంగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు తమ బాధ్యతను గుర్తించి అక్రమాలకు అడ్డుకట్ట వేయకపోతే పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

నోటీసులు గెలుస్తాయా.. నోట్ల కట్టలు గెలుస్తాయా..?

జిన్నారం మండలం మంగంపేట్ వార్డు నం. 1లో మాజీ సర్పంచ్ భర్తపై భూ కబ్జా ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. సుమారు 900 గజాల స్థలాన్ని అక్రమంగా ఆక్రమించినట్లు



OFFICE OF MUNICIPAL COUNCIL: JINNARAM
SANGAREDDY DISTRICT.

No. G1/UC -17/2026 Dated:20.04.2026.

NOTICE

(Issued under section 174, 178,180 & 181 of Telangana Municipalities Act,2019)

Sub:- Jinnaram Municipality– Construction of Unauthorized structure without prior permission- Notice issued - Regarding.

Ref :- 1. Telangana Municipalities Act, 2019,
2. Complaint from villagers through Prajavani dated: 05.01.2026
3. Complaint submitted at Municipal Office dated: 28.02.2026
4. Notice issued on Dt: 17.03.2026.
<<<@>>>

In view of the above subject cited, Sri/Smt: Sri Rupera Rao Saikrishna, S/o Narender, Sri Rupera Rao Sairam, S/o Srinivas you are Ward No.01, situated at Mangampet, of Jinnaram Municipality against the provisions of Telangana Municipalities Act, 2019.

As per Section 189 of the Telangana Municipalities Act, 2019, no person shall erect or commence any building or development work within the municipal limits without prior permission from the Municipal Authority. Further, Section 190 mandates that all such works require written sanction from the Municipality after scrutiny of plans and compliance with zoning regulations. Violation of these provisions attracts penalties under Section 232, including fines, demolition orders, and legal action.

As we have issued the notice on 17.03.2026, but you have not responded regarding that notice, if you have any related documents of your construction submit in office Within three (3) days from the date of receipt of this notice, if not provided we take further action as per Municipal Act 2019.

You are hereby directed to immediately stop all construction activities on the site forthwith. Failure to comply will result in Initiation of penal action under the above sections, Sealing of the premises, Demolition at your cost, with recovery as arrears of land revenue.

Commissioner
Jinnaram Municipality

To
Sri/Smt. Sri Rupera Rao Saikrishna, S/o Narender, Sri Rupera Rao Sairam, S/o Srinivas
H.No./Sy.No. Mangampet
Phone No. :

Copy to The Additional Collector (LB's) Sangareddy District, for kind information.
Copy to The Special Officer, Jinnaram Municipality for kind information.
Copy to The Enforcement Team, Jinnaram Municipality for information and necessary

వచ్చిన ఫిర్యాదులపై మున్సిపల్ అధికారులు స్పందించి నోటీసులు జారీ చేయడం స్థానికంగా శుభ పరిణామంగా భావిస్తున్నారు. అయితే, ఈ చర్యలు కేవలం నోటీసులకే పరిమితమవుతాయా..? లేక వాస్తవంగా అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటారా..? అనే సందేహాలు ప్రజల్లో



వ్యక్తమవుతున్నాయి. స్థానికులు చెబుతున్న ప్రకారం, గతంలో కూడా ఇలాంటి ఘటనల్లో అధికారులు నోటీసులు ఇచ్చి తర్వాత విషయాన్ని నిర్లక్ష్యం చేసిన సందర్భాలు ఉన్నాయని ఆరోపిస్తున్నారు. దీంతో "నోటీసులకే పరిమితమా.. నోట్ల కట్టలతో ఆపేస్తారా..?" అనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల చర్యలపై పారదర్శకత, కఠినత్వం ఉండాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఘటనపై సంబంధిత శాఖలు సమగ్రంగా విచారణ జరిపి, నిజాలు వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ ఆక్రమణలు జరిగితే ఎవరైనా సరే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రభావశీలులపై కూడా అదే స్థాయిలో చర్యలు ఉండాలని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

మున్సిపల్ అధికారులు మాత్రం నోటీసులు ఇచ్చిన తర్వాత తదుపరి చర్యలు చట్టప్రకారం కొనసాగుతాయని తెలిపారు. అయితే, ఈ వ్యవహారం ఎలా మలుపు తిరుగుతుందో అన్నది ఆసక్తికరంగా మారింది.

# పోలీసు సారథికి ఆత్మీయ వీడ్కోలు!

**హైదరాబాద్: క్రైమ్ బ్యూరో, ఏప్రిల్ 30, (పీపుల్స్ న్యూస్) :** డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయం వేదికగా నిర్వహించిన వీడ్కోలు వేడుక అత్యంత ఘనంగా, ఆత్మీయతతో కూడిన వాతావరణంలో సాగింది. సుదీర్ఘ కాలం పాటు పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి, తనదైన ముద్ర వేసిన డిజిపి బి. శివధర్ రెడ్డి నిష్క్రమణ సమయంలో సహచర అధికారులు, సిబ్బంది భావోద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమ ఆరంభంలో, శివధర్ రెడ్డి తన బాధ్యతలను శాంతిభద్రతల డిజిపి మహేష్ ఎం. భగవత్ కు అప్పగించారు. నూతన డిజిపి గా సి.వి. ఆనంద్ బాధ్యతలు స్వీకరించే వరకు, ఇన్ఛార్జ్ డీజీపీగా మహేష్ భగవత్ వ్యవహరించనున్నారు. అధికారిక బదిలీ ప్రక్రియ అనంతరం, వీడ్కోలు పలికేందుకు తరలివచ్చిన ఐపిఎస్ అధికారులు, సిబ్బంది కి చేతులు ఊపుతూ అభివాదం చేస్తూ తనను కలిసేందుకు వచ్చిన కరచాలనం చేస్తూ, ఆత్మీయంగా పలకరిస్తూ శివధర్ రెడ్డి ముందుకు సాగారు. అనంతరం పూలతో అలంకరించిన వాహనంపై నిలబడి, అందరికీ చేతులు ఊపుతూ అభివాదం చేశారు. పోలీసు



సంప్రదాయంలో అత్యంత గౌరవప్రదమైన రీతిలో ఐపిఎస్ అధికారులు తాళ్లతో ఆ వాహనాన్ని తాగుతుండగా, ఇతర సిబ్బంది డిజిపి పై పూలు చల్లుతూ కార్యాలయ ప్రధాన ద్వారం వరకు సాగనంపారు. ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ తమ ప్రియతమ అధికారికి వీడ్కోలు పలుకుతుంటే, ఆ ప్రాంగణం మొత్తం భావోద్వేగంతో నిండిపోయింది. టిజిసిఎస్బి డైరెక్టర్ శిఖా గోయల్, జైళ్ల శాఖ



డీజీ సౌమ్య మిశ్రా, శాంతి భద్రతల డీజీపీ మహేష్ ఎం. భగవత్, టిఎస్ఎల్పిఆర్బి చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు, ఎస్పీఎఫ్ డీజీ స్వాతి లక్రా, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ విజయకుమార్ లతో పాటు పలువురు ఐపిఎస్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆయనకు సాదర వీడ్కోలు పలికారు. చివరగా, ప్రధాన గేటు వద్దకు చేరుకున్న శివధర్ రెడ్డి అందరి కృతజ్ఞతలను స్వీకరిస్తూ తన వాహనంలో వెళ్లారు.

# పోలీసు అధికారుల సేవలు వెలకట్టలేనివి: సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్

**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, ఏప్రిల్ 30 (పీపుల్స్ న్యూస్) :** పోలీసు అధికారుల సేవలు వెలకట్టలేనివని సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ అన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన ఏడు మంది పోలీసు సిబ్బందిని సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ, రిటైర్ అయిన సిబ్బందికి పెన్షన్ పత్రాలు అందజేసి, పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భం గా సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ యూనిఫాం పోలీస్‌కు రెండో చర్మంలాంటిదని, ప్రజల కన్నీరు తుడిచి, వారికి సేవలు అందించిన ప్రతి పోలీసు అధికారి పదవీ విరమణ సమయంలో గర్వపడాలన్నారు. ప్రతి పోలీస్ అధికారి తన కుటుంబానికి రుణపడి ఉండాలన్నారు. పోలీసులు విధుల నిర్వహించే క్రమం లో వారి కుటుంబ సభ్యులు ఎన్నో త్యాగాలు చేస్తారని గుర్తు చేశారు. ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, సమాజంలోని పౌరులతో సానుభూతితో, గౌరవంతో మెలగాలని సూచించారు. పదవీ విరమణ చేసిన పోలీసులు తమ అనుభవంతో పోలీస్ శాఖకు అవసరమైనప్పుడు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ బీ ఏడీసీపీ రవికుమార్ డిసీపీగా ప్రమోషన్ పొందినందుకు సీపీ అభినందనలు తెలిపారు. తన పదవీ విరమణ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు చేరువయ్యేందుకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. ఒక కానిస్టేబుల్ కుమారుడిగా కెరీర్‌ను ప్రారంభించి, నేడు డీసీపీ స్థాయికి ఎదగడం పట్ల గర్వంగా ఉందన్నారు. పోలీస్ శాఖలో శారీరక శ్రమతో పాటు 'హ్యూమన్ ఇంటెలిజెన్స్' మేధోపరమైన కృషి ఎంతో కీలకమని ఆయన స్పష్టం చేశారు. తన విజయ ప్రస్థానంలో కుటుంబ సభ్యుల తోడ్పాటు మరవలేనిదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. సైబరాబాద్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిలో ట్రాఫిక్ 2 డీసీపీ రంజన్ రతన్ కుమార్, ఎస్బీ ఎస్ఐ పి. వెంకట్ రెడ్డి, ఏఆర్ఎస్ఐ కె. మురళీధర్ సంగారెడ్డి జిల్లా అటాచ్‌మెంట్‌తో సీఏఆర్ హెడ్క్వార్టర్స్‌లో, ఏఆర్ఎస్ఐ ఎన్. కృష్ణ సీఏఆర్ హెడ్క్వార్టర్స్‌లో, ఏఎస్ఐ వి. వెంకట సూర్యనారాయణ రాజు ఈఓడబ్ల్యూ సైబరాబాద్‌లో, డి. రాములు మోకిల పోలీస్ స్టేషన్‌లో, అలాగే జి. అశోక్, బార్బర్, సీఏఆర్ హెడ్క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తూ తమ పదవీ విరమణ పొందారు. వీరి సేవలను అధికారులు అభినందిస్తూ, భవిష్యత్తు లో ఆరోగ్యంగా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, డీసీపీ క్రైమ్స్









ముత్యం రెడ్డి, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్. సుధీంద్ర, సైబర్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్, విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కర్ణం, ఎస్బి ఏడీసీపీ రవికుమార్, మరియు వివిధ పోలీసు అధికారులు పాల్గొన్నారు.











# అసైన్డ్ భూములలో ఇటుక బట్టీలా..?

- అధికారులు చూసినా.. అడ్డుకోరా..?
- ఒకవైపు పొల్యూషన్, మరోవైపు బాల కార్మికులు..!
- ఇటుకబట్టీని తరలిస్తారా... అక్రమార్కుడుకు అండగా ఉంటారా..?






**కుత్బుల్లాపూర్ : ఏప్రిల్ 30 (పీపుల్స్ న్యూస్)** అసైన్డ్ భూముల్లో ఇటుక బట్టీల నిర్వహణపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బడుగు, బలహీన వర్గాల ప్రజలు వ్యవసాయం చేసుకుని జీవనం సాగించేందుకు ప్రభుత్వం ఉచితంగా కేటాయించిన ఈ భూములు, ప్రస్తుతం తమ అసలు లక్ష్యాన్ని కోల్పోతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో, స్థానిక దళితులకు డబ్బు ఆశ చూపించి, అసైన్డ్ భూములను అద్దెకు తీసుకుని అక్రమంగా ఇటుక బట్టీలను నిర్వహిస్తున్నట్లు సమాచారం. దీనికి సంబంధించి కొందరు అధికారులు కూడా సహకరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటుక బట్టీల కారణంగా పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు, సమీపంలోని వ్యవసాయ భూముల దిగుబడి గణనీయంగా తగ్గుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ పరిస్థితిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వెంటనే అక్రమ బట్టీలను నిలిపివేయాలని, అసైన్డ్ భూములను మళ్లీ అసలు ప్రయోజనాల కోసం ఉపయోగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి, అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటేనే బడుగు వర్గాల హక్కులు రక్షించబడతాయని, పర్యావరణ పరిరక్షణ కూడా సాధ్యమవుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులో కొరవడిన నైతికత.**

అక్రమ బట్టీల యజమాని నిర్లక్ష్యం -- కార్మికులపై అమానుష వ్యవహారం గ్రామీణ ప్రాంతాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న ఇటుక బట్టీల వ్యవహారం రోజురోజుకు ఆందోళన కలిగిస్తోంది. స్థానికంగా "చంద్రబాబు"గా గుర్తింపు పొందిన వ్యక్తి ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ బట్టీలపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం, చట్టాలపై గౌరవం లేకుండా కేవలం ఆర్థిక లాభాల కోసమే కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి కార్మికులను తీసుకువచ్చి, వారికి కనీస వసతి, ఆహారం వంటి మౌలిక సదుపాయాలు కూడా కల్పించకుండా కఠిన పరిస్థితుల్లో పని చేయిస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా బాల కార్మికులను కూడా పనుల్లో నిమగ్నం చేస్తున్నారని ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. ఇది కార్మిక చట్టాల ఉల్లంఘన మాత్రమే కాకుండా మానవ హక్కుల పరంగా కూడా తీవ్రంగా ఖండనీయమని సామాజిక కార్యకర్తలు అంటున్నారు.

ఇంకా, కార్మికులను ఏడాది ఒప్పందాల పేరుతో తీసుకువచ్చి, వారికి తగిన వేతనాలు చెల్లించకుండా, బానిసల మాదిరిగా పని చేయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లోని అమాయక ప్రజలను ఆకర్షించి, కఠిన పనుల్లో నిమగ్నం చేయడం వల్ల వారి జీవన ప్రమాణాలు దెబ్బతింటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి అక్రమ బట్టీలపై సంబంధిత శాఖలు ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కార్మికుల హక్కులను కాపాడడంతో పాటు, బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని వారు స్పష్టం చేస్తున్నారు.

## ములుగు'ను టాప్?లో నిలిపిన 100 డేస్ ప్లాన్ - ఆ ముద్ర నుంచి బయటపడిన వికారాబాద్



**ములుగు జిల్లా :** బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో తొలిసారిగా ములుగు జిల్లా అత్యధికంగా 99.30 శాతం ఉత్తీర్ణతతో అగ్ర స్థానంలో నిలిచింది. ఆ జిల్లాలో 3,287 మంది విద్యా ర్థులకు గానూ 3,264 మంది ఉత్తీర్ణులయ్యారు. కొద్ది రోజుల క్రితం వరకు అక్కడ జిల్లా కలెక్టర్‌గా పని చేసిన టీఎస్ దివాకర ఉత్తీర్ణత శాతం పెంచేందుకు 100 రోజుల ప్రత్యేక ప్రణాళికను అమలు చేశారు. అందులో భాగంగా మోడల్ పరీక్షలు నిర్వహించడం లాంటి పలు వినూత్న కార్యక్రమాలు చేపట్టడం సత్ఫలితాలనిచ్చిందని అధికారులు చెబుతున్నారు. గత మూడు సం వత్సరాలుగా అతి తక్కువ ఉత్తీర్ణతతో వికారాబాద్ జిల్లా అట్టడుగు స్థానానికి పరిమి తమవగా, ఈసారి వచ్చిన ఫలితాలతో ఆ ముద్ర చెరిగిపోయింది. గత ఏడాది ఆ జిల్లా 73.97 శాతంతో చివరి స్థానానికి పరిమితం కాగా, ఈసారి 91.25 ఉత్తీర్ణతా శాతం నమో దు చేసింది. అదే సమయంలో మూడేళ్ల తర్వాత హైదరాబాద్ జిల్లా 89.23 శాతంతో చివరి స్థానానికి పడిపోయింది. మళ్లీ పైకొచ్చిన నిర్మల్ జిల్లా : 2023, 2024లో అత్యధిక ఉత్తీర్ణతతో మొదటి స్థానంలో నిలిచిన నిర్మల్ జిల్లా, గతేడాది 15వ స్థానానికి పడిపోయింది. ఈసారి మళ్లీ 98.96 శాతంతో టాప్?-3లోకి చేరుకుంది. ఆ జిల్లాలో 9,743 మందికి 9,642 మంది విద్యార్థులు ఉత్తీర్ణుల య్యారు. పది ఫలితాల్లో బాలికలే టాప్ : పదో తరగతి ఫలితాల్లో మొత్తంగా 95.15 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలికల్లో 96.26 శాతం, బాలురు 94.07 శాతం ఉత్తీర్ణులయ్యారు. 5,731 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత నమోదైంది, 6 పాఠశాలల్లో 0 శాతం ఉత్తీర్ణత నమోదవ్వడం గమనార్హం. ములుగు జిల్లాలో అత్యధికంగా 99.30 శాతం, అత్యల్పంగా హైదరాబాద్ జిల్లాలో 89.23 శాతం ఉత్తీర్ణత నమోదైంది. సాంఘిక సంక్షేమ గురుకులాలు ఉత్తమ ఫలితాలు సాధించాయి. ఇక్కడ 99.10 శాతం ఉత్తీర్ణత నమోదైంది. తెలుగు మాధ్యమం 89.14 శాతం, ఆంగ్ల మీడియం విద్యార్థుల్లో 95.86 శాతం, ఉర్దూ మీడియం విద్యార్థుల్లో 86.71 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

## పోలీస్‌శాఖలో భారీగా యాక్సిలరేటెడ్ ప్రమోషన్లు



**హైదరాబాద్, ఏప్రిల్ 30:** తెలంగాణ పోలీసు శాఖలో మునుపెన్నడూ లేని విధంగా భారీ స్థాయిలో యాక్సిలరేటెడ్ (త్వరిత గతిన) పదోన్నతులు కల్పించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. రాష్ట్రంలో మావోయి స్టుల ప్రాబల్యాన్ని సమర్థవంతంగా అడ్డుకోవ డమే కాకుండా.. వారిని జనజీవన స్రవంతిలో కలిపేలా వ్యూహరచన చేసిన అధికారులకు ఈ పదోన్నతుల్లో పెద్దపీట వేయనున్నారు. ము ఖ్యంగా మావోయిస్టు పార్టీ దాదాపుగా కను మరుగైపోవడానికి కారకులైన క్షేత్రస్థాయి అధికారుల నుంచి ఉన్నతాధికారుల వరకు ఈ జాబితాలో ఉండటం విశేషం. గడిచిన రెండేళ్ల కాలంలో తెలంగాణ పోలీసుల వ్యూహాల కారణంగా ఏకంగా 818 మంది మావోయి స్టులు అజ్ఞాతాన్ని వీడి లొంగిపోయారు. ఛత్తీస్‌గ ఢ్‌లో ఆపరేషన్ కగార్ ఉద్ధృతంగా సాగుతున్న తరుణంలో ఆ రాష్ట్ర కేడర్ మావోయిస్టులు సైతం భద్రత కోసం తెలంగాణ పోలీసులను ఆశ్రయించడం రాష్ట్ర నిఘా వర్గాల పనితీరుకు నిదర్శనంగా నిలిచింది. డీజీపీ శివధర్‌రెడ్డి, ఆపరేషన్లను కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ విజయాల్లో కీలకంగా వ్యవహరించిన స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ అధికారులతో పాటు, సరిహద్దు జిల్లాలైన భద్రాద్రి కొత్తగూడెం, ములు గు, భూపాలపల్లి, ఆసిఫాబాద్ పోలీసులకు పదోన్నతుల పంట పండనుంది.

## చిన్నారుల అక్రమ రవాణా ముఠా గుట్టు రట్టు - మురుగన్ గ్యాంగ్‌ను అరెస్ట్ చేసిన గుజరాత్ పోలీసులు




**హైదరాబాద్:** చిన్నారుల అక్రమ రవాణా కేసులో మురుగన్ ముఠా గుట్టు రట్టైంది. హైదరాబాద్‌లో మరోసారి తనిఖీలు చేపట్టిన గుజరాత్ పోలీసులు, మురుగన్ గ్యాంగ్‌ను అరెస్టు చేశారు. ఆదిలాబాద్‌లో గతేడాది వరకు ఇటుకల బట్టీలో పని చేసిన మురుగన్, ఒక్క ఏడాదిలోనే చైల్డ్ ట్రాఫికింగ్‌లో కీలకంగా మారాడు. గతేడాది చైతన్యపురి పీఎస్‌లో నమోదైన కేసులో మురుగన్ పేరు వెలుగులోకి వచ్చింది. 3 నెలల పాటు జైలులో ఉండి జులైలో విడుదలైన మురుగన్, ఆ తర్వాత దేశవ్యాప్తంగా చైల్డ్ ట్రాఫికింగ్ ముఠా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. మురుగన్ భార్య కృష్ణవేణి మరో గ్యాంగ్‌ను నడుపుతున్నట్లు గుజరాత్ పోలీసులు గుర్తించారు. 25 మంది చిన్నారుల విక్రయాలు చేసినట్లు తేల్చారు. అయితే మురుగన్ గ్యాంగ్ సమాచారంతో హైదరాబాద్‌లో 3 ఫెర్టిలిటీ సెంటర్లకు సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కూకట్‌పల్లి, సికింద్రాబాద్, బంజారాహిల్స్ ఫెర్టిలిటీ సెంటర్లలో సోదాలు చేశారు. 'ఆపరేషన్ దేవ్'తో బయటపడిన మురుగన్ నేర చరిత్ర : ఏప్రిల్ 6వ తేదీన గుజరాత్‌లోని బనాస్‌కాంత జిల్లాలో దేవ్ అనే నాలుగేళ్ల బాలుడు కిడ్నాప్ అయ్యాడు. దీనిపై దర్యాప్తు ప్రారంభించిన అక్కడి పోలీసులు స్థానిక కిడ్నాపింగ్ ముఠాను గుర్తించి బాలుడిని కాపాడారు. ఆ బాలుడిని మరో ముఠాకు అమ్మేందుకే కిడ్నాప్ చేశామని చెప్పిన ఆ ముఠా, ఆ క్రమంలోనే మురుగన్ పేరును బయటపెట్టింది. దీంతో ఆ పేరు మీద ఏదైనా నేర చరిత్ర ఉందేమోనని పోలీసులు తమ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల పోలీసుల రికార్డులనూ వెతికారు. అంతేకాదు మురుగన్ ముఠా గురించి ఏఐ సాయం తీసుకోగా, మురుగన్ అలియాస్ బోగాసు నాగరాజు పేరు వెలుగులోకి వచ్చింది. గతంలో మురుగన్‌పై రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని చైతన్యపురి పోలీస స్టేషన్‌లో కేసు నమోదు కావడంతో పూర్తి వివరాలు తెప్పించుకున్నారు. వారం రోజుల క్రితం కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణం నౌగాంబస్తీకి చెందిన మురుగన్‌ను, అతడి ముఠాలో ఉన్న కాసారపు తిరుపతి, కాసారపు మల్లయ్యలను గుజరాత్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరం దరినీ విచారించగా ముఠాలో ప్రధాన సూత్ర ధారులైన కృష్ణవేణి, అమూల్య పేర్లు బయటకు వచ్చాయి. ఇప్పుడు పరారీలో ఉన్న వీరి కోసం గుజరాత్ పోలీసులు గాలిస్తున్నారు. ఐవీఎఫ్ కేంద్రాల వద్ద కాపుకాసి విక్రయాలు : హైదరాబాద్ మలక్‌పేటకు చెందిన సోమ అమూల్య, సూరారం ప్రాంతానికి చెందిన కృష్ణవేణి, హైదరాబాద్? ప్రాంతానికి చెందిన ఇస్మాయిల్ అనే వ్యక్తితో కలిసి డబ్బులు సంపాదించేందుకు పిల్లల్ని విక్రయించేవారు. వీరంతా కలిసి ఐవీఎఫ్ కేంద్రాల వద్ద కాపుకాసి, పిల్లలు లేని దంపతులకు చిన్నారులను అమ్ముతామని రూ. లక్షల్లో ఒప్పందం చేసుకునే వారు. ఈ క్రమంలోనే బోదాసు నాగరాజు వీరితో కలిశాడు. ఆ తర్వాత వీరంతా కలిసి ఓ ముఠాగా ఏర్పడి మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్‌లలో ఏజెంట్లను నియమించుకొని పిల్లల అమ్మకం మొదలుపెట్టారు. ఈ క్రమంలో రెండుసార్లు పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లినా, తిరిగి వచ్చాక మళ్లీ ఇదే పనిగా కిడ్నాప్‌లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తమకు బాలుడు కావాలని గుజరాత్ ముఠా సంప్రదిం చగా, ఈ ముఠా కిడ్నాప్‌నకు పాల్పడింది. ఆపరేషన్ దేవ్ పేరుతో అక్కడి పోలీసులు దర్యాప్తు చేయగా, మురుగన్? ముఠా వ్యవహారం బయటకు వచ్చింది.

## జనగామ మున్సిపల్ మీటింగ్‌లో రచ్చ బీఆర్ఎస్ ఆందోళన




**జనగామ, ఏప్రిల్ 30 :** జనగామలో (శుక్రవారం) జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమా వేశం ఉద్రిక్తంగా మారింది. మున్సిపల్ వైస్ చైర్మన్ భూష పర్వతాలకు వేదికపై కుర్చీ ఇవ్వలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు నిరసనకు దిగారు. ఈ సమావేశం ప్రారం భమైన వెంటనే వైస్ చైర్మన్‌కు ప్రోటోకాల్ ప్రకా రం స్థానం ఇవ్వలేదని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది కౌన్సిలర్లు స్వయంగా కుర్చీ తీసుకువచ్చి వైస్ చైర్మన్‌ను కూర్చోబెట్టడం పరిస్థితిని ఉద్రిక్తంగా మార్చింది. వివాదం మరింత పెరగడంతో పోలీసులు జోక్యం చేసుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ ఆదేశాల మేరకు వేదికపై కూర్చున్న వైస్ చైర్మన్‌ను పోలీసులు కిందకు దించారు. ఈ చర్యతో బీఆర్ఎస్ నాయకులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్ వివరణ.. మున్సిపల్ చైర్‌పర్సన్ కడమంచి బాలమణి ఈ వివాదంపై స్పందించారు. ఈ వేదికపై కూర్చోవడానికి ప్రత్యేక హక్కు లేదా నిబంధన లేమి లేవని, కమిషనర్ మార్గదర్శకాల ప్రకారమే సమావేశం నిర్వహించామని తెలిపారు. ఈ ఘటనలో ప్రోటోకాల్ ఉల్లంఘన జరగలేదని స్పష్టం చేశారు. ఈ వివరణతో అసంతృప్తి చెందని బీఆర్ఎస్ నాయకులు వేదిక ముందు కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సమావేశాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. వైస్ చైర్మన్‌కు కనీస గౌరవం ఇవ్వలేదని ఆరోపించారు.

## రమావత్ మధు మైక్రో ఫైనాన్స్ కేసు.. సింగర్ మంగ్లీ సోదరుడు ఖాతాకు డబ్బులు



**హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తోన్న మైక్రో ఫైనాన్స్ కేసు కీలక మలుపు తిరిగింది. సింగర్ మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ అకౌంట్‌కు నిందితుడు రమావత్ మధు నగదు పంపినట్లు పోలీసులు గుర్తించారు. కేసు విచారణలో భాగంగా రమావత్ మధు అకౌంట్‌ను పరిశీలించగా.. మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ అకౌంట్‌కు డబ్బులు పంపినట్లు తేలింది. మూడుసార్లు నగదు ట్ర టాన్స్‌ఫర్ అయినట్లు పోలీసులు గుర్తించారు. డబ్బులు పడిన రోజే ఖాతా నుంచి విత్ డ్రా చేసినట్లు నిర్ధారించారు. ఈ మేరకు రమావత్ మధు అకౌంట్‌ను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం(ఈవోడబ్ల్యూ) సీజ్ చేసింది. రమావత్ మధు, హిమకాంత్‌రెడ్డి, శివ చౌహాన్‌కు చెందిన అకౌంట్ల పూర్తి వివరాలను ఇవ్వాలని సంబంధిత బ్యాంకులకు పోలీసులు లేఖ రాశారు.

## వీహెచ్‌కు రేవంత్ సర్కార్ బంపరాఫర్ కేబినెట్ హోదాతో పదవి, ఉత్తర్వులు జారీ



తెలంగాణ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు (వీహెచ్) కు తెలంగాణ ప్రభుత్వం కీలక పదవిని కట్టబెట్టింది. రాష్ట్ర బీసీ సంక్షేమ, అభివృద్ధి శాఖ సలహాదారుగా ఆయనను నియమిస్తూ బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలు, బీసీ వర్గాలపై ఆయనకున్న పట్టును గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ప్రభుత్వ పాలనలో ఆయన అనుభవాన్ని వినియోగించుకోవాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ నియామకంతో హనుమం తరావుకు ప్రభుత్వం ఉన్నత గౌరవాన్ని కల్పిం చింది. ఆయనకు రాష్ట్ర మంత్రి హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రోటోకాల్ ప్రకారం ఆయన అన్ని ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో మంత్రులతో సమానమైన గౌరవం, ప్రాధాన్యత లభించను ంది. సలహాదారుగా నియమితులైన వీహెచ్‌కు ప్రభుత్వం కల్పించే సదుపాయాల వివరాలను జీవోలో స్పష్టంగా వెల్లడించారు. నెలకు రూ. లక్ష గౌరవ వేతనంతో పాటు ప్రత్యేక అలవె న్సులు ఉన్నాయి. ఆయన ప్రభుత్వ క్వార్టర్స్ కేటాయిస్తారు. ఒకవేళ స్వంత ఇల్లు లేదా అద్దె ఇంట్లో ఉంటే నెలకు రూ. 50 వేల చొప్పున ఇంటి అద్దె భత్యం చెల్లిస్తారు. సొంత కారు ఉపయోగిస్తే నెలకు రూ. 30 వేలు కన్వేయన్స్ అలవెన్స్, దాంతో పాటు రూ. 15 వేలు ఇంధన చార్జీలు అందుతాయి. అఖిల భారత సర్వీసు మెంట్ సౌకర్యం ఉంటుంది. సలహాదారు విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిబ్బందిని సైతం కేటాయించింది. ఒక ప్రైవేట్ సెక్రటరీ, ఒక డీఈఓ, ఇద్దరు ఆఫీస్ సబార్డినేట్లు, ఒక డ్రైవర్‌తో పాటు నివాసంలో ల్యాండ్ లైన్ ఫోన్, మొబైల్ ఫోన్ సౌకర్యాన్ని కల్పించనున్నారు. బీసీల అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వానికి సూచనలు ఇవ్వడం, సంక్షేమ పథకాల అమలును పర్యవేక్షించడంలో వీహెచ్ కీలక పాత్ర పోషించనున్నారు. ఈ నియామకం పట్ల బీసీ నేతలు, కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఇక తెలంగాణ డీజీపీగా పదవీ విరమణ చేసిన శివధర్ రెడ్డి రాష్ట్ర భద్రతా సలహాదారుగా నియమితులయ్యారు. జీవో నెం. 559 ద్వారా ప్రభుత్వం ఆయన నియామకాన్ని ఖరారు చేసింది. చీఫ్ సెక్రటరీ హోదాలో మూడేళ్ల పాటు శివధర్ రెడ్డి ఈ పదవిలో కొనసాగనుండగా.. ఆయనకు నెలకు రూ. 2.25 లక్షల వేతనం అందనుంది. శాంతిభద్రతలు, నేర నియంత్రణ, నార్కోటిక్స్ నియంత్రణలో ప్రభుత్వానికి ఆయన సలహాలు అందించనున్నారు. ఆయన కోసం హోంశాఖ ప్రత్యేక కార్యాలయాన్ని, సిబ్బందిని కూడా కేటాయించింది.

## పశుసంవర్ధక రంగంలోకి రండి.. యువతకు మంత్రి అచ్చెన్నాయుడు పిలుపు



**అమరావతి, ఏప్రిల్ 30:** ఏపీలో సుమారు 25 లక్షల మంది రైతులు పశుసంవర్ధక రంగంపై ఆధారపడి ఉన్నారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. గురువారం ఉదయం పశు సంవర్ధక మార్గదర్శిని ఈ–మ్యాగజైన్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. 2025–26లో ఈ రంగం ద్వారా రూ.1,76,151 కోట్ల స్థూల విలువ వృద్ధి కలిగిందని చెప్పారు. యువత సాంకేతిక రంగాలవైపు వెళుతూ పశు సంవర్ధకానికి దూరమవుతున్నారని అన్నారు. ఏఐ ప్రభావంతో ఉద్యోగాలు తగ్గే పరిస్థితి ఏర్పడుతోందని. అందుకే యువత పశుసంవర్ధక రంగంలోకి రావాలని కోరారు. పాడి పశువులు, కోళ్లు, పందుల పెంపకాన్ని వాణిజ్య పరంగా చేపట్టాలని మంత్రి సూచించారు. విశాఖలో 3 రోజుల శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశామని.. ఇప్పటివరకు 1500 మందికి శిక్షణ ఇచ్చామని అచ్చెన్నాయుడు తెలిపారు. అందులో 200 మంది విజయవంతంగా వ్యాపారం ప్రారంభించారన్నారు. ఏప్రిల్ నుంచి ఈ– మ్యాగజైన్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. స్మైల్ వెబ్‌సైట్, వాట్సాప్ ద్వారా అందరికీ చేరుస్తున్నామన్నారు. పశుఆరోగ్యం, పోషణ, మార్కెటింగ్‌పై పూర్తి సమాచారం అందుతుందని తెలిపారు. రైతుల విజయగాథలు, నిపుణుల సూచనలు ఇందులో ఉంటాయన్నారు. సహాయక సిబ్బందికి కూడా ఆధునిక జ్ఞానం అందుతుందని వెల్లడించారు. సేంద్రియ పద్ధతుల్లో పెంపకం చేస్తే సంవత్సరానికి ఒక ఎకరానికి రూ.5 నుంచి రూ.6 లక్షలు సంపాదించవచ్చని తెలిపారు. 'ప్రతి ఇంటి నుంచి ఒక ఆంత్రప్రెన్యూర్ రావాలి.. అదే మా లక్ష్యం' అని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# జూన్‌లో రాష్ట్రానికి ప్రధాని మోదీ – టీడీపీ మహానాడు వేదిక నెల్లూరుకు మార్పు

**శ్రీకాకుళం:** తెలుగుదేశం పార్టీ పసుపు పండుగ మహానాడు వేదిక శ్రీకాకుళం నుంచి నెల్లూరుకు మార్చే అవ కాశంపై పార్టీ వర్గాల్లో చర్చలు సాగుతు న్నాయి. మే 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఘనంగా ఈ మహో త్సవాన్ని నిర్వహించాలని పార్టీ ముందుగా నిర్ణ యించుకుంది. శ్రీకాకుళంలో ఈ వేడుకను నిర్వహించేందుకు పార్టీ నేతల మధ్య ఏకాబి ప్రాయం కూడా ఏర్పడిందిరెండూ ఒకే చోట అయితే సమస్యలు: కానీ, జూన్ నెలలో భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం, అలాగే ఉత్తరాంధ్రలో పలు కార్యక్రమాల్లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనడానికి రాష్ట్రానికి రాబోతుండటంతో ఈ విషయం మరోసారి పునరాలోచనలోకి వచ్చింది. ప్రధాని పర్యటన ఏర్పాట్లు, మహానాడు నిర్వహణ రెండూ ఒకే ప్రాంతంలో ఉంటే సాంకేతిక సమస్యలు, నిర్వహణలో ఇబ్బందులు కలగవచ్చని పార్టీ అధిష్ఠానం భావిస్తోంది.మహానాడు నిర్వహణకు ప్రదేశాల




పరిశీలన : ఈ నేపథ్యంలో మహానాడు వేదిక మార్చడం అవసరం అని పార్టీ అధిష్ఠానం భావించి నెల్లూరు జిల్లాలో మహానాడు నిర్వహణకు అనువైన ప్రదేశాలను పరిశీలించమని జిల్లా పార్టీ నేతలకు సూచనలు పంపింది. నెల్లూరు వేదికగా ఎంపిక అయితే, అక్కడి సౌకర్యాలు, రవాణా, భద్రతా ఏర్పాట్లను బాగా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఏర్పాట్లపై ముందస్తు ప్రణాళికలు : పార్టీ అధినే త చంద్రబాబు నాయుడు, కార్యనిర్వాహక అధ్యక్షులు లోకేశ్‌లు ఈ వేదిక మార్పు అంశ ంపై తుది నిర్ణయాన్ని త్వరలో తీసుకోనున్నట్లు తెలుస్తుంది. గత సంవత్సరంలో కడప గడ్డపై ఘనంగా నిర్వహించిన మహానాడు విజయ వంతం కావడంతో ఈసారి కూడా వేదిక ఎంపిక ఏర్పాట్లపై జాగ్రత్తగా ముందస్తు ప్రణా ళికలు తయారు చేయడం కీలకం.సాఫీగా సాగేలా పార్టీ కార్యాచరణ : ప్రధాని పర్యటనతో సంబంధించి ఏర్పాట్ల సమస్యలను దృష్టిలో పెట్టుకుని, వేదిక మార్పు ద్వారా మహానాడు నిర్వహణ సాఫీగా సాగేలా చూడాలని పార్టీ ఉద్దేశిస్తోంది. నెల్లూరు వేదికగా ఎంపిక అయితే అక్కడి స్థానిక నేతలతో సమన్వయం పెంచి, భారీ జనసమూహాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధమవుతుందని తెలుస్తోంది.

తెలుగుదేశం పార్టీ పసుపు పండుగ మహానాడు వేదిక మార్పు నిర్ణయం ప్రధానంగా ప్రజాస్వామిక, సాంకేతిక కారణాల వల్ల పునరాలోచనలో ఉంది. పార్టీ నేతల బృందం ఈ అంశంపై త్వరలో తుది నిర్ణయం వెల్లడిస్తుందని అంచనా.

# తెలంగాణ, ఏపీ మధ్య డబ్బుల పంచాయితీ

**అమరావతి, ఏప్రిల్ 30 :**తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సి నిధుల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. తెలంగాణ ప్రభుత్వం తెలుగు అకాడమీ నిధులను విడుదల చేయాలి ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్‌డీ విల్సన్ డిమాండ్ చేశారు. తెలంగాణ నుంచి రాష్ట్ర విభజన ప్రకారం ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీకి రావాల్సిన నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. కోర్టు ఆదేశాలున్నా సరే తెలంగాణ ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదన్నారు విల్సన్. ఇప్పటికే తెలంగాణ నుంచి రావాల్సిన నిధులపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, సమగ్ర శిక్షా అధికారులకు లేఖలు రాసిన విషయాన్ని గుర్తు చేశారు.ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీకి నిధులు లేకవివడంతో కార్యకలాప్షల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ విల్సన్. ఏపీ ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాల ప్రింటింగ్‌కు సంబంధించిన బకాయిలు రూ.50 కోట్లు కూడా రావాల్సి




ఉంది అన్నారు. ఈ నిధుల్ని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. ఏపీలో కూడా తమిళనాడు తరహాలో వర్చువల్ అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తెలుగు, సంస్కృత అకాడమీ భవనం కోసం భూమి కేటాయిస్తే రూ.15 కోట్లతో నిర్మిస్తామన్నారు విల్సన్. తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్‌కు కేబినెట్ హోదా కల్పించాలని ఏపీ ప్రభుత్వాన్ని విల్సన్ కోరారు. అలాగే అకాడమీ పుస్తకాలను ప్రైవేట్ విద్యా సంస్థలు పంపిణీ చేయడం లేదని.. ఈ ఏడాది నుంచి వారు కూడా పుస్తకాలు కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఆదేశాలివ్వాలన్నారు. అలాగే అకాడమీలో ఖాళీగా ఉన్న 13 పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు.రాష్ట్ర విభజన తర్వాత తెలుగు అకాడమీ ఆస్తుల్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య 58:42 నిష్పత్తిలో పంపిణీకి గతంలోనే ఒప్పందం కుదిరింది. తెలంగాణ నుంచి ఏపీ తెలుగు అకాడమీకి రావాల్సిన వాటా నిధుల కోసం ఏపీ అకాడమీ డిమాండ్ చేస్తోంది. కోర్టు కూడా నిధులు ఇవ్వాలని చెప్పినా తెలంగాణ ప్రభుత్వం స్పందించడం లేదని చెబుతున్నారు. గతంలో సుప్రీం కోర్టు ఈ నిధులపై కీలక ఆదేశాలు ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం ఏపీ తెలుగు అకాడమీకి ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. హైకోర్టు 2021లో ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ.. బకాయిలపై 6% వడ్డీతో సహా చెల్లించాలని తేల్చి చెప్పింది. సుప్రీం కోర్టు చేయడం లేదనితీర్పును సమర్థిస్తూ.. బకాయి లపై 6% వడ్డీతో ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ ఆరోపిస్తోంది. ఈ నిధుల అంశంపై తెలంగాణ ప్రభుత్వం స్పందించాల్సి ఉంది. మొత్తం మీద తెలుగు రాష్ట్రాల మధ్య ఆస్తులు, నిధుల పంచాయితీలు ఇంకా కొలిక్కి రాలేదు.

## విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో మహిళపై అత్యాచారం.. యువకుడి అరెస్ట్

**అమరావతి, ఏప్రిల్ 30:** విశాఖ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో వివాహితపై అత్యాచారం చేసిన యువకుడిని విజయవాడ రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. అతడిని ఒడిశా రాష్ట్రానికి చెందిన శౌరవ్ బగ్గిగా గుర్తించారు. ఇంతకీ ఏం జరిగిందంటే.. పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన భార్యాభర్తలు ఉపాధి నిమిత్తం విశాఖపట్నంలో స్థిరపడ్డారు. గత ఆదివారం సాయంత్రం సొంతూరుకు వెళ్లేందుకు విశాఖ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ ఎక్కారు. జనరల్ బోగీలో బాగా రద్దీగా ఉండటంతో దంపతులిద్దరూ బాత్‌రూము దగ్గర కూర్చున్నారు.ఏసీ బోగీలో బాయ్‌గా పని చేస్తున్న శౌరవ్ బగ్గి.. దంపతులిద్దరినీ ఏసీ బోగీలో కూర్చోవచ్చని పిలిచాడు. ఇద్దరూ ఏసీ కోచ్‌లోకి వెళ్లిన తర్వాత భర్త బాత్‌రూమ్ దగ్గర సెల్‌ఫోన్ చూసుకుంటూ నిలబడిపోయాడు. భార్య శౌరవ్‌తో పాటు లోపలకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన యువకుడు ఆమెపై అత్యాచారం చేశాడు. ఈ విషయం బయటకు తెలిస్తే రైలులో గొడవలు జరుగుతాయనే



భయంతో బాధితురాలు భర్తకు చెప్పలేదు.ఇంటికి వచ్చిన తర్వాత భార్య ముభావంగా ఉండటంతో భర్త గట్టిగా నిలదీశాడు. దీంతో ఆమె జరిగిన దారుణాన్ని బయటపెట్టింది. ఇద్దరూ కలిసి రెంటచింతల పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి విజయవాడ రైల్వే పోలీసులకు బదిలీ చేశారు. రైల్వే పోలీసులు నిన్న నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

## ఏపీలో పెట్టుబడులకు ముందుకొచ్చిన టైటాన్ సంస్థ

**అమరావతి, ఏప్రిల్ 30 :**



రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పూర్తిస్థాయిలో ముందుకు వచ్చే సంస్థలకు ప్రభుత్వం తరపున పూర్తిస్థాయిలో సహాయ, సహాకారాలు అందిస్తామని ఏపీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో నేడు ఆంధ్రప్రదేశ్ దేశానికే పెట్టుబడుల హాబ్‌గా నిలుస్తోందని పేర్కొన్నారు. సుస్థిరమైన, నమ్మకమైన, బలమైన కూటమి పాలనపై విశ్వాసంతోనే రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. (శుక్రవారం) మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో టైటాన్ డిఫెన్స్ గ్రూప్ ప్రతినిధులు సమావేశం అయ్యారు. సచివాలయంలోని ఆర్ అండ్ బీ, ఐ అండ్ ఐ శాఖ కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వ కంగా టైటాన్ డిఫెన్స్ సిస్టమ్స్ లిమిటెడ్ గ్రూప్ ఛైర్మన్, సీఈఓ కె. గిరికుమార్, సంస్థ ప్రతినిధులు కలిశారు. ప్రస్తుతం ఏపీలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని టైటాన్ సంస్థ ప్రతినిధులకు మంత్రి వివరించారు. ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న టైటాన్ కంపెనీ నిర్వాహకులు ఆసక్తి చూపించారు. కర్నూలు ఎయిర్ పోర్టులో ఎమ్మార్వో, సిమ్యులేషన్ సెంటర్ల ఏర్పాటుకు ఈ సంస్థ ఆసక్తి చూపుతోంది. అలాగే, నంద్యాల జిల్లాలో డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ స్థాపనకు సంస్థ ప్రతినిధులు ఉత్సాహం చూపించారు. తమ సంస్థకు ఏవియేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్, మైనింగ్,ట్రేడింగ్ వంటి బహుళ రంగాల్లో ఉన్న అనుభవాన్ని సంస్థ ప్రతినిధులు వివరించారు. ఉత్పత్తి శ్రేణితో పాటు శిక్షణ, పరీక్ష, ధ్రువీకరణ, ఉన్నతీకరణ, ఆధునికీకరణ, నిర్వహణకు కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేయడంలో తమకు అనుభవం ఉందని టైటాన్ గ్రూప్ నిర్వాహకులు తెలిపారు.

# రూ.1208.41 కోట్లతో క్వాంటం వ్యాలీ ట్విన్ టవర్ల నిర్మాణం

**అమరావతి, ఏప్రిల్ 30 :** ఉద్యోగ, మౌలిక వసతులు, వ్యవసాయం, పట్టణాభివృద్ధి, పెట్టుబడులు వంటి అంశాలపై రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. మున్సిపాలిటీలకు చెందిన ఆస్తుల లీజ్ రెన్యూవల్, అద్దె నిర్ణయ విధానాల సవరణలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో మ్యూటేషన్ ఛార్జీలను ఒకే విధంగా అమలు చేసే చట్ట సవరణ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. అమరావతిలో పలు కీలక నిర్మాణాలకు సంబంధించి క్యాబినేట్ పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గం 20కుపైగా అజెండా అంశాలకు ఆమోదం తెలిపింది.స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ 2000 బ్యాచ్‌కు చెందిన 385 మంది కానిస్టేబుళ్లను హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పించే ప్రతిపాదనకు ఆమోదించింది. రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో మ్యూటేషన్ ఛార్జీలను ఒకే విధంగా అమలు చేసే చట్ట సవరణ ప్రతిపాదనలకు అంగీకారం తెలిపింది. హైకోర్టు, జిల్లా న్యాయస్థానాల్లో చీఫ్ కోర్ట్ మేనేజర్, సీనియర్ కోర్ట్ మేనేజర్లు, కోర్ట్ మేనేజర్లతో కలిపి 21 కొత్త పోస్టులు సృష్టికి



ఆమోదం లభించింది. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో అడ్వకేట్స్–ఆన్–రికార్డ్ కార్యాలయంలో ఆఫీస్ మేనేజర్ పోస్టును సెక్షన్ ఆఫీసర్‌గా అప్‌గ్రేడ్ చేసే ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏపీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్, ఈటీసీ శిక్షణ కేంద్రాల్లో 20 పోస్టులు (6 రెగ్యులర్, 14 అవుట్ సోర్సింగ్) సృష్టించే ప్రతిపాదనకు ఆమోదం లభించింది.ఢిల్లీలో కొత్త ఏపీ భవన్ నిర్మాణం: అదనంగా మరో 9 ఆఫీస్ సబ్‌ఆర్డినేట్ పోస్టులను అవుట్‌సోర్సింగ్ ద్వారా భర్తీ చేసే ప్రతిపాదనకు అంగీకారం తెలిపింది. ప్రకాశం జిల్లా రామాయపట్నంలో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ పోర్ట్ ప్రాజెక్ట్ నిర్మాణ పనులకు రూ.354 కోట్ల మేర పాలనా అనుమతులకు క్యాబినెట్ ఆమోదించింది. ఏపీ మార్క్‌ఫెడ్‌కు రూ.1800 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ గ్యారంటీ ఇచ్చే ప్రతిపాదనకు అలానే ఢిల్లీలో 11.5 ఎకరాల్లో రూ.124.50 కోట్ల అంచనాతో కొత్త ఏపీ భవన్ నిర్మాణ ప్రతిపాదనకు అంగీకారం తెలిపింది. నెల్లూరు, కాకినాడ, కర్నూలు, కడప ప్రాంతాల్లో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రాజెక్ట్ విలువపై 2 శాతం స్టాంప్ డ్యూటీ మినహాయింపు ఇచ్చే ప్రతిపాదనకు ఇంక కృష్ణా నది తీర రక్షణ పనులకు రూ.443.26 కోట్లతో 3 ప్యాకేజీలకు సవరించిన పరిపాలనా అనుమతులు ఇచ్చారు.అమరావతిలో క్వాంటం వ్యాలీ ట్విన్ టవర్ల నిర్మాణానికి రూ.1208.41 కోట్లు వ్యయం చేసేందుకు మంత్రివర్గం అమోదం తెలిపింది. సచివాలయ, జీఏడీ, హెచ్ ఓడీ టవర్ల నిర్మాణంలో ఫాసేడ్, గ్లేజింగ్, క్లాడింగ్ పనులు చేపట్టేందుకు గానూ రూ.2540 కోట్ల వ్యయం చేసేందుకు, రాష్ట్ర శాసనసభ భవనంలో వివిధ సివిల్ స్ట్రక్చర్ పనులకు గానూ రూ.798 కోట్లను వ్యయం చేసేందుకు ఆమోదం లభించింది. ఎల్పీఎస్ జోన్ 11లో రోడ్లు, డ్రైన్లు, నీటి సరఫరా, మురుగునీటి పారుదల లాంటి మౌలిక సదుపాయాలను చేపట్టేందుకు ఆమోదం తెలిపింది. రాజధానిలో 220 కేవీ లైన్స్ రీరూటింగ్ చేసేందుకు రూ.1180.54 కోట్ల మేర పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు.పెన్షన్ మంజూరు నిబంధనల్లో మార్పు: 2వ దశ ఎల్పీఎస్ గ్రామాల్లో రైతులకు యాన్యుటీ, పెన్షన్ మంజూరు కోసం తెలిపింది. మెట్ట భూములకు ఎకరాకు రూ.40 వేల చొప్పున, జరీబుకు రూ.60 వేలకు కౌలును పెంపుకు అలానే ప్రతీ ఏటా మెట్ట భూములకు రూ.3 వేల చొప్పున, జరీబు భూములకు రూ.5 వేల చొప్పున పదేళ్ల పాటు పెంచెందుకు ఆమోదం లభించింది. వివిధ సంస్థలకు భూములను కేటాయించే ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జలవనరులు, రెవెన్యూ, రవాణ శాఖలకు సంబంధించి పరిపాలనా అనుమతులు, సేవల మెరుగు ప్రతిపాదనలకు ఆమోదించింది.

# చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు – వేంపల్లి పోలీస్ స్టేషన్‌కు అంబటి రాంబాబు

**అమరావతి, ఏప్రిల్ 30 :**సీఎం చంద్రబాబును ఉద్దేశించి అనుచితంగా అసభ్యకరంగా మాట్లాడిన వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబును కడప జిల్లా వేంపల్లి పోలీసులు విచారిస్తున్నారు. 3 నెలల కిందట అంబటి రాంబాబు చేసిన అసభ్యక రమైన వ్యాఖ్యలపైన వేంపల్లి, పులివెందుల పోలీస్ స్టేషన్లో కేసులు నమోదు అయ్యాయి. వేంపల్లి టీడీపీ నేత రామమునిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్లో బీఎన్ఎస్ యాక్ట్ 196, 352, 353 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పులివెందుల పోలీస్ స్టేషన్లో కూడా మరో టీడీపీ నేత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇవే సెక్షన్లు అంబటి రాంబాబు పైన నమోదు చేశారు.ఈ వ్యాఖ్యలపై విచారించేం దుకు వేంపల్లి పోలీసులు అంబటి రాంబాబుకు 41ఏ నోటీసు ఇవ్వడంతో ఈ రోజు ఉదయం 11



గంటలకు వేంపల్లి పోలీస్ స్టేషన్?కు చేరుకున్నారు. పోలీస్ స్టేషన్లో సీఐ, ఎస్ఐలు అంబటి రాంబాబును ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్నటువంటి వ్యక్తిని ఎందుకు దురుద్దేశం పూర్వకంగా ఈ అసభ్య కరమైన పదజాలం వాడాల్సిన అవసరం ఏమి వచ్చిందని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యల వెనక ఎవరున్నారని ప్రశ్నించినట్లు తెలిసింది. వేంపల్లిలో విచారణ పూర్తికాగానే పులివెందుల పోలీస్ స్టేషన్లో కూడా అంబటి రాంబాబు విచ రణకు హాజరుకానున్నా రు.అం బటిపై పలు సెక్షన్ల కింద కేసులు: కాగా అంబటి రాంబాబుపై గతం లో నల్లపాడు పోలీసులు 2 కేసు లు నమోదు చేశారు. చంద్రబాబు మీద చేసిన వ్యాఖ్యలపై గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు ఇచ్చిన ఫిర్యాదుపై ఒకటి, పోలీసు విధులకు ఆటంకం కలిగించారని ఎస్సై ఇచ్చిన ఫిర్యాదుపై మరో కేసు పెట్టారు. ఇదిలా ఉండగా చం ద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబు నివాసంపై దాడికి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కొద్ది రోజుల క్రితం గుంటూరు కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న ధర్నా చౌక్?లో అంబటి నిరాహార దీక్ష చేశారు. దీక్ష చేయడానికి వీలు లేదని, ట్రాఫిక్?కు అంతరాయం కలిగి ప్రజలు ఇబ్బందులు పడతారని పోలీసులు చెప్పినప్పటికీ అంబటి రాంబాబు దీక్ష కొనసాగించారు. ఈ నేపథ్యంలోనే నగరంపాలెం పోలీసులు అంబటిపైన పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.ఈ ఏడాది జనవరి 31న గుంటూరులోని చిల్లీస్ సెంటర్ వద్ద రోడ్డుపై వెళ్తున్న ప్రజలను అంబటి రాంబాబు భయభ్రాంతులకు గురి చేస్తూ టీడీపీ కార్యకర్తలను చంపుతానని బెదిరించారు. బూతులతో తిడుతూ ఇక్కడ ఉంటే అంతుచూస్తానని అలజడి సృష్టించారు.

## ఆకివీడు రామాలయ నిర్మాణం అంశంపై ఏపీ హైకోర్టులో విచారణ




**అమరావతి, ఏప్రిల్ 30:** పశ్చిమగోదావరి జిల్లాలోని ఆకివీడు రామాలయం నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై ఏపీ హైకోర్టులో (గురువారం) విచారణ జరిగింది. ఆలయ నిర్మాణాన్ని నిలిపివేయాలంటూ వేసిన పిటిషన్లను పిటిషనర్లు ఉపసంహరించుకున్నారు. రామాలయం నిర్మాణానికి అన్ని అనుమతులు ఉన్నాయని ప్రభుత్వ తరఫు న్యాయవాదులు కోర్టుకు వివరించారు. రామాలయం ప్లాన్‌తో పాటు ఆర్డీవో, ఎమ్ఆర్‌వో ఇచ్చిన అనుమతుల వివరాలను తెలిపారు. దీంతో 'రామాలయం నిర్మాణం చేసుకోవచ్చు కదా' అని హైకోర్టు వ్యాఖ్యానించింది.ఈ దశలో పిటిషనర్ల తరఫు న్యాయవాది జడ శ్రవణ్ మాట్లాడుతూ.. 'పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని' తెలిపారు. అయితే ప్లాన్‌ను సవాల్ చేస్తామని స్పష్టం చేశారు. పిటిషన్ ఉపసంహరణకు అనుమతి ఇవ్వాలని కోరగా.. అందుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది.

# కూలీలతో వెళ్తున్న ట్రక్కు బోల్తా- 16కు చేరిన మృతుల సంఖ్య



**మధ్యప్రదేశ్:** ధార్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కూలీలతో వెళ్తున్న ఒక ట్రక్కు అకస్మాత్తుగా అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో మృతుల సంఖ్య 16కు చేరింది. వారిలో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. మరో 20 మందికి పైగా తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా స్పందించారు.పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం, ధార్ జిల్లాలోని బగ్గడ్ ప్రాంతం నుంచి సుమారు 35 మంది కూలీలు పికప్ వ్యాన్‌లో తమ స్వగ్రామాలకు తిరిగి వెళుతుండగా బుధవారం రాత్రి 9 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. పికప్ వ్యాన్‌పై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని అధికారులు తెలిపారు. ప్రమాద సమచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కొందరిని మెరుగైన వైద్యం కోసం ఇండౌర్‌కు తరలించినట్లు జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.స్పందించిన ప్రధాని మోదీఈ ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎక్స్‌గ్రేషియా కూడా ప్రకటించారు. మృతుల కుటుంబసభ్యులకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున పరిహారం అందిస్తామని తెలిపారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే ధార్-మౌ నియోజకవర్గం ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ ఆసుపత్రికి చేరుకున్నారు. గాయపడిన వారిని, కుటుంబాలను పరామర్శించి, సాధ్యమైనంత సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. బాధితులకు ఉత్తమ వైద్య సంరక్షణ అందించాలని ఆమె వైద్యులను ఆదేశించారు. గోడ కూలి 7గురు మృతిబెంగళూరులో బుధవారం కురిసిన భారీ వర్షం పెను విషాదాన్ని మిగిల్చింది. భారీ వర్షానికి నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి ప్రహరీగోడ కూలి ఒక చిన్నారితో సహా మొత్తం ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వడగళ్ల వాన నుంచి రక్షణ కోసం కొందరు పాదచారులు, వీధివ్యాపారులు ఆసుపత్రి ప్రహరీ గోడ వద్దకు వెళ్లారు. అయితే, గోడ లోపలి భాగంలో జరుగుతున్న పనుల కారణంగా పోగుపోసిన మట్టి ఒత్తిడికి, భారీ వర్షం తోడవడంతో గోడ ఒక్కసారిగా కుప్పకూలి ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో కేరళకు చెందిన ఇద్దరు, ఉత్తర్?ప్రదేశ్, అసోం చెందిన మరో ఇద్దరు ఉన్నారు.స్పందించిన పీఎం, సీఎంఈ దుర్ఘటనపై స్పందించిన ప్రధాని మోదీ, తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు పీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2 లక్షల, క్షతగాత్రులకు రూ.50 వేల రూపాయలు పరిహారం ఇవ్వనున్నట్టు ప్రకటించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి సీఎం సిద్ధరామయ్య, అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజనీర్ల నిర్లక్ష్యంపై విచారణకు ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.5 లక్షల పరిహారంగా ఇవ్వనున్నట్టు సీఎం తెలిపారు. గాయపడిన వారికి ఉచిత వైద్యం అందించాలని ఆదేశించారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆస్పత్రికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు.

# 14 ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తి కేసు.. కీలక వ్యాఖ్యలు చేసిన సుప్రీంకోర్టు




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30:** 14 ఏళ్ల బాలిక గర్భవిచ్ఛిత్తి కేసుకు సంబంధించి భారత అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. అత్యాచార బాధితులు గర్భం దాల్చినప్పుడు.. ఏ సమయంలోనైనా అబార్షన్ చేసుకునేలా కొత్త చట్టాన్ని తీసుకురావాలని కేంద్రానికి సూచించింది. 14 ఏళ్ల బాలికకు సంబంధించి 30 వారాల గర్భవిచ్ఛిత్తికి ఇటీవల సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ నిర్ణయంపై ఎయిమ్స్ వైద్యులు సుప్రీంకోర్టులో 'క్యూరేటివ్ పిటిషన్' దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది.గర్భం దాల్చిన ఈ దశలో(30 వారాలు) గర్భవిచ్ఛిత్తి చేస్తే.. భవిష్యత్తులో బాలిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఎయిమ్స్ తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. కోర్టు స్పందిస్తూ.. వైద్యుల సూచనల నేపథ్యంలో.. తుది నిర్ణయాన్ని బాధితురాలు, ఆమె తల్లిదండ్రులకే వదిలేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. అత్యాచార బాధితులు గర్భం దాల్చినప్పుడు.. ఏ సమయంలోనైనా దానిని తొలగించుకునేలా కొత్త చట్టాన్ని తీసుకురావాలని కేంద్రానికి సూచించింది.

# మధ్య ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. 15 మంది మృతి, మరో 30 మందికి గాయాలు



**మధ్యప్రదేశ్ :** రాష్ట్రంలో ఘోర రోడ్డు ప్రమాదం( చోటుచేసుకుంది. రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో 15 మంది మృతి చెందగా 30 మందికి పైగా గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన ధార్ జిల్లాలోని ఇండోర్-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై జరిగింది. కూలీలను తీసుకెళుతున్న వ్యాన్ బోల్తా పడి() మరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 15 మంది అక్కడికక్కడే చనిపోగా.. 30 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. ధార్ జిల్లాలోని బగ్గద్ నుంచి 35 మంది కూలీలు పికప్ వ్యాన్‌లో ఇంటికి వస్తున్నారు.బుధవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో చిక్లియా క్రాసింగ్ దగ్గర డ్రైవర్ వ్యాన్ కంట్రోల్ కోల్పోయాడు. దీంతో వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఆ వెంటనే ఎదురుగా వస్తున్న ఎస్‌యూవీని ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో 15 మంతి మృత్యువాతపడ్డారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చి క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. కాగా, ఈ ప్రమాదంపై మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ స్పందించారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.4లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. బాధితులకు అండగా ఉంటామని, సహాయక చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

# ఏఐ భస్మాసురుడు లాంటిది- తప్పుడు చేతుల్లోకి వెళ్తే అంతే సంగతి




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 30:**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆసక్తికర వ్యా ్యలు చేశారు. ఏఐ వినియోగాన్ని పౌరాణిక రాక్షసుడైన 'భస్మాసురుడి'తో పోల్చారు. ఈ సాం కేతికత తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళితే అనేక రంగాలను ప్రభావితం చేయగలదని అభిప్రాయపడ్డారు. డీప్ ఫేక్‌లు, సైబర్ యుద్ధం, స్వయంప్రతిపత్తి గల ఆయుధ వ్యవస్థలు రక్షణ రంగంలో కొత్త సవాళ్లను విసిరాయని అన్నారు. ఏఎన్‌ఐ నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్ 2.0లో ప్రసంగించిన ఆయన ఈ మేరకు ఈ వ్యాఖ్యలు చేశారు."రక్షణ మంత్రిగా దేశ భద్రతా వ్యవస్థను చాలా వివరంగా అర్థం చేసుకునే అవకాశం నాకు లభించింది. అందువల్ల, ఏఐకి సంబంధించిన ఆందోళనలను గమనించాను. ప్రస్తుత సమయంలో డీప్ ఫేక్‌లు, సైబర్ యుద్ధం, స్వయంప్రతిపత్తి గల ఆయుధ వ్యవస్థలు కొత్త సవాళ్లను విసురుతున్నాయి. మనం ఈ సవాళ్లను దృష్టిలో ఉంచుకోవాలి. ఎందుకంటే భవిష్యత్తులో ఈ సవాళ్లు తగ్గకపోగా తిరిగి మరింతగా పెరుగుతాయి. ప్రతి సాంకేతికతకు రెండు కోణాలు ఉంటాయని కూడా మనం అర్థం చేసుకోవాలి. ఏఐ విషయానికి వస్తే, ఈ ద్వంద్వ వినియోగ సందిగ్ధత మరింత తీవ్రమవుతుంది. ఈ శక్తివంతమైన ఏఐ మోడల్ సాఫ్ట్‌వేర్‌లోని బలహీనతలను వెతికి వాటిని ఉపయోగించుకోగలదు. ఈ నమూనా బ్యాంకింగ్ వ్యవస్థలు, ఆసుపత్రులు, విద్యుత్ గ్రిడ్‌ను బలోపేతం చేయగలదు. అయితే, ఏఐ తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళితే వీటన్నింటినీ నాశనం చేయగలదు. నేను దీనిని మన పౌరాణిక కథల్లోనిభస్మాసురుడితో పోలుస్తాను. శివుడు అతడికి ఒక వరం ఇచ్చాడు. కానీ అదే వరం అతడికి శాపంగా మారింది."
భారత సాయుధ దళాలతో ఏఐని అనుసంధానించడంపైనా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థల కచ్చితత్వాన్ని పెంచడంలో దీని వినియోగించినట్లు గుర్తు చేశారు. రక్షణ రంగంలో ఏఐ వినియోగానికి ఉదాహరణగా సుదర్శన్ ఎయిర్ డిఫెన్స్ క్షిపణి వ్యవస్థలను ఉదహరించారు."మీరందరూ సుదర్శన్ ఎయిర్ డిఫెన్స్ గురించి విని ఉంటారు. కొందరికి దాని గురించి తెలిసి కూడా ఉండవచ్చు. ఇది ఒక భారీ, ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉత్తమ వినియోగానికి ఇదే ఒక గొప్ప ఉదాహరణ. ఏఐ, మెషిన్ లెర్నింగ్, బిగ్ డేటా సైన్స్‌లను ఉపయోగించి కొత్తగా వస్తున్న ఏఐ ఆధారిత సవాళ్లకు ప్రతిస్పందనగా మన సాయుధ దళాలు తమ సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడానికి ఒక రోడ్‌మ్యాప్‌ను కూడా అభివృద్ధి చేశాయి. ఇది భవిష్యత్తులో వారిని మరింత పోటీతత్వంగా మార్చడంలో ప్రభావవంతంగా పనిచేస్తోంది. ఇలా కొత్తగా వస్తున్న సాంకేతికతలతో మన దేశం మరింత సురక్షితంగా మారడమే కాకుండా, సాధికారతను సంపాదిస్తుంది. ఆపరేషన్ సిందూర్‌లో అన్ని రంగాల్లో సమర్థవంతంగా ఉపయోగించుకున్నాము. మా నిఘా వర్గాలను అత్యాధునిక బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థతో కలపడం వల్ల మా కచ్చితత్వం మెరుగుపడి, దాడి సామర్థ్యాలను తదుపరి స్థాయికి తీసుకెళ్లేందుకు వీలయ్యింది."పదవీ విరమణ చేసిన అధికారులకు పింఛను ప్రక్రియను సులభతరం చేయడానికి కేంద్రం ఏఐ ఆధారిత చెక్ బోర్డును అభివృద్ధి చేసిందని రాజ్?నాథ్ సింగ్? చెప్పారు. "ఏఐపై నా అభిప్రాయం కేవలం యుద్ధానికే పరిమితం కాదు. ప్రస్తుతం మన పని సంస్కృతికి, సైనికుల సంక్షేమానికి, జీవన ప్రమాణాలను పెంచడానికి ఒక శక్తివంతమైన మాధ్యమంగా ఏఐ మారింది. మా పింఛనుదారులు, మాజీ సైనికుల కోసం మేము ఒక పోర్టల్‌ను కూడా అభివృద్ధి చేశాము. ఏఐ ఆధారిత చెక్ బోర్డు ద్వారా పింఛనుకు సంబంధించిన ప్రక్రియలను మరింత సులభతరం చేశాం" అని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివరించారు.

# కర్ణాటకలో ప్రస్తుతానికి సీఎం మార్పు లేదు



**కర్ణాటక :** కర్ణాటక రాజకీయాల్లో గత కొంత కాలంగా కొనసాగుతున్న సీఎం మార్పు ఊహాగానాలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెరదించారు. కర్ణాటకలో ప్రస్తుతానికి ముఖ్యమంత్రి మార్పు ఏదీ లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని నాయకత్వ సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని ఆయన గురువారం స్పష్టం చేశారు."ప్రస్తుతానికి సీఎం మార్పు అనే ప్రశ్నే లేదు. ఇప్పటికే ఒక ముఖ్యమంత్రి ఉన్నారు. ఒక వేళ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, నేను కలిసి మార్పు దిశగా ఏదైనా నిర్ణయం తీసుకోవాల్సి వస్తే, దానికి కొంత సమయం పడుతుంది. అప్పటి వరకు వేచి చూడాలి."- మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడునాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతోపాటు, కర్ణాటకలోని రెండు అసెంబ్లీ స్థానాల ఉపఎన్నికల ఫలితాలు మే4న వెలువడనున్నాయి. ఈ ఫలితాల అనంతరం కర్ణాటకలో సీఎం మార్పు, మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై కాంగ్రెస్ హైకమాండ్ కీలక నిర్ణయం తీసుకుంటుందనే ప్రచారం జోరుగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఖర్గే తాజా వ్యాఖ్యలు చేశారు.2023 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత నేటి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్? మధ్య ఓ ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం శివకుమార్?కు శివకుమార్?కు సీఎం పదవి ఇవ్వాలని ఆయన మద్దతుదారులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.సోనియా గాంధీ ఆజ్ఞ ఉంటేనే!అనుభవజ్ఞుడైన ఖర్గే కర్ణాటక ముఖ్యమంత్రి అయితే పార్టీలోని అందరూ స్వాగతిస్తారని కర్ణాకట హోంమంత్రి పరమేశ్వర బుధవారం వ్యాఖ్యానించారు. దీనిపై ఖర్గే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "నేను ముఖ్యమంత్రి అయితే బాగుంటుందని మీరు (మీడియా), ఆయన (పరమేశ్వర), ప్రజలు అనుకోవచ్చు. కానీ నా తలరాత కంటే కూడా, నా సిద్ధాంతాలు, పార్టీకి నేను చేసిన సేవను బట్టి నా విషయంలో సోనియా గాంధీ నిర్ణయం తీసుకుంటారు" అని ఆయన తేల్చిచెప్పారు. 2025 నవంబర్ 20 నాటికి కర్ణాటకలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి రెండున్నర ఏళ్లు పూర్తి అయింది. ఈ నేపథ్యంలోనే నాయకత్వ మార్పులు చర్చలు, ఊహాగానాలు ముదిరాయి. ఇదిలా ఉండగా, వచ్చే నెలలో దాదాపు 40 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దిల్లీ టికెట్లు బుక్? చేసుకున్నారని కేంద్ర మంత్రి హెచ్?డీ కుమారస్వామి అన్నారు. ఈ వ్యాఖ్యలపై ఖర్గే స్పందిస్తూ, 'నాకు ఆ విషయం తెలియదు. ఆ వివరాలు ఏమిటో ఆయననే అడగండి' అని పేర్కొన్నారు.కేరళ, తమిళనాడులో విజయం ఖాయం!బుధవారం వెలువడిన ఎగ్జిట్ పోల్స్? అంచనాలపై కూడా ఖర్గే స్పందించారు. తమిళనాడులో డీఎంకే నేతృత్వంలోని కూటమి తిరిగి అధికారం దక్కించుకుంటుందని అన్నారు. అలాగే కేరళలో కాంగ్రెస్? నేతృత్వంలోని యూడీఎఫ్? ఘనవిజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.అసోం, పుదుచ్చేరి పరిస్థితేంటి?కాగా, అసోం, పుదుచ్చేరిలో అధికార పక్షాన్ని గద్దె దించడం కాంగ్రెస్?కు సవాలుతో కూడుకున్న విషయమని ఖర్గే అంగీకరించారు. "అసోం ఎగ్జిట్? పోల్స్? మాకు తక్కువ సీట్లు వస్తాయని చెబుతున్నాయి. కానీ అంచనాల కంటే మాకు ఎక్కువ సీట్లు వస్తాయనే నమ్మకం ఉంది. పుదుచ్చేరిలో కూడా బీజేపీ-ఎన్?ఆర్ కూటమితో మేము సమంగా పోరాడాం. అక్కడ గట్టి పోటీ నెలకొంది. మరి కొద్ది రోజులు వేచి చూడాలి" అని ఆయన అన్నారు.బంగాల్‌లో హోరాహోరీ బంగాల్‌లో టీఎంసీ, బీజేపీ మధ్య తీవ్ర పోటీ ఉందని ఖర్గే అభిప్రాయపడ్డారు. "మాకున్న సమాచారం ప్రకారం అక్కడ టీఎంసీ ఆధిక్యంలో ఉంది. అయితే కేంద్ర బలగాలను మోహరించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ మమతా బెనర్జీకి బీజేపీ గట్టి సవాల్ విసిరేందుకు ప్రయత్నించింది" అని ఆరోపించారు. ఒక వేళ హంగ్? వస్తే టీఎంసీకి మద్దతు ఇస్తారా? అని విలేకరులు ప్రశ్నించగా, "ఇప్పుడే ఏమీ చెప్పలేం. ఫలితాల తర్వాత నిర్ణయం తీసుకుంటాం" అని ఖర్గే పేర్కొన్నారు.

# దిగ్బంధనం కొనసాగిస్తున్న అమెరికా - హర్మూజ్ విషయంలో ఇరాన్ వెనక్కి తగ్గదా?



**ఇరాన్:**హర్మూజ్ జలసంధి మార్గాన్ని తెరిచే విషయం లో తన ప్రతిపాదనలనే నెగ్గించుకోవాలనే పట్టు దలతో ఇరాన్ ఉన్నట్లు తెలుస్తోంది. హర్మూజ్‌పై నియంత్రణను, అణు కార్యక్రమాన్ని వదులు కోవడానికి ఇరాన్ సుముఖంగా లేదని సమాచా రం. అమెరికాలోని రక్షణ రంగ వ్యవహారాల అధ్యయన సంస్థ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది స్టడీ ఆఫ్ వార్ (ఐఎస్‌డబ్ల్యూ) ఈమేరకు ఒక విశ్లేషణా త్మక నివేదికను విడుదల చేసింది. ఓడరేవుల ముట్టడిని అమెరికా ఆపేసిన తర్వాతే హర్మూ జ్‌ను తిరిగి తెరవడం, అణు కార్యక్రమంపై చర్చలు ఉంటాయనే తమ ప్రతిపాదనలకు కట్టుబడి ఉండాలని ఇరాన్ నాయకత్వం భావిస్తోందని పేర్కొంది. ఈ నిర్ణయానికి ఇరాన్ నాయకత్వంలోని అందరు అగ్రనేతల మద్దతు లభిస్తోందని తెలిపింది. ఈవిధంగా ఇరాన్‌లో ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) అధిపతి అహ్మద్ వాహిది ప్రతిపాదించిన కఠిన వైఖరే చివరకు ఆధిపత్యాన్ని సాధించిందని ఐఎస్‌డబ్ల్యూ చెప్పింది. ప్రస్తుతానికి ఇరాన్ నాయకత్వంలోని ఇతర వర్గాల నుంచి అహ్మద్ వాహిదికి పరిమిత స్థాయిలోనే వ్యతిరేకత ఉందని పేర్కొంది.హర్మూజ్‌పై చట్టబద్ధ హక్కు కోసం యత్నాలు "హర్మూజ్ జలసంధి మీదుగా రాకపోకలు సాగించే అన్ని వాణిజ్య నౌకల నుంచి సుంకాలను వసూలు చేసే పథకాన్ని ఇరాన్ రెడీ చేస్తోంది. దీనిలో పొరుగుదేశం ఒమన్‌ను కూడా చేర్చడం ద్వారా, ఆ జలసంధిపై సార్వభౌమాధికారాన్ని చెలాయించాలనే తన ప్రణాళికను చట్టబద్ధం చేసేందుకు ఇరాన్ యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కసరత్తు ద్వారా హర్మూజ్‌పై నియంత్రణ విషయంలో రాజీపడేది లేదనే సంకేతాలను అమెరికాకు ఇరాన్ పంపుతోంది. ఈ ప్రాతిపదికనే అమెరికాకు ఇరాన్ ప్రతిపాదనలను పంపుతోంది. ఓవైపు ఓడరేవుల ముట్టడిని ఆపాలని అమెరికాపై ఒత్తిడిని పెంచుతూనే, మరోవైపు బాబ్ అల్ మందబ్ జలసంధి మార్గంలో నౌకలపై దాడ హౌతీ మిలిటెంట్లను రెడీ చేయడంపైనా ఇరాన్ పనిచేస్తోందని సమాచారం.

# రూ.45 లక్షల కోసం కూతురి ఘాతుకం



**రాంచీ, ఏప్రిల్ 30:** డబ్బుల కోసం ఓ కూతురు ఘాతుకానికి ఒడిగట్టింది. ప్రియుడితో కలిసి తల్లిని అతి కిరాతకంగా చంపేసింది. హత్యను సాధారణ మరణంగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. అయితే, అంత్యక్రియలు పూర్తయిన రెండు రోజుల తర్వాత అసలు విషయం బయటపడింది. నిందితులిద్దరూ పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు. ఈ సంఘటన ఝార్ఖండ్ రాష్ట్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మనిత ాలాకు చెందిన నహిదా పర్వీన్ దంపతులకు పిల్లలు లేకపోవటంతో ఓ బాలికను దత్తత తీసుకుని పెంచుకుంటున్నారు. ప్రస్తుతం ఆ బాలిక వయసు 17 సంవత్సరాలు. నాలుగేళ్ల క్రితం పర్వీన్ భర్త చనిపోయారు. ఆయన ఎలక్ట్రిసిటీ డిపార్ట్ మెంట్‌లో పని చేస్తుండటంతో పర్వీన్‌కు ఫైనాన్షియల్ సెటిల్‌మెంట్ కింద 45 లక్షల రూపాయ ల వచ్చాయి. బాలిక అర్బాజ్ అనే యువకుడిని ప్రేమిస్తోంది. 45 లక్షల రూపాయలు ఉన్న బ్యాంక్ అకౌంట్‌లోంచి డబ్బులు తీసి తరచుగా ప్రియుడికి ఇస్తోంది. పర్వీన్‌కు ఈ విషయం తెలియటంతో ఇద్దరి మధ్యా తరచుగా గొడవలు జరుగుతున్నాయి. అర్బాజ్‌కు డబ్బులు ఇస్తే ఊరుకునేది లేదని పర్వీన్ హెచ్చరించింది. దీంతో బాలిక, అర్బాజ్ ఆగ్రహానికి గురయ్యారు.ఎలాగైనా పర్వీన్ అడ్డుతొలగించి, డబ్బును సొంతం చేసుకోవాలని భావించారు.

# ట్రంప్‌నకు పుతిన్ ఫోన్‌కాల్ ఇరాన్ విషయంలో స్ట్రాంగ్ వార్నింగ్





**ఇరాన్:** పశ్చిమాసియా పరిస్థితులపై అనిశ్చితి నెలకొన్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య కీలక టెలిఫోన్ సంభాషణ జరిగింది. దాదాపు 90 నిమి షాలు పాటు జరిగిన ఈ ట్రంప్?నకు పుతి న్ కీలక హెచ్చరిక చేశారు. ఇరాన్‌పై ఇరాన్‌పై ఒకవేళ అమెరికా లేదా ఇజ్రాయెల్ మళ్లీ సైనిక చర్యకు దిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని చెప్పారు. క్రెమ్లిన్ ప్రతినిధి యూరి ఉషాకోవ్ ఈ వివరాలను వెల్లడించారు. మరోవైపు ఇరాన్ అణు నిల్వల విషయంలో రష్యా సహాయం చేస్తామని పుతిన్ తెలిపినట్లు ట్రంప్ పేర్కొన్నారు.ట్రంప్-పుతిన్ ఫోన్ సంభాషణలో ప్రధానంగా పశ్చిమాసియా యు ద్ధం, ఉక్రెయిన్ అంశాలు ప్రస్తావనకు వచ్చినట్టు యూరి ఉషాకోవ్ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌లోని ప్రస్తుత పరిస్థితులను, రష్యా సైన్యం సాధిస్తున్న పురోగతిని పుతిన్ వివరించారని చెప్పారు. ఐరోపా దేశాల మద్దతుతో జెలెన్స్కీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే యుద్ధాన్ని పొడిగిస్తోందని ఇద్దరు నేతలు ఏకాభిప్రాయం వ్యక్తం చేసినట్లు ఉషాకోవ్ తెలిపారు. ఇరాన్ యుద్ధ పరిస్థితులు, అణు కార్యక్రమంపై ఇద్దరు నేతలు విస్తృతంగా చర్చించారు. ట్రంప్ తీసుకున్న కాల్పుల విరమణ పొడిగింపు నిర్ణయానికి పుతిన్ మద్దతు తెలిపారు. ఇరాన్ అంశంపై కొన్ని ప్రత్యేక ప్రతిపాదనలు కూడా పుతిన్? సూచించినట్లు క్రెమ్లిన్ తెలిపింది. ఈ ఫోన్ కాల్ రష్యా చొరవతోనే జరగ్గా, సంభాషణ ఫలప్రదంగా సాగిందని క్రెమ్లిన్ వర్గాలు పేర్కొన్నాయి.ఆర్థిక, ఇంధన సహకారంపై చర్చఅమెరికా- రష్యా మధ్య భవిష్యత్తులో ఆర్థిక, ఇంధన రంగాల్లో సహకారం పెంపుపై కూడా చర్చ జరిగింది. ఉద్రిక్తతల మధ్య వ్యూహాత్మక సంబంధాలను కొనసాగించే ప్రయత్నంగా ఇది భావిస్తున్నారు. ఇటీవల వైట్ హౌస్ పత్రికా వార్షిక సమావేశంలో జరిగిన కాల్పుల ఘటనపై పుతిన్ ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్‌పై జరిగిన దాడి ప్రయత్నాన్ని ఖండిస్తూ ఆయనకు మద్దతు తెలిపారు.ఇరాన్ యురేనియం అంశంలో పుతిన్ మద్దతు : ట్రంప్ఈ టెలిఫోన్? సంభాషణలో ఇరాన్? వద్ద ఉన్న సుసంపన్న యురేనియం నిల్వల గురించి మాట్లాడినట్లు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఇరాన్ అణు పదార్థాల నిర్వహణలో రష్యా మూడో దేశంగా సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు పుతిన్ తెలిపారని ట్రంప్ పేర్కొన్నారు. అయితే తనకు సహాయం చేసే ముందు ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడం అవసరమని పుతిన్?కు తెలిపినట్లు వెల్లడించారు. ఉక్రెయిన్ యుద్ధంపై త్వరలో ఒప్పందం కుదిరే అవకాశాలపై ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. మే నెలలో జరిగే విజయ దినోత్సవాల సందర్భంగా కాల్పుల విరమణకు పుతిన్ ప్రతిపాదించగా, ట్రంప్ దానికి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

# శ్రమదోపిడీని ప్రోత్సహిస్తున్న పాలకులు !

శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది ఏదీ లేదని మహాకవి శ్రీశ్రీ అన్నారు. కార్మిక లోకాన్ని తట్టి లేపిన విప్లవకారుడు శ్రీశ్రీ. అయితే దేశంలో ఐటి విప్లవం వచ్చిన తరవాత పాలకులు కార్మికులను పట్టించుకోవడం మానేశారు. నేటికీ వారి బతుకులు ఛిద్రం అవుతున్నా కనీసం పలకరింపులు, సానుభూతి వచనాలు లేవు. ఇప్పుడు కార్మికులంటే కేవలం కర్మాగారాల్లో పనిచేస్తున్నవారే కాదు. రోడ్డుమీద పడి పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ కార్మికులే. వారికి ముఖ్యంగా ఆరోగ్య, ఆర్థిక భద్రత లేదు. ఆకాశ హర్మ్యాలను కడుతున్నా.. కుటుంబబానికి దూరంగా ఊడిగం చేస్తున్నా కూలీ తప్ప పెద్దగా ప్రయోజనాలు కలగడం లేదు. వీరందరికీ ప్రధానంగా ఆరోగ్య వసతి, పెన్షన్ పథకాలు కలగాలి. పనిచేసే ప్రతి ఒక్కరినీ కార్మికులుగా చూడాలి. వారికి విద్య,ఆరోగ్య, పెన్షన్ భద్రత వంటి కనీస సౌకర్యాలు కలగాలి. అలాగే అసంఘటిత కార్మికులను ఆదుకునే ప్రయత్నాలు చేయాలి. పాలకులంతా ఎసి కార్లలో, విమానాల్లో తిరుగుతూ.. ఎసి బంగలాల్లో నివస్తున్నారు. వీరికి సామాన్యుల కష్టాలు తెలియడం లేదు. ప్రజలు కట్టిన పన్నులతో జల్సాలు చేస్తున్నారు. సమాజ గతిని, పురోగతిని శాసించేది, నిర్దేశించేది శ్రామిక వర్గమే. ఆ శ్రమే వెట్టిచాకిరికి గురవుతోంది. శ్రామికుడు దోపిడీకి గురవుఉతన్నాడు. పరిస్థితులు ఇలాగే ఉంటే.. కష్టించి పని చేసే చేతులు పిడికిళ్లు బిగిస్తాయని గుర్తించాలి. ఉద్యమాలు పుట్టుకొస్తాయి. కార్మిక దినోత్సవ ఆవిర్భావాన్ని ఏ ఒక్క దేశానికో, సంఘటనకో ముడిపెట్టలేం. కానీ 1886లో షికాగోలోని హే మార్కెట్‌లో జరిగిన కార్మికుల ప్రదర్శనే ఈ మే డే పుట్టుకకు పునాది వేసిందని చెబుతారు. కానీ ఆ ప్రదర్శన ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో కొందరు కార్మికులు చనిపోయారు. ఆ సంఘటన అనంతరం 1889 నుంచి 1890 వరకు అనేక దేశాల్లో కార్మికుల ఉద్యమాలూ, నిరసన ప్రదర్శనలూ చోటుచేసుకున్నాయి. షికాగోలో జరిగిన కార్మిక ప్రదర్శనలో చనిపోయిన వారికి గుర్తుగా మే 1ని కార్మిక దినోత్సవంగా జరుపుకోవాలన్న ఒప్పందం కూడా కుదిరింది. భారతదేశంలో చాలా ఆలస్యంగా కార్మిక దినోత్సవాన్ని జరుపుకున్నాము. 1923 మే 1వ తేదీన మద్రాసులో లేబర్ కిసాన్ పార్టీ ఆధ్వర్యంలో తొలిసారి ఈ వేడుకలను జరుపుకున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తరవాత ఐరోపా దేశాల్లో మే 1వ తేదీని సెలవు దినంగా పాటించడం మొదలు పెట్టారు. అనంతరం అనేక దేశాలు ఇదే బాటలో నడిచాయి. చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలు ఆ రోజునే అమల్లోకి వచ్చాయి. కార్మిక దినోత్సవం సందర్భంగా చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించి అనేక సంక్షేమ పథకాలు పుట్టుకొచ్చాయి. అలాగే సంక్షేమ పథకాల అమలుకు, నిరసన ప్రదర్శనలకు మే 1వ తేదీ వేదికగా మారింది. ముఖ్యంగా మేడే రోజున కార్మికులు వారి హక్కులను గుర్తు చేసుకోవడం, సమాజానికి వారు చేసిన సేవలకు గాను తగిన గుర్తింపు ఇచ్చి వారిని సన్మానించడం చేస్తున్నాం. 1916లో తొలిసారిగా రోజుకు 8 పని గంటలు మాత్రమే అన్న డిమాండ్‌కు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. మనదేశంలో ఇతర దేశాల కంటే ముందే కలకత్తాలో కార్మికుల పనిగంటల కోసం హౌరా రైల్వే స్టేషన్లో 1862లోనే సమ్మె చేశారు. 1923లో తొలిసారిగా భారత్ దేశంలో మే డే ను పాటించారు. ఆ తర్వాత 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడడంతో అప్పటి నుంచి కార్మికవర్గాల్లో చైతన్యం మొదలైంది. దీంతో మే డే పాటిస్తున్నారు. కానీ అసంఘటిత కార్మిక వర్గం అన్ని రంగాల్లో వచ్చింది. 1985 తర్వాత చోటుచేసుకున్న ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల అసంఘటిత కార్మికవర్గాల కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడంలేదు. మనదేశంలో అసంఘటిత రంగం పూర్తిగా నిరాదరణకు గురవుతోంది. నిర్మాణ, వ్యవసాయ, గిర కార్మిక రంగాలు పూర్తిగా వెలివేయ వడ్డాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 80కి పైగా దేశాల్లో కార్మిక దినోత్సవాన్ని జరుపుకుంటారు. సామాజిక న్యాయం, అందరికీ గౌరవప్రదమైన పనిని ప్రోత్సహించడానికి పాలకులు ముందుకు రావాలి. ముఖ్యంగా, ఐ.టి.రంగంలో ఎంతోమంది ఆడపిల్లలు, యువకులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ శక్తులు ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం వుంటే



అక్కడ కంపెనీలు పెడుతున్నారు. అమెరికాలో వున్న కంపెనీలు అక్కడ ప్రజాచైతన్యం ఉన్నది కాబట్టి కార్మిక చట్టాలు అమలుకానటువంటి ఇండియాలో కంపెనీలు పెడుతూ వాళ్ళచే 10,12 గంటలు పనిచేయి స్తున్నారు. ఐటి రంగంలో పనిచేస్తున్న విద్యావంతులైన యువత శ్రమ దోపిడీకి బలవుతున్నది. రాత్రుళ్లు ఆడపిల్లలను భద్రతలేకుండా ఇళ్ళకు పంపించడం మూలంగా నేరాల సంఖ్య కూడా పెరుగుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ వున్నంతవరకు శ్రమదోపిడీ, ఎక్కువ పనిచేయించుకోవడం సర్వసాధారణం. కార్మిక చట్టాలను ఐ.టి. రంగంలో కూడా అమలుకై పోరాటం ఇప్పుడు అత్యంత అవసరం. కార్మిక చట్టాలు అమలు చేయబోమని పాలకవర్గాలు బహుళజాతి కంపెనీలకు హామీలిస్తూ దేశంలోకి స్వాగతిస్తున్నాయి. అసంఘటితరంగంలో అయితే సరేసరి. ఇటీవల ప్రభుత్వం కాంట్రాక్టు, పార్ట్‌టైం ఉద్యోగుల పేరుతో ప్రవేశపెట్టిన ఔట్ సోర్సింగ్‌లోను కార్మిక చట్టాల నియమాలు అమలు కావడం లేదు. అందుకే అనేక సంస్థల్లో రెగ్యులర్ ఉద్యోగుల కన్నా కాంట్రాక్టు ఉద్యోగులే అధికమైనారు. అంతేకాకుండా ప్రభుత్వరంగంలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య కూడా క్రమంగా తగ్గిపోయింది. నిరుద్యోగాన్ని, బలహీనతలను ఆసరా చేసుకొని వాళ్ళచే 10,12 గంటలు పనిచేయిస్తున్నారు. ఇది విద్యా, వైద్య రంగాల్లో ప్రయివేటీకరణ పెరిగిన కొద్దీ సర్వీసు భద్రత తక్కువవుతుంది కాబట్టి శ్రమదోపిడీ కూడా పెరుగుతుంది. వెనుకటికి స్కూళ్ళు 10 నుండి 14గంటల వరకు పనిచేసేవి. పిల్లవాణ్ణి ఆరు గంటల కంటే ఎక్కువ చదివించకూడదని విద్యావేత్తలు, పరిశోధకులు చెబుతున్నా, సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ పేర పాఠశాలలు సర్వసాధారణమైపోయాయి. అందుకే ప్రైవేట్ టీచర్స్ నోరు మెదపకుండా 12 గంటలు పనిచేయాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రపంచీకరణ వలన వంద సంవత్సరాల క్రితం సాధించిన కనీస డిమాండ్లు కూడా ఈనాడు అమలుకు నోచుకోవడంలేదు. ఎనిమిది గంటల పనికోసం చేసిన పోరాటం పెట్టుబడిదారీ వర్గం పతనానికి ఆరంభమవుతుందనుకున్నాం. కానీ మళ్ళీ మార్కెట్ శక్తులు పాత పరిస్థితులకు ప్రాణప్రతిష్ఠ చేస్తున్నాయి. ఆనాటి కార్మికవర్గ చైతన్యం మరోసారి వెల్లివిరుస్తుందని, ఈ మే డే నాడు కొత్త స్ఫూర్తిని రగిలిస్తుందని ఆశిద్దాం. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలు, మొదలైనవి శ్రామిక దోపిడీకి, కార్మిక చట్టాల ఉల్లంఘనకు సంఘటితమవుతున్న ఈ తరుణంలోనే ప్రపంచ కార్మికవర్గం ఆ శక్తులను ప్రతిఘటించేందుకు ద్విగుణీకృత ఉత్సాహంతో పోరాడాలి. ప్రపంచ శాంతిని అసలు ఈ భూగోళాన్నే కాపాడుకోవాల్సిన అవసరం కూడా ఉంది. అందుకు కార్మిక శ్రేణులు ఏకం కావాల్సిన చారిత్రక సందర్భం కూడా ఇదే.

# నేనసలే మంచి వాడిని కాను

**• ఇరాను అణు ఒప్పిందానికి రావాల్సిందే • అప్పటి వరకు శాంతి ఒప్పందం కుదరదు • మరోమారు హెచ్చరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్**



**వాషింగ్టన్,ఏప్రిల్30:** దాదాపు రెండు నెలలుగా కొనసాగుతున్న ఘర్షణను ముగించాలనే ఇరాన్ ప్రతిపాదనను అంగీకరించాలంటే తమ షరతులకు ఒప్పుకోవాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పష్టం చేశారు. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదులుకునే వరకు ఆ దేశంతో శాంతి ఒప్పందం కుదరదని ఆయన తెలిపారు. అప్పటివరకు ఇరాన్‌పై అమెరికా నౌకా దిగ్బంధనం కొనసాగు తుందని హెచ్చరించారు బుధవారం ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్.. ఇరాన్ యుద్ధం గురించి మాట్లాడారు. 'బాంబు దాడి కంటే దిగ్బంధనమే ఎక్కువ ప్రభావవంతంగా ఉంది. వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారి పరిస్థితి మరింత దారుణంగా ఉండబోతోంది. వారు రాజీ పడాలనుకుంటున్నారు. నేను దిగ్బంధనాన్ని కొనసాగించడం వారికి ఇష్టం లేదు. ఎత్తివేయడం నాకు ఇష్టం లేదు. ఎందుకంటే వారు అణ్వాయుధాన్ని కలిగి ఉండడానికి వీల్లేదు' అని ట్రంప్ స్పష్టం చేశారు . కాగా, శాంతి ఒప్పందానికి అంగీకరించేలా ట్రంప్ చేస్తున్న బెదిరింపులపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది (జా ఎసజీని బి।నిబతినీనిబ). అమెరికా మోసపూరిత ప్రణాళిక ఓడిపోతుందని, దిగ్బంధనం ద్వారా దేశంలో అంతర్గత కలహాలను సృష్టించాలనే ట్రంప్ ప్రణాళిక ఎన్నటికీ సఫలం కాదని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు. ఏదేమైనా అమెరికా-ఇరాన్ మధ్య ప్రస్తుతానికి శాంతి చర్చలు జరగడం లేదు. ఇదిలావుంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను మరోసారి తీవ్రంగా బెదిరించారు. నిలిచిపోయిన అణు కార్యక్రమం చర్చలపై ఇరాన్ త్వరగా తేల్చాలని, తెలివిగా వ్యవహరించాలని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో తుపాకితో ఉన్న ఫొటోను పోస్టు చేశారు. దీంతో ఇది నెట్టింట వైరల్ అయింది. యుద్ధం ముగిసిన తరువాతే అణు కార్యక్రమంపై చర్చలని ఇరాన్ తేల్చి చెప్పిన నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ట్రంప్ తన పోస్ట్‌లో, 'ఇరాన్ తమ పనిని సరిగ్గా చేయ లేకపోతోంది. వారికి అణురహిత ఒప్పందంపై ఎలా సంతకం చేయాలో తెలియదు. వారు త్వరగా తెలివిగా వ్యవహరించాలి!' అని రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌తో పాటు, ట్రంప్ తన ఎఐ రూపొందించిన చిత్రాన్ని కూడా పంచుకున్నారు, అందులో ఆయన అసాల్ట్ రైఫిల్‌ను పట్టుకొని ఉండగా, వెనుక పర్వత ప్రాంతంలో బాంబులు పేలుతున్నాయి. ఆ చిత్రంపై 'నో మోర్ మిస్టర్ నైస్ గై- (ఇకపై మంచివాడిగా ఉండను!) అని బ్యానర్ ఉంది. అమెరికా-ఇరాన్ మధ్య ఉన్న సున్ని తమైన కాల్పుల విరమణ ఒప్పందంపై అనిశ్చితి పెరుగు తున్న నేపథ్యంలో ట్రంప్ ఈ బెదిరింపులకు దిగడం గమనార్హం. ఇరాన్ ఓడ రేవులను దిగ్బంధి ంచాలని ట్రంప్ ఆదేశించారని వాల్ స్ట్రీట్ జర్నల్ బుధవారం నివేదించింది. ఈ కథనం ప్రకారం ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని వదులుకునేలా ఒత్తిడి తెచ్చేందుకు ఆ దేశ ఓడరేవులను సుదీర్ఘకాలం పాటు దిగ్బం ధించడానికి సిద్ధం కావాలని ట్రంప్ జాతీయ భద్రతా అధికారులను ఆదేశించారు. ఇరాన్ చిత్తశుద్ధితో చర్చలు జరపడం లేదని ట్రంప్ భావిస్తున్నారు. ఇరాన్ తన యురేనియం శుద్ధిని 20 ఏళ్ల పాటు నిలిపివేసేలా, ఆ తర్వాత కఠినమైన ఆంక్షలను అంగీకరించేలా బలవంతం చేయాలని ఆయన ఆశిస్తున్నారని ఆ కథనం తెలిపింది. అమెరికా తమ దేశ నౌకలను స్వాధీనం చేసుకోవడాన్ని ఇరాన్ సముద్రపు దొంగతనంగా అభివ ర్ణించింది. ఈ వివాదంపై ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్‌కు, భద్రతా మండలికి ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరవాని అధికారికం గా ఫిర్యాదు చేశారు. అమెరికా చర్యలు అంతర్జాతీయ వాణిజ్యంలో చట్టవిరుద్ధమైనవని ఆయన పేర్కొన్నారు.

# పోరాటాలతోనే కార్మిక హక్కులకు రక్షణ

**• కార్పోరేట్ సంతుష్టీకరణలో పాలకులు**

**• అనేక ఆందోళనతో అడ్డుకుంటూనే ఉన్నాం**

**• సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వి నాగేశ్వరరావు**

**విజయవాడ,ఏప్రిల్30:** ప్రభుత్వాలు కార్మికుల హక్కులపైనే కాక జీవితాలపైన, ప్రజాస్వామ్య హక్కులపైన, రాజ్యాంగ హక్కులపై దాడి చేస్తున్నాయి. ఈ హక్కులను కాపాడుకోవడానికి యావత్ కార్మికవర్గం పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. లేబర్‌కోడ్లను రద్దు చేయాలని, కార్మిక హక్కులు అమలు కావాలని అన్నారు. నిరంతరం కార్మిక దోపిడీ జరుగుతున్నా పాలకుల్లో చలనం లేదన్నారు. ఏటేటా మేడేలు జరుపుకోవడం తప్ప కార్మికుల పక్షాన నిర్ణయాలు తీసుకోవడం లేదని ఆయన ఆవేదన చెందారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకై మానవ హారాలు, పాదయాత్రలు, మహాప్రదర్శనలు నిర్వహించారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐదు సంవత్సరాలుగా రాజీ లేని పోరాటాలు సాగుతున్నాయి. వీటి ఫలితంగా నేటి వరకూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ముందుకు సాగలేకపోయిందన్నారు. అయితే దానిని అభివృద్ధి చేసి, దానికి గనులు కేటాయించి, మరింత పటిష్టంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేయడం లేదన్నారు. తిరుపతి టిటిడి ఫారెస్టు కార్మికులు 38 నెలల పాటు ఆందోళనలు కొనసాగించారు. అనేక ఒత్తిళ్లు చేసినా కార్మికులు పోరాటాన్ని ఆపలేదన్నారు. విజయనగరం మిమ్స్ మెడికల్ కాలేజీ కార్మికులు 80 రోజుల పాటు పోరాటాలు చేశారు. 32 మందిపై అక్రమ కేసులు బనాయించారు. ఇద్దరు సిఐటియు నాయకులతో సహా 19 మంది కార్మికులను విశాఖ సెంట్రల్ జైలుకు 14 రోజులు రిమాండ్‌కు పంపారు. అయినా ఈ నిర్బంధాన్ని ఎదిరించి కార్మికులు పోరాటాన్ని కొనసాగించారు. నెల్లూరు మున్సిపాల్టీలో వర్క్ ఔట్‌సోర్సింగ్ విధానాన్ని అనుసరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం టెంటర్లు పిలవడానికి వ్యతిరేకంగా కార్మికులు 14 రోజుల పాటు సమరశీలంగా సమ్మె నిర్వహించారు. పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కొని సమ్మెను జయప్రదంగా నిర్వహించారు. దీంతో ప్రభుత్వం టెండర్లను ఉపసంహరించుకోవడమే కాక, కార్మికులపై అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయక తప్పలేదు. విశాఖ డెయిరీ కార్మికుల పోరాటం, సినర్జిస్ కార్మికుల సమ్మె, బ్రాండిక్స్ కార్మికుల మూడు రోజుల సమ్మె, రాజమండ్రి ఆంధ్రా పేపర్‌మిల్లు కార్మికులు 2,500 మంది 34 రోజుల సమ్మె, ఎన్‌టిఆర్ జిల్లా ముఠా కార్మికుల సమ్మెలు ఈ కాలంలో జరిగాయి. కార్మికులు పోరాటాలతో కొన్ని విజయాలు సాధించుకోగలిగారు.

నెల్లూరులో జెన్కోను అదానీకి కట్టబెట్టే ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ 396 రోజుల ఆందోళనను కార్మికులందరూ కలసి నిర్వహించారు. కార్మికులు, ఇంజినీర్లు కలసి సిఐటియు చొరవతో జెఎసి గా ఏర్పడి పోరాడారు. ప్రజల మద్దతు పొందారు. ప్రైవేటీకరణ ప్రతిపాదనను వెనక్కి నెట్టారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీలు 42 రోజుల పాటు ఎస్మాను సైతం ధిక్కరించి, నిర్బంధాన్ని ఎదురించి సమరశీలంగా సమ్మె నిర్వహించారు. గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్, రిటైర్మెంట్ వయసు పెంపు, హెల్పర్ల ప్రమోషన్‌కు వయోపరిమితి పెంపు, మినీ అంగన్‌వాడీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా మార్పు, సమ్మె కాలపు వేతనాలు తదితర జీఓలను సాధించుకున్నారు. మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు 16 రోజుల సమ్మెను సమరశీలంగా నిర్వహించారు.

వేతన పెంపు, ఇతర సమస్యలు పరిష్కరించుకున్నారు. సమగ్రశిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 22 రోజులు సమ్మె నిర్వహించారు. దాదాపు 8 వేల మంది ఉద్యోగులు 23 శాతం వేతన పెంపు, సమ్మె కాలపు వేతనాలు సాధించుకున్నారు.

ఆశా కార్మికులు సమరశీలంగా అనేక పోరాటాలు నిర్వహించి గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్లు, ప్రసూతి సెలవులు, పదవీ విరమణ వయసు పెంపులను సాధించుకున్నారు. మధ్యాహ్న భోజనం, భవన నిర్మాణం, ట్రాన్స్‌పోర్ట్ తదితర రంగాల్లోనూ పోరాటాలను నిర్వహించారు.

రాజీ లేకుండా సమరశీలంగా ఫలితం వచ్చేదాకా పోరాడ్డం ద్వారా కార్మికవర్గం విజయాలు సాధించగలదని, ప్రభుత్వ విధానాలను వెనక్కి కొట్టగలదని తేటతెల్లమైందని నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ పోరాటాల వలన ఆయా కార్మికుల్లో పోరాట స్ఫూర్తిని పెంచాయి.

రాష్ట్రంలో, కేంద్రంలో ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను భవిష్యత్తులో ఐక్య పోరాటాల ద్వారానే తిప్పి కొట్టగలం అన్నారు.

# కార్మిక చట్టాలను కాలరాస్తున్న బిజెపి

**• కార్మికుల పట్ల కనీస సానుభూతి లేని మోడీ**

**• హక్కులపై దాడి చేస్తున్నకేంద్ర ప్రభుత్వం**

**• సిపిఐ జనగామ జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి**

**జనగామ,ఏప్రిల్30:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ వర్గాల ప్రయోజనాలే మిన్నగా భావిస్తున్నదని సిపిఐ జనగామ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ రాజిరెడ్డి అన్నారు. కార్మికుల పట్ల బిజెపికి కనీస సానుభూతి కూడా లేకుండా పోయిందన్నారు. మేడే సందర్భంగా ఆయన కార్మికులకు అభినందనలు తెలిపారు. కోట్లాది మంది కార్మికుల వేతనాలపై, ఉపాధిపై, హక్కులపై దాడి చేస్తున్నది. లేబర్‌కోడ్ల ద్వారా జాతీయ కనీస వేతనం పేరిట రోజుకు రూ.178 కన్నా తక్కువ వేతనాలు ఇవ్వకూడదంటున్నది. ఇంతకంటే ఎక్కువ వేతనాలను ఏ యాజమాన్యం ఆచరణలో చెల్లించదు. 300 లోపు కార్మికులు పని చేసే సంస్థలను యాజమాన్యాల దయాదాక్షిణ్యాలకు వదిలేసింది. ఈ 300 కార్మికుల సంఖ్యను తమ ఇష్టానుసారం పెంచుకునే హక్కును రాష్ట్రాలకు కట్టబెట్టింది. రాష్ట్రాల్లో ఉన్న వివిధ సంక్షేమ బోర్డులను నిర్వీర్యం చేసి గుత్తాధిపత్యాన్ని కేంద్రం తన గుప్పెట్లోకి తీసుకున్నదని ఆరోపించారు. ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లారుమెంట్ పేరుతో రెగ్యులర్ ఉద్యోగాలకు తిలోదకాలిచ్చే విధానాలను అమలు చేస్తున్నది. ఈ పేరిట అతి తక్కువ వేతనాలతో కార్మికులను దోపిడీ చేయడానికి కార్పొరేట్ యాజమాన్యాలకు బిజెపి ప్రభుత్వం మార్గం సుగమం చేస్తున్నదని మండిపడ్డారు వీటికి వ్యతిరేకంగా రాబోయే కాలంలో ఐక్య పోరాటాలు పెంచాల్సి ఉందన్నారు. సంఘటిత రంగ కార్మికులు సంక్షేమ పథకాలు, సమగ్ర చట్టం చేయాలని,ప్రభుత్వ పథకాల్లోని అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్రశిక్ష, వెలుగు, ఉపాధి హామీ, 108, 104, ఆయుష్, తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వంటి వివిధ పథకాల్లోని వారిని ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ చేశారు. ఈ పథకాల్లోని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు హెచ్.ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల చేత రాష్ట్ర ప్రభుత్వం ఏళ్ల తరబడి పని చేయించుకోవడం శ్రమ దోపిడీ అని, అందర్నీ రెగ్యులర్ చేయాలని అన్నారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని అన్నారు. కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనం చెల్లించాలని అన్నారు. శ్రామిక మహిళల హక్కులు కాపాడాలని, మహిళలకు నెలసరి సెలవులు ఇవ్వాలని, పరిశ్రమల్లో ప్రమాదాలు నివారించి భద్రతా ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# నేడు నాంచారమ్మ జాతర

- వేలాదిగా తరలి రానున్న భక్తులు
- విఐపి ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- భక్తి పారవశ్యంతో ఉప్పొంగనున్న

రామానుజాపూర్ పరిసరాలు







**వెంకటాపూర్ :**కోరిన కోరికలు తీర్చే తల్లిగా, భక్తులకు కొంగుబంగారంగా నిలిచే నాంచారమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. వైశాఖ శుద్ధ పౌర్ణమి శుక్రవారం రోజున జాతర వైభవంగా నిర్వహించేందుకు ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్ల కొండ భాస్కర్, జిల్లా అధ్యక్షుడు కేతిరి బిక్షపతి తో పాటు ఎరుకల సంఘాల నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. రంగులు వేయించడంతోపాటు, భక్తులకు సౌకర్యాలు కల్పించేలా అధికారులతో మాట్లాడి కావలసిన ఏర్పాట్లను చేయించారు.

**విఐపి ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు..**

గత సంవత్సరం మాజీ సీఎం కెసిఆర్ కుమార్తె కవిత నాంచారమ్మ జాతరకు వచ్చి అమ్మవారి ఆశీస్సులు తీసుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈసారి కొత్తగా పార్టీ పెట్టిన కవిత మరోసారి జాతరకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు సైతం జాతరకు వచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది . దీంతో విఐపి ల కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. వేలాదిగా తరలిరానున్న భక్తులు...తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తో పాటు మహారాష్ట్ర చత్తీస్గడ్ రాష్ట్రాల నుంచి ఎరుకల కులస్తులు వచ్చి నాంచారమ్మకు మొక్కులు చెల్లించుకుంటారు వీరితోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు, ఎరుకల కులస్తులు తరలివస్తారు. వీరి కోసం ఇప్పటికే తాగునీటి వసతి, రోడ్డు సౌకర్యం, ఎండ దెబ్బ తగలకుండా టెంట్లు, వైద్య సౌకర్యం, ఇతర ఏర్పాట్లు చేపట్టారు. ఎరుకల కులస్తులు కొందరు ఏకలవ్యుని వేషధారణ, నాంచారమ్మ వేషధారణలతో సందడి చేయనున్నారు. దీంతో రామానుజాపూర్ గ్రామ పరిసరాలు ఆధ్యాత్మికతతో పాటు భక్తి పారవశ్యంతో ఉప్పొంగన్నాయి.

## నూతన కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ




**ములుగు :**ములుగు జిల్లా నూతన కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన హేమంత్ బోర్ఖడే ఐఏఎస్ ను జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామనాథ్ ఐపీఎస్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలు తదితర అంశాలపై ఇరువురు చర్చించారు. జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పరస్పర సహకారంతో పని చేయాలని నిర్ణయి ంచు కున్నారు. జిల్లాలో శాంతి భద్రత మరియు ప్రజా సంక్షేమానికి సంబంధించి అన్ని శాఖల సమ న్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు సమర్థవంతమైన పరిపాలన అందించడమే లక్ష్య ంగా కలిసి పనిచేయాలని ఇరువురు అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం లో ములుగు డి ఎస్ పి రవీందర్ ములుగు సి ఐ సురేష్ ఇన్స్పెక్టర్ శంకర్ పాల్గొన్నారు.

# డిజిటల్ జనగణనకు ములుగు జిల్లా సిద్ధం

- జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు
- స్వీయ నమోదు ద్వారా ఖచ్చితమైన సమాచారం
- ప్రజలు చురుకుగా పాల్గొనాలి
- ప్రభుత్వం, ప్రజల మధ్య వారధిగా మీడియా పాత్ర కీలకం



**ములుగు :**జిల్లాలో జన గణనను డిజిటల్ విధానంలో సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. గురువారం జిల్లా కలెక్టరెట్ లో జనగణన పై కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ..జనగణన ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, ముఖ్యంగా స్వీయ నమోదు (సెల్ఫ్ ఎన్యూమరేషన్ ) ద్వారా ఖచ్చితమైన వివరాలు నమోదు చేయాలని ప్రజలను కోరారు. జన గణన రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశ హౌస్ లిస్టింగ్ లో స్వీయ గణన ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 807 హౌస్ లిస్టింగ్ బ్లాకులు గుర్తించామని, ప్రతి బ్లాక్‌లో సుమారు 300 ఇళ్లు, 800 జనాభా ఉంటుందని వివరించారు. ఈ ప్రక్రియ కోసం 545 మంది ఎన్యుమరేటర్లు, 97 మంది సూపర్వైజర్లను (రిజర్వ్‌తో సహా) నియమించామని తెలిపారు. స్వీయ నమోదు కోసం ంవ.ఎవఅంబం.స్త్రశీజ.అఅ పోర్టల్‌లో కుటుంబంలోని ఒక సభ్యుడు లాగిన్ అయి వివరాలు నమోదు చేయవచ్చని తెలిపారు. నమోదు చేసే సమయంలో అత్యంత జాగ్రత్తగా వివరాలు నమోదు చేయాలని, ఒకసారి నమోదు చేసిన తరువాత సవరణకు అవకాశం ఉండదని సూచించారు. నమోదు చేసిన మొబైల్ నంబర్‌కు 11 అంకెల సంఖ్య వస్తుందని, ఆ సంఖ్యను ఎన్యుమరేటర్‌కు అందజేయాలని తెలిపారు. ఏవైనా తప్పులు ఉంటే ఎన్యుమరేటర్ ద్వారా మాత్రమే సవరించుకోవచ్చని స్పష్టం చేశారు. డిజిటల్ విధానంలో జరుగుతున్న ఈ జనగణనలో డేటా గోప్యతకు పూర్తి భద్రత ఉంటుందని, స్వీయ నమోదు ద్వారా వేగవంతంగా, ఖచ్చితమైన డేటా సేకరణ సాధ్యమవుతుందని చెప్పారు. జన గణన 2027 కోసం జిల్లాలో అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని, స్వీయ నమోదు చివరి తేదీ మే 10 అని తెలిపారు. సాధారణంగా నివసించే ప్రదేశంలోనే ప్రజలు నమోదు కావాలని సూచించారు. ప్రభుత్వం, ప్రజల మధ్య మీడియా వారధిగా కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు జిల్లా కలెక్టర్ సమాధానాలు ఇచ్చారు. ఈ మీడియా సమావేశంలో అదనపు కలెక్టర్ సి. హెచ్. మహేందర్ జి, డి పి ఆర్ ఓ రఫిక్, కలెక్టరేట్ జనగణన పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

## పెదవులు తరచూ పొడిబారుతున్నాయా.. అయితే ఈ చిట్కాలను పాటించండి..



ముఖం అందంగా కనిపించడంలో పెదవులు కూడా ముఖ్య పాత్ర పోషిస్తాయి. పెదవుల అందాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా చాలా ముఖ్యం. అయితే కొన్నిసార్లు పెదవులకు సంబంధించిన సమస్యలు కూడా తలెత్తూ ఉంటాయి. వాటిలో పెదవులు పొడిబారడం కూడా ఒకటి. ఈ సమస్యను చాలా మంది ఎదుర్కొనే ఉంటారు. పెదవులు పొడిబారడం (ఐతీఎ ాాఅజూం) చాలా మందిని వేధించే సాధారణ సమస్య. చల్లని వాతావరణం, ఎండ తీవ్రత, నీటి లోపం, తరచుగా పెదవులను నాలుకతో తడి చేయడం, కొన్ని కాస్మెటిక్ ఉత్పత్తులలో ఉండే రసాయనాలు ఈ సమస్యకు ప్రధాన కారణాలుగా ఉంటాయి. ముఖ్యంగా దాల్చిన చెక్క, సిట్రస్, మింట్, మెంతోల్, కర్పూరం వంటి పదార్థాలు కలిగిన ఉత్పత్తులు పెదవుల పొడిబార్పును మరింత పెంచుతాయి. అయితే డెర్మటాలజిస్ట్ లు సూచించినట్లుగా పెదవులు పొడిబారడాన్ని తగ్గించడానికి కొన్ని సులభమైన చిట్కాలు పాటిస్తే మంచి ఫలితాలు పొందవచ్చు. పెదవుల పొడాబారడాన్ని తగ్గించే సుల భమైన చిట్కాల గురించి వారు వివరిస్తున్నారు. లిప్ బామ్ రాసే ముందు..లిప్ బామ్‌ను నేరుగా అప్లై చేయకుండా ముందు స్వల్పంగా మాయిశ్చరైజర్‌ను రాయడం మంచిది. ఇది పెదవుల తేమను రక్షించడంలో సహాయపడుతుంది. అలాగే పెదవులను తరచుగా నాలుకతో తడి చేయడం ఒక చెడు అలవాటు. తాత్కాలికంగా తేమ ఇచ్చినట్టు అనిపించినా, ఇది సహజమైన ఆయిల్స్‌ను తొలగించి మరింత పొడిబార్పుకు దారి తీస్తుంది. దీంతో ఒక చక్రంలా సమస్య పెరుగుతుంది. మ్యాట్ లిప్‌స్టిక్‌లను, ముఖ్యంగా ఎక్కువసేపు ఉండే డార్క్ షేడ్స్‌ను నివారించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇవి ఎక్కువగా వాక్స్, పౌడర్ కలిగి ఉండటంతో పెదవులను మరింత పొడిగా మార్చే అవకాశం ఉంటుంది. బదులుగా గ్లోసీ లేదా ఇతర షేడ్స్‌ను ఉపయోగించడం మంచిది. జెల్స్ వాడి తే..అలాగే మొటిమల చికిత్స కోసం వాడే జెల్స్ వంటి పదార్థాలు కలిగినవి) పెదవుల దగ్గర ఉపయోగించకూడదు. ఇవి చర్మంలోని ఆయి ల్‌ను తగ్గించడానికి రూపొందించబడినవి కాబట్టి పెదవులకు చాలా కఠినంగా ఉంటాయి. రాత్రి పూట పెదవుల సంరక్షణ చాలా ముఖ్య మని నిపుణులు చెబుతున్నారు. నిద్రకు ముందు మాయిశ్చరైజర్‌ను రాసి, దాని పై పలుచని పెట్రోలియం జెల్లీ పొర వేస్తే ఉదయానికి పెద వులు తేమగా, మృదువుగా మారుతాయి. ఇటువంటి సులభమైన చిట్కాలను పాటించడం ద్వారా పెదవుల పొడిబార్పును తగ్గిం చుకో వచ్చు. సరైన సంరక్షణతో పెదవులు ఆరోగ్య ంగా, చక్కగా తెలియజేస్తున్నారు.

# టియూడబ్ల్యూజే (ఐజేయూ ) యూనియన్ బలోపేతానికి కృషి చేయాలి



- ఆ యూనియన్

రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు


- మే 15న ములుగులో

ఐజేయు యూనియన్ మహాసభ నిర్వహణ

- మహాసభను విజయవంతం చేయాలని పిలుపు

**గోవిందరావుపేట :** టి యు డబ్ల్యూ జే (ఐ జే యూ ) యూనియన్ బలోపేతానికి సభ్యులు కృషి చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు పిలుపునిచ్చారు. గురువారం ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం బస్సాపూర్ సమీపంలోని "విరించి " రిసార్ట్ లో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎండి షఫీ అహ్మద్, కార్యదర్శి చిదురాల వాసుదేవ్ ల అధ్యక్షతన యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి మండలంలో ఐజేయూ సంఘం సభ్యుల సంఖ్య ఎక్కువ మొత్తంలో ఉండే విధంగా నాయకులు బాధ్యత తీసుకోవాలని అన్నారు. యూనియన్ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే ములుగు జిల్లా ముందు వరుసలో ఉండాలని పిలుపునిచ్చారు. సంఘం సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా యూనియన్ రాష్ట్ర నాయకత్వం నిరంతరం శ్రమిస్తుందని అన్నారు. మే 15న ములుగు జిల్లా కేంద్రంలో ఐజేయు మహాసభ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని స్థానిక నాయకత్వానికి ఆయన సూచించారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి సంఘం సభ్యులను అధిక సంఖ్యలో తరలించి మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఇట్టి మహాసభ కార్యక్రమానికి యూనియన్ రాష్ట్ర నాయకత్వం తో పాటు ప్రెస్ అకాడమీ చైర్మన్ హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు. స్థానిక ఐజయు నాయకత్వం కలిసికట్టుగా మహాసభ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పలు అంశాలపై ఆయన స్థానిక యూనియన్ నాయకులతో చర్చించారు. ఈ సమావేశంలో ఐజేయు రాష్ట్ర కమిటీ సభ్యులు ఎలగందుల కొమురయ్య జిల్లా ఉపాధ్యక్షులు భేతి సతీష్ యాదవ్. గంపల శివ సంయుక్త కార్యదర్శి చుంచు రమేష్. గూగుల మోడీ హరికృష్ణ కోశాధికారి బైకానీ నటరాజ్. దాడుల వ్యతిరేక కన్వీనర్ జాలిగం శ్రీనివాస్ చిన్న పత్రికల ప్రధాన కార్యదర్శి. ఎనుగ ఒదుల. శంకర్. జింకల ప్రభాకర్. గోల్కొండ రాజు. ముంద్రాతి ప్రతాప్. కుదురుపాక ప్రవీణ్ అశోక్ పాలొగొన్నారు.

## వేసవి కాలంలో తప్పకుండా తినాల్సిన పండ్లు ఇవి.. ఎన్నో లాభాలను అందిస్తాయి..



కాలానుగుణంగా అనేక రకాల పండ్లు లభిస్తాయి. వేసవికాలం అనగానే అందరికీ ముందుగా మామిడిపండ్లు గుర్తుకువస్తాయి. కానీ మామిడిపండ్లు మాత్రమే కాకుండా వేసవికాలంలో అనేక రకాల ఇతర పండ్లు కూడా లభిస్తాయి. వాటిలో రోజ్ ఆపిల్ కూడా ఒకటి. రోజ్ ఆపిల్ లేదా సఫేద్ జామున్ వేసవి కాలంలో లభించే ప్రత్యేకమైన పండు. ఇది సుమారు 93 శాతం నీటిని కలిగి ఉండడంతో శరీరానికి సహజమైన హైడ్రేషన్‌ను అందిస్తుంది. దేశంలోని తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో ఇది ఎక్కువగా కనిపించినప్పటికీ మార్కెట్లో ఇది తక్కువగా వినియోగంలో ఉంది. ఈ పండులో తక్కువ క్యాలరీలు (10 గ్రాములకు 25-30 క్యాలరీలు) ఉండటం వల్ల దీన్ని తేలికపాటి ఆహారంగా పరిగణిస్తారు. అంతేకాకుండా ఫైబర్ సమృద్ధిగా ఉండటం వల్ల జీర్ణక్రియకు మేలు చేస్తుంది. విటమిన్ సి, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు వంటి సూక్ష్మపోషకాలు శరీర రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. శరీరాన్ని చల్లబరిచేందుకు..రోజ్ ఆపిల్ పండు అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంటుంది. ఇది శరీర ఉష్ణోగ్రతను తగ్గించే బ్లడ్ కూలెంట్ గా సంప్రదాయ వైద్యంలో ఉపయోగంలో ఉంది. వేసవిలో దాహాన్ని తగ్గించి, శరీర ద్రవ సమతుల్యతను నిలబెట్టడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. తక్కువ క్యాలరీలు, అధిక ఫైబర్ కారణంగా బరువు నియంత్రణలో కూడా ఉపయోగపడుతుంది. అలాగే ఇది స్వల్ప విరేచన లక్షణాలతో జీర్ణ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. దేశంలో అధిక ఉష్ణోగ్రతలు (40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా) నమోదయ్యే వేసవిలో డీహైడ్రేషన్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో సహజ పండ్ల వినియోగం ముఖ్యమవుతుంది. ప్యాకేజ్డ్ జ్యూసులు, చక్కెర పానీయాల బదులు రోజ్ ఆపిల్ వంటి పండ్లు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తాయి. అయినప్పటికీ ఇది అన్ని ప్రాంతాల్లో సులభంగా లభ్యం కాకపోవడం ఒక సమస్యగా ఉంది.

ఎలాగైనా తీసుకోవచ్చు..రోజ్ ఆపిల్‌ను తినే విధానాలు కూడా సులభంగా ఉంటాయి. దీనిని చల్లగా నేరుగా తినవచ్చు. ఫ్రూట్ సలాడ్‌లో నిమ్మరసం లేదా ఉప్పుతో కలిపి తీసుకోవచ్చు. మింట్, కీరదోసతో కలిపి స్మూతీగా కూడా తయారు చేసుకోవచ్చు. అయితే పండిన, పాడైన పండ్లను తప్పనిసరిగా నివారించాలి. అయితే, అధిక మోతాదులో తీసుకుంటే కొన్ని దుష్ప్రభావాలు కూడా కలుగుతాయి. జీర్ణ సమస్యలు, పొట్ట నొప్పి, విరేచనాలు వచ్చే అవకాశం ఉంటుంది. కొంతమందిలో అలర్జీ ప్రతిచర్యలు కూడా కనిపిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. అందువల్ల మధుమేహ రోగులు జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా గింజలను తినడం హానికరం అవుతుంది. ఇక పండులోని గుజ్జును మాత్రమే తీసుకోవడం మంచిది. రోజ్ ఆపిల్ పండు వేసవిలో శరీరానికి తేమను అందించే సహజ ఆహారం. అయితే దీనిని పరిమిత మోతాదులో, జాగ్రత్తలతో తీసుకుంటేనే పూర్తి ప్రయోజనాలు పొందవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

# ఏజీఎం పర్సనల్ జి.వి. మోహన్‌రావు పదవి విరమణ

**– శుభాకాంక్షలు తెలియజేసిన జీఎం షాలెం రాజు**




కొత్తగూడెం : ఏరియాలో ఏజీఎం (పర్సనల్)గా విధులు నిర్వహిస్తున్న జి.వి. మోహన్‌రావు ఏప్రిల్ 30 నాడు గౌరవవంతమైన పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. 27 ఆగస్ట్ 1989 న సేవలో చేరిన జి.వి. మోహన్‌రావు , తన సుదీర్ఘ సేవా ప్రయాణంలో అనేక ప్రాంతాల్లో విశిష్ట బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. ప్రారంభంలో రామగుండం ప్రాంతంలో వెల్ఫేర్ ఆఫీసర్ ట్రైనీగా 1996 నుండి 2003 వరకు సేవలందించారు. అనంతరం 2003 నుండి 2007 వరకు కొత్తగూడెం ఏరియాలో తన బాధ్యతలను నిర్వర్తించారు. తదుపరి కార్పొరేట్ హెడ్ ఆఫీస్‌లో 2020 వరకు వివిధ హోదాల్లో సేవలందించారు. 2021 నుండి 2025 వరకు ఇల్లందు ప్రాంతంలో డీజీఎంగా బాధ్యతలు చేపట్టి విశేష సేవలు అందించారు. అనంతరం 16 జూన్ 2025న ఇల్లందు నుండి కొత్తగూడెం ఏరియాకు బదిలీపై వచ్చారు. చివరిగా కొత్తగూడెం ఏరియాలో తన సేవలను కొనసాగిస్తూ గౌరవవంతమైన పదవీ విరమణ పొందారు.

వారితో పాటు, ఎంతోకాలంగా జీఎం కార్యాలయంలో ఫైనాన్స్ విభాగంలో క్యాషియర్ గా డిప్యూటీ సూపరిం టెండెం ట్‌గా విశిష్ట సేవలందిస్తున్న సిదిరాల సత్యనారాయణ కూడా ఈరోజు పదవీ విరమణ పొందారు.ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెం రాజు మాట్లాడుతూ, జి.వి. మోహన్‌రావు ని సిదిరాల సత్యనారాయణ తమ తమ విభాగాల్లో క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసి సంస్థకు విశేష సేవలు అందించారని అభినందించారు. వారి సేవలు సంస్థలో చిరస్మరణీయంగా నిలుస్తాయని తెలిపారు.సంస్థలో పలు కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించిన మోహన్‌రావు , కార్మికులు అధికారుల మధ్య సత్సంబంధాలు నెలకొల్పడంలో విశేష పాత్ర పోషించారు. సిదిరాల సత్యనారాయణ జీఎం కార్యాలయ నిర్వహణలో విశేష అనుభవంతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించి అందరి మన్ననలు పొందారు.జి.వి. మోహన్‌రావు మాట్లాడుతూ, సింగరేణి సంస్థలో పనిచేయడం తనకు గౌరవకరమైన అనుభవమని, తన సేవా కాలంలో సహకరించిన ఉన్నతాధికారులు, సహచరులు, ఉద్యోగులు కార్మికులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం షాలెం రాజు ,ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ముక్కపాటి వెంకటేశ్వర్లు , (సిఎంమ్ వో ఏ ఐ )అధ్యక్షులు నరసింహ రావు , ఏరియా ఇంజనీర్ కె. సూర్యనారాయణ రాజు, జీఎం ఐ ఆర్ పీఎం, ఏ జి ఎం (పర్సనల్) రాజేంద్ర ప్రసాద్ అంతోటి. నాగేశ్వరరావు ఎస్ సీ/ఎస్ టీ వెల్ఫేర్, జనరల్ సెక్రెటరీ, ఏఐటియ్యూసీ పిట్ సెక్రెటరీ సౌజన్య ఐఎంన్ టీయ్యూసి పిట్ సెక్రెటరీ సాగర్ , ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు కుటుంబ సభ్యులు పాల్గొని ఇద్దరు అధికారులను శాలువాలతో సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారి భవిష్యత్ జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు.

## లేబర్ కోడ్స్ రద్దుకై పోరాటాన్ని ఉధృతం చేయండి
## 140 వ మేడే ఘనంగా జరుపాలని ఐఎఫ్టియు విస్తృత ప్రచారం



ఇల్లందు న్యూస్ :–చికాగో అమరవీరుల స్ఫూర్తితో 140వ మేడేను ఘనంగా నిర్వహించాలని ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగపాణి,రాష్ట్ర ఉపాధ్యక్షులు యండి.రాసుద్దిన్, తెలంగాణ హమాలీ ఢమిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పందిర్లపల్లి వీరన్న,భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రావూరి ఉపేందర్ రావు కార్మికవర్గానికి పిలుపునిచ్చారు.140వ మేడే ను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం మండల పరిధిలోని కొమ్ముగూడెం,కొమరారం, బొజ్జయిగూడెం,ఇల్లెందు బస్టాండ్ సెంటర్లో లో ఆటో, హమాలి, గ్రామపంచాయతీ,భవన నిర్మాణ కార్మికుల అడ్డాల వద్ద కరపత్రాల ద్వారా నిర్వహించిన విస్తృత ప్రచారంలో వారు పాల్గొని మాట్లాడారు.కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై పోరాటం ఉధృతం చేయాలని140వ మేడే సందర్భంగా ఐఎఫ్టీయూ జాతీయ కమిటీ పిలుపునిచ్చిందని అన్నారు.అన్ని రంగాల కార్మికులు మేడే కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు ఏరియా కమిటీ నాయకులు ఎల్. ధనుంజయ,ఇరప నరేష్,బొర్ర రమేష్, హచ్చా,మంగీలాల్ సైదులు,వీరన్న, శ్రీను,నాలి సురేష్ కోటి,లక్ష్మణ్,సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందులో జరుగు రైతు సంఘం జాతీయ మహాసభల
## గ్రౌండ్స్ ను పరిశీలిస్తున్న రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



ఇల్లందు న్యూస్:– ఇల్లెందులో మే 11, 12, 13న నిర్వహించే రైతు సంఘం జాతీయ మహాసభలకు సంబంధించి జెకె బ్లాక్ డైమండ్ గ్రౌండ్స్ గురువారం సిపిఐ ఎంఎల్ ప్రజాబందా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు,పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు చంద్ర అరుణ, జిల్లా సహాయ కార్యదర్శి నాయిని రాజుతో కలిసి జెకె సింగరేణి గ్రౌండ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ (ఏఐయు కె ఎస్ ) మే 11, 12, 13వ తేదీలలో ఇల్లందులో జరుగు రైతు సంఘం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని వారు కోరారు.

రైతు నల్ల చట్టాలను రద్దు చేయాలని, స్వామినాథన్ సిఫారసులు అమలు చేయాలని ,పోడు రైతుదారులకు పట్టాలు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రైతాంగం సమస్యలపై నిరంతరం పోరాడుతూ వ్యవసాయ రంగాన్ని రక్షించడానికి కృషి చేస్తున్న, అఖిల భారత ఐక్య రైతు సంఘం జాతీయ మహాసభలు మే 11, 12, 13,న ఇల్లందులో జరుగుతున్నందున ఈమహా సబలను విజయవంతం చేయాలనీ వారు విజ్ఞప్తి చేశారు.యుద్ధం పేరుతో పెట్రోలు డీజిల్ గ్యాస్, కొరత లేకుండా అధికారులు చూడాలన్నారు. మహాసభల ముందు 11 వ తారీఖున ఇల్లందులో భారీ ప్రదర్శన బహిరంగ సభ ఉంటుందని ఈ బహిరంగ సభను విజయవంతం చేసే బాధ్యత ఇక్కడ రైతంగం, ప్రజల పైఉందని, అన్నారు. ఈ మహాసభలకు, 16 రాష్ట్రాల రైతు ప్రతినిధులు ఇల్లందుకు హాజరవుతున్నారని అన్నారు.

ఇల్లందు పట్టణంలోనీ వ్యాపారస్తులు ఇతర సోదరులందరూ హార్దిక, ఆర్థికంగా సహకారాన్ని అందించాలని కోరారు,

అధికా రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తెచ్చిన నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతం గానికి మద్దతుగా నిరంతరంగా పోరాడు తున్నది న్యూ డెమోక్రసీ ప్రజా పందా అని తెలిపారు. వ్యవసాయాన్ని కార్పొరేట్లకు

ఆప్పు చెప్పాలని చూస్తున్న బిజెపి ప్రభుత్వం, విధానాలని ఎండగట్టి వ్యవసాయాన్ని రక్షించటం కోసం ఢిల్లీ కేంద్రంగా 13 నెలల పాటు మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా

రైతంగాన్ని సమీకరించి పోరాడి విజయం సాధించిందని, కానీ

ప్రభుత్వం తాత్కాలికంగా వెనుక్కు తగ్గినప్పటికీ రైతంగానికి ప్రమాదం పొంచే ఉన్నదని వారు గుర్తు చేశారు. దేశంలో రైతంగం ప్రధానంగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు ప్రకారం మద్దతు ధర,పంటలకు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గోదావరి జలాలు సీతారామ ప్రాజెక్టు ద్వారా ఇల్లందు నియోజకవర్గానికి తాగు,సాగు నిరందించా లన్నారు.పోడు రైతు సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐయుకేస్ జిల్లా అధ్యక్షులు బుర్ర వెంకన్న పార్టీ ఇల్లందు డివిజన్ సహాయ కార్యదర్శి రేస్ బోస్

ఇల్లందు పట్టణ

కార్యదర్శి పాయం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు




కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ఌ జిల్లా మేజిస్ట్రేట్ అంకిత్, ఐఏఎస్ ఆదేశాల మేరకు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ సూచనల ప్రకారం జిల్లాలో రెడ్ క్రాస్ కార్యకలాపాలను బలోపేతం చేయడానికి ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నారు.ఈ నేపథ్యంలో జిల్లాలో రెడ్ క్రాస్ సంస్థను మరింత బలోపేతం చేయడానికి జిల్లా స్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు. ప్రధాన నిర్ణయాలు అదనపు కలెక్టర్ ని జిల్లా రెడ్ క్రాస్ శాఖ ఉపాధ్యక్షుడిగా ప్రత్యేక అధికారిగా నియమించారు. జిల్లా ఎంప్లాయ్మెంట్ అధికారి, జిల్లా కార్మిక అధికారి, జీఎం ఇండస్ట్రీస్‌లను సభ్యత్వ నమోదు డ్రైవ్‌కు నోడల్ అధికారులుగా నియమించారు. ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమం సందర్భంగా ఐడిఓసీ పాల్వంచ నందు నమోదు కేంద్రం ఏర్పాటు చేయబడింది.ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమం మే 1, 2026 నుండి మే 31, 2026 వరకు నిర్వహించబడుతుంది. సభ్యత్వ నమోదు ఆన్‌లైన్ ఆఫ్‌లైన్ విధానాలలో నిర్వహించబడుతుంది. ఈ కమిటీ జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించి, విజయవంతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని చర్యలు చేపడుతుంది.జిల్లా ప్రజలు, యువత, స్వచ్ఛంద సేవా సంస్థలు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో చురుకుగా పాల్గొని రెడ్ క్రాస్ సేవలను బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఇట్టి నమోదులో ఏమైనా సూచనలు ,సలహాలు కొరకు ఓ యస్ డి సూపరింటెండెంట్,పాల్వంచ కలెక్టర్ కార్యాలయము, ఫోన్ నెం –9392919706 ని సంప్రదించగలరు.

# కార్మిక దినోత్సవం





కొన్ని పురాణగాథలు కొన్ని రోజులను పండుగలుగా మార్చాయి. కొన్ని జాతీయ సంఘటనలు సమాజానికి పర్వదినాలు అవుతాయి. కొందరు మహనీయులు తమ రక్తాన్ని చిందించి కొన్ని రోజులను చారిత్రాత్మక రోజులుగా మారుస్తారు. “మేడే” ఒక చారిత్రాత్మక చైతన్య దినం. చికాగోలో వున్న కొంతమంది రక్తతర్పణం చేసి కేవలం తమ దేశంలో వుండే కార్మికవర్గానికే కాకుండా ప్రపంచానికంతటికీ కొత్త వెలుగును అందించారు.ప్రజల శ్రమను రోజుల తరబడి దోచుకున్న సమయంలో మేమూ మనుషులమే, మా శక్తికి కూడా పరిమితులుంటాయి. ఈ చాకిరీ మేం చేయలేమని పని ముట్లు కింద పడేసి ఎనిమిది గంటల పని దినం కోసం పోరాడటం, చివరకు ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యజించడం కార్మిక వర్గ పోరాట పటిమకు నిదర్శనం. 24 గంటలలో ఎనిమిది గంటలు పని, ఎనిమిది గంటలు విశ్రాంతి (రెస్టు), ఇంకా ఎనిమిది గంటలు రిక్రియేషన్ అన్నవి ఈ పోరాటం ద్వారా సాధించుకున్నారు. ఇది పారిశ్రామిక యుగం ఏర్పడిన తర్వాత కలిగిన మార్పు యాంత్రికయుగం రాకముందు మనిషి గంటలకొద్దీ పనిచేసేవాడు. అదొక బానిస బతుకు. మనిషి తన విజ్ఞాన పరిశోధనల మూలంగా యంత్రాలను సృష్టించుకున్నాడు. యాంత్రిక యుగంలో క్యాపిటలిజం ఏవిధంగా పెరిగిందో అదే స్థాయిలో సామాజిక స్పృహ, చైతన్యం కూడా పెరిగాయి. అందువల్లనే పనిగంటల పోరాటం వచ్చింది. కానీ భారతదేశంలో చికాగో కంటే ముందే, కలకత్తాలో కార్మికులు నిర్ణీత పనిగంటల కోసం హౌరా రైల్వేస్టేషన్‌లో 1862లో సమ్మెచేశారు. అప్పటివరకు ఆ రైల్వే కార్మికులు 10 గంటలు పనిచేసేవారు. అప్పుడే బెంగాల్ పత్రికల్లో పాలకవర్గానికి చెందిన అధికారులు ఎన్ని గంటలు పనిచేస్తారో మేము కూడా అన్ని గంటలే పనిచేస్తామని డిమాండ్ చేశారు. కాగా, అది విస్తృత స్థాయిలో ప్రజా పోరుగా మారలేదు. కాబట్టి ఆ సంఘటన ఉద్యమ స్వరూపాన్ని అందుకోలేదు.

1923లో మొదటిసారి భారతదేశంలో ‘మే డే’ను పాటించడం జరిగింది. 1920లో ట్రేడ్ యూనియన్ ఏర్పడటం మూలంగా అప్పటినుంచే కార్మికవర్గంలో చైతన్యం పెరగడం మొదలైంది. అప్పటినుండి ‘మే డే’ను పాటించడం జరుగుతుంది. కానీ అసంఘటిత కార్మికవర్గం అన్ని రంగాల్లో వచ్చింది. 1985 తర్వాత చోటుచేసుకున్న ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పరిణామాల వల్ల అసంఘటిత కార్మికవర్గాల కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడంలేదు.

ముఖ్యంగా, ఐ.టి.రంగంలో ఎంతోమంది ఆడపిల్లలు, యువకులు పనిచేస్తున్నారు. ఈనాడు మార్కెట్ శక్తులు ఎక్కడ శ్రమను దోచుకునే అవకాశం వుంటే అక్కడ కంపెనీలు పెడుతున్నారు. అమెరికాలో వున్న కంపెనీలు అక్కడ ప్రజాచైతన్యం ఉన్నది కాబట్టి కార్మిక చట్టాలు అమలుకానటువంటి ఇండియాలో కంపెనీలు పెడుతూ వాళ్ళచే 10,12 గంటలు పనిచేయిస్తున్నారు. మాదాపూర్, హైటెక్ సిటీలో విద్యావంతులైన యువత ఈనాడు శ్రమ దోపిడీకి బలవుతున్నది. రాత్రుళ్లు ఆడపిల్లలను భద్రతలేకుండా ఇళ్ళకు పంపించడం మూలంగా నేరాల సంఖ్య కూడా పెరుగుతున్నది. కార్పొరేట్ సంస్థల డబ్బు మోజులో పడి వారి కనీస హక్కులను కూడా వారు కోల్పోవడం శోచనీయం కేవలం విలాసవంతమైన జీవితాల మోజులో వారి వ్యక్తిగత జీవితాన్ని కూడా కోల్పోతున్నారు అయినా వారి హక్కులగూర్చి విద్యాధికులైన యువతకు కనీస అవగాహన లేకపోవడం విద్యావ్యవస్థలో అతిపెద్ద లోపం. పెట్టుబడిదారీ వ్యవస్థ వున్నంతవరకు శ్రమదోపిడీ, ఎక్కువ పనిచేయించుకోవడం సర్వసాధారణం. కార్మిక చట్టాలను ఐ.టి. రంగంలో కూడా అమలుకై పోరాటం ఈనాడు అత్యంత అవసరం. కార్మిక చట్టాలు అమలు చేయబోమని పాలకవర్గాలు బహుళజాతి కంపెనీలకు హామీలిస్తూ దేశంలోకి స్వాగతిస్తున్నాయి. అసంఘటితరంగంలో అయితే సరేసరి. ఇటీవల ప్రభుత్వం కాంట్రాక్టు, పార్ట్‌టైం ఉద్యోగుల పేరుతో ప్రవేశపెట్టిన ఔట్ -- సోర్సింగ్‌లోను కార్మిక చట్టాల నియమాలు అమలులో లేవు. గిగ్ వర్కర్ల పట్ల కూడా కార్మిక చట్టాలు నియమాలు అమలులో లేవుఉదాహరణకు : ఇంటర్మీడియట్ వ్యవస్థలో రెగ్యులర్ ఉద్యోగుల కన్నా కాంట్రాక్టు ఉద్యోగులే అధికమైనారు. అంతేకాకుండా ప్రభుత్వరంగంలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య కూడా క్రమంగా తగ్గిపోయింది. అందుకు నిదర్శనమే పై ఉదాహరణ.నిరుద్యోగాన్ని, బలహీనతలను ఆసరా చేసుకొని వాళ్ళచే 10,12 గంటలు పనిచేయిస్తున్నారు. ఇది విద్యా, వైద్య రంగాల్లో ప్రయివేటీకరణ పెరిగిన కొద్దీ సర్వీసు భద్రత తక్కువవుతుంది కాబట్టి శ్రమదోపిడీ కూడా పెరుగుతుంది. వెనుకటికి స్కూళ్ళు 10 నుండి 14గంటల వరకు పనిచేసేవి. పిల్లవాణ్ణి ఆరు గంటల కంటే ఎక్కువ చదివించకూడదని విద్యావేత్తలు, పరిశోధకులు చెబుతున్నా, సెమీ రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ పేర పాఠశాలలు సర్వసాధారణమైపోయాయి. ఆ టీచర్స్ నోరు మెదపకుండా 12 గంటలు పనిచేయాల్సిన పరిస్థితి వచ్చింది.ప్రపంచీకరణ వలన వంద సంవత్సరాల క్రితం సాధించిన కనీస డిమాండ్లు కూడా ఈనాడు అమలుకు నోచుకోవడంలేదు.1886లో ఆరంభమైన ఈ ఉద్యమం వందేళ్ళ పండగ జరుపుకుంది. ప్రపంచంలో ఎనిమిది గంటల పనికోసం చేసిన పోరాటం పెట్టుబడిదారీ వర్గం పతనానికి ఆరంభమవుతుందనుకున్నాం. కానీ మళ్ళీ మార్కెట్ శక్తులు పాత పరిస్థితులకు ప్రాణప్రతిష్ఠ చేస్తున్నాయి. ఆనాటి కార్మికవర్గ చైతన్యం మరోసారి వెల్లివిరుస్తుందని, ఈ మే డే నాడు కొత్త స్ఫూర్తిని రగిలిస్తుందని ఆశిద్దాం. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలు, మొదలైన పీడక వర్గాలు శ్రామిక దోపిడీకి, కార్మిక చట్టాల ఉల్లంఘనకు సంఘటితమవుతున్న ఈ తరుణంలోనే ప్రపంచ కార్మికవర్గం ఆ శక్తులను ప్రతిఘటించేందుకు ద్విగుణీకృత ఉత్సాహంతో పోరాడాలి. ప్రపంచ శాంతిని అసలు ఈ భూగోళాన్నే కాపాడుకోవాల్సిన అవసరం కూడా ఉంది. అందుకు కార్మిక శ్రేణులు ఏకం కావాల్సిన చారిత్రక సందర్భం కూడా ఇదే.

**–స్వర్ణకుమార్ కొండా**
**ఎగ్జిక్యూటివ్ బ్యూరో**

## ఫ్యాటీ లివర్ ఉన్న వారు ఈ నూనెలను వాడాలి.. వాటి విషయంలో రాజీ పడవద్దు..



మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్ల కారణంగా తలెత్తున్న అనారోగ్య సమస్యల్లో ఫ్యాటీ లివర్ కూడా ఒకటి. ఫ్యాటీ లివర్ కాలేయంలో అధిక కొవ్వు పేరుకుపోవడం వల్ల కలిగే సాధారణ ఆరోగ్య సమస్య. ప్రారంభ దశలో లక్షణాలు కనిపించకపోయినా, తర్వాత కాలేయంలో వాపు, నష్టం, తీవ్రమైన పరిస్థితుల్లో వంటి సమస్యలకు దారి తీసే ప్రమాదం ఉంటుంది. అందుకే సరైన ఆహారం, జీవనశైలి మార్పులు పాటించడం చాలా ముఖ్యం. ఇక గ్యాస్ట్రోఎంటరాలజీ నిపుణుల ప్రకారం వంటలో ఉపయోగించే నూనెల ఎంపిక కూడా ఫ్యాటీ లివర్ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా సోయాబీన్, కార్న్, కాటన్‌సీడ్, గ్రేప్‌సీడ్, కనోలా వంటి నూనెలను అధికంగా వాడడం కాలేయ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది.ఎక్స్‌ట్రా వర్జిన్ ఆలివ్ ఆంఎల్, ఆవ నూనె..అయితే కొన్ని ఆరోగ్యకర నూనెలు కాలేయానికి మేలు చేస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. ఎక్స్‌ట్రా వర్జిన్ ఆలివ్ ఆయిల్‌లో ఉన్న యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కాలేయ వాపును తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తుంది. దీనిని సలాడ్స్‌లో లేదా తక్కువ వేడి వంటల్లో ఉపయోగించవచ్చు. అవకాడో ఆయిల్ కూడా మంచి ఎంపికగా నిలుస్తుంది. ఇది బైల్ ప్రవాహాన్ని మెరుగుపరచి కొవ్వు జీర్ణక్రియను సులభతరం చేస్తుంది. మధ్యస్థ ఉష్ణోగ్రతలో వంటకు లేదా సలాడ్స్‌లో ఉపయోగించడం మంచిది. కోల్డ్-ప్రెస్డ్ ఆవ నూనెలో ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉండటం వల్ల ఇది వాపును తగ్గిస్తుంది. అలాగే జీర్ణక్రియను మెరుగుపరచి మెటబాలిజాన్ని పెంచడంలో సహాయపడుతుంది. భారతీయ వంటల్లో దీన్ని తేలికపాటి ఫ్రై లేదా తాళింపు కోసం ఉపయోగించవచ్చు.నువ్వుల నూనె, అవిసె గింజల నూనె..సెసేమ్ (నువ్వుల) ఆయిల్‌లో యాంటీ ఆక్సిడెంట్లు, లిగ్నాన్లు ఉండటం వల్ల కాలేయ ఎంజైమ్‌లను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది మెటబాలిజానికి కూడా మద్దతు ఇస్తుంది. ఫ్లాక్స్ సీడ్ ఆయిల్ (అవిసె గింజల నూనె)లో ఉండే ప్లాంట్-బేస్డ్ ఒమేగా-3 కొవ్వులు కాలేయంలో కొవ్వును తగ్గించడంలో సహాయపడతాయి. అయితే ఇది వేడి పట్ల సున్నితంగా ఉత్తమం.

# శ్రీ మహావిష్ణువు ఆరో అవతారం- పరశురామ విశేషాలు ఇవే!



శ్రీ మహావిష్ణువు దశావతారాల్లో పరశురామావతారం కూడా ఒకటి. పరశురాముడు శ్రీమహావిష్ణువు ఆరో అవతారం అని చెబుతారు. పరశు అంటే గొడ్డలి. పరశురాముడు శివుని గురించి ఘోరమైన తపస్సు చేసి శివుని నుంచి అఖండ గొడ్డలిని వరంగా పొంది, దుష్టశిక్షణ చేసినట్లు పురాణాలు చెబుతున్నాయి. వైశాఖ శుద్ధ తదియ పరశురామ జయంతి సందర్భంగా ఆ మహానుభావుని గురించి కొన్ని విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

## పరశురామ జయంతి ఎప్పుడు?

పరశురాముడు వైశాఖ శుద్ధ తదియ నాడు, ప్రదోష కాలంలో జన్మించాడని స్కాంద, బ్రహ్మాండ పురాణాలు పేర్కొన్నాయి. ఇదే రోజు అక్షయ తృతీయ కూడా కావడం విశేషం. అయితే ఈ ఏడాది వైశాఖ శుద్ధ తదియ ఏప్రిల్ 19, ఆదివారం మధ్యాహ్నం 1:27 నిమిషాల నుంచి మరుసటి రోజు ఏప్రిల్ 20, సోమవారం ఉదయం 11:05 వరకు ఉంది. అయితే పరశురాముడు వైశాఖ శుద్ధ తదియ రోజు ప్రదోషం వేళలో అంటే సాయంత్రం సమయంలో జన్మించినందున ఈ ఏడాది పరశురామ జయంతి ఏప్రిల్ 19, ఆదివారం రోజునే జరుపుకోవాలని పంచాంగకర్తలు సూచిస్తున్నారు. సాధారణంగా ఈ పండుగ అక్షయ తృతీయతో కలిసి వస్తుంది. కానీ ఈసారి అక్షయ తృతీయ రోజు సాయంత్రం తదియ తిథి లేనందున ఏప్రిల్ 19, ఆదివారం రోజునే పరశురామ జయంతి అని పండితులు చెబుతున్నారు.

## పరశురాముని అవతార విశిష్టత

హిందూ పురాణాల ప్రకారం, శ్రీ మహావిష్ణువు ఆరో అవతారమే పరశురాముడు. స్కాంద, బ్రహ్మాండ పురాణాల ప్రకారం, పరశురామ అంటే పరశును ధరించిన రాముడని అర్థం. పరశురాముని ఆయుధం గొడ్డలి. జమదగ్ని మహర్షి, రేణుకల వరపుత్రుడు పరశురాముడు. తన తండ్రిని అవమానించారన్న కోపంతో క్షత్రియ వంశాలను సమూలంగా నాశనం చేసిన పరశురాముని ఒకింత కోపం ఎక్కువే అని అంటారు. కానీ ఈ కోపం కూడా లోక కల్యాణానికి ఉపయోగపడింది. సమాజాన్ని రక్షించే బాధ్యత మరచిన క్షత్రియ సమాజంలో అహంకారపూరిత రాజులను మాత్రమే ఆయన ఓడించాడు.

## ఒకేసారి రెండు అవతారాలు ఎదురు పడ్డ సందర్భం

శ్రీ వాల్మీకి రామాయణం ప్రకారం స్వయంవరంలో సీతాదేవిని వరించిన శ్రీరాముడు కల్యాణరాముడై అయోధ్యకు తరలి వెళ్లే సందర్భంలో తొలిసారి శ్రీరామునికి పరశురాముడు ఎదురవుతాడు. ఇలా ఒకేసారి శ్రీ మహావిష్ణువు రెండు అవతారాలు ఎదురు పడడం అరుదైన సందర్భం.

## దుష్టశిక్షణ శిష్టరక్షణ

స్కంద పురాణం ప్రకారం దుష్టులను శిక్షించేందుకు, అమాయకులను రక్షించేందుకు పరశురాముడు అవతరించాడు. ఈ క్రమంలో ఆయన ఎన్నో పరీక్షలు ఎదుర్కోవాల్సి వచ్చింది. తన తండ్రి ఆదేశం మేరకు కన్న తల్లినే సంహరించి, తిరిగి తండ్రి నుంచి వరం పొంది ఆ వర ప్రభావంతో తన తల్లిని తిరిగి బ్రతికించుకున్న ధీరుడు. లక్ష్మీ దేవి అవతారమైన ధనవిని వివాహం చేసుకున్నాడు.

## చిరంజీవిగా వర్ధిల్లుతూ

మన పురాణాలు పేర్కొన్న సప్తచిరంజీవుల్లో పరశురాముడు కూడా ఒకడు. ఇప్పటికీ ఈయన భూమిపై సజీవంగా, చిరంజీవిగా తిరుగాడుతున్నాడని విశ్వాసం. మహాభారతం ప్రకారం పరశురాముడు భీష్ముడు, ద్రోణాచార్యుడు, కర్ణులకు గురువు కూడా వ్యవహరించినట్లుగా పురాణాల ద్వారా తెలుస్తోంది.

## పరశురామ జయంతి ఎలా జరుపుకోవాలి?

పరశురామ జయంతి రోజున భక్తులు ఉపవాసం ఉండి శ్రీ మహావిష్ణువు అవతారమైన పరశురాముడిని షోడశోపచారాలతో పూజిస్తారు. "జమదగ్ని సుత! వీర!" అంటూ ఆయన్ని ఆరాధిస్తారు. పరశురామ జయంతి రోజు కొన్ని ప్రాంతాల్లో భజనలు, కీర్తనలు, రామాయణ పారాయణ వంటి కార్యక్రమాలు చేపడతారు. శోభాయాత్రను కూడా నిర్వహిస్తారు. పరశురామ జయంతి రోజు పరశురామావతార విశిష్టతను చదివినా విన్నా క్రమశిక్షణ, ధైర్యం కలుగుతాయని చిరంజీవిగా జీవిస్తారని విశ్వాసం. రానున్న పరశురామ జయంతి రోజు మనం కూడా పరశురాముని పూజించి ధైర్యసాహసాలు, దీర్ఘాయుష్షను పొందుదాం.

**ఓం నమో భగవతే వాసుదేవాయ!**

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# బహుభాషా నైపుణ్యంతో మెదడుకు మేలు - అందుకే పిల్లలకు ఎక్కువ భాషలు నేర్పించాలట!



అప్పుడప్పుడే మాటలు నేర్చుకొంటున్న చిన్నారులు స్కూల్లో చేరే వరకు కుటుంబ సభ్యుల మధ్యే ఉంటారు. దీంతో పేరెంట్స్, ఇంట్లో వాళ్లు ఏ భాష మాట్లాడితే దాన్నే అనుకరిస్తుంటారు. స్కూల్?కు వెళ్లడం మొదలు పెట్టిన తర్వాత హిందీ, ఇంగ్లీషు వంటి భాషలు సైతం తమ సిలబస్‌లో భాగంగా నేర్చుకొంటారు. ఈ క్రమంలో కొందరు తాము నేర్చుకొన్న భాషల్లో రాయడం, చదవడం వరకు మాత్రమే పరిమితం అవుతారు. ఇంకొందరు వాటిలో అనర్గళంగా మాట్లాడే నైపుణ్యాల్ని సంపాదించగలుగుతారు. ఇలా బహుళభాషాలు మాట్లాడగలిగే చిన్నారుల్లో, మెదడు చాలా చురుగ్గా పనిచేయడంతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందంటున్నారు నిపుణులు. మరి, ఎక్కువ భాషలు నేర్చుకోవడం వల్ల చిన్నారులకు కలిగే ప్రయోజనాలేంటో ఇప్పుడు తెలుసుకు మల్టీటాస్కింగ్! : ఈ తరం చిన్నారులు ఎంతో చురుగ్గా ఉంటున్నారు. చిన్నవయసులోనే ఎన్నో కొత్త విషయాలను నేర్చుకొంటున్నారు. ఓ వైపు చదువుకొంటూనే, మరో వైపు తమకు నచ్చిన వ్యాపకాల్లో రాణిస్తున్నారు. అయితే, సాధారణ చిన్నారులతో పోలిస్తే, ఎక్కువ భాషలు నేర్చుకొన్న పిల్లలు మరింత చురుగ్గా ఉంటారని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో మనం ఏ భాషలో ప్రశ్న సంధిస్తే తిరిగి అదే భాషలో సమాధానమివ్వగల సామర్థ్యం వారికి ఉంటుందట. ఒకే సమయంలో వేర్వేరు భాషల్లో మాట్లాడినప్పటికీ దానికి తగిన విధంగా వారు మారిపోగలరని పేర్కొంటున్నారు. దీన్నే ఇంగ్లిష్‌లో 'జగ్లింగ్ స్కిల్స్' (జీబస్త్రస్త్రశ్రీఅఅస్త్ర ంఎఅశ్రీశ్రీం) అని పిలుస్తారు. ఇలాంటి వారికి మల్టీ టాస్కింగ్ స్కిల్స్ ఎక్కువగా ఉంటాయట. అంతే కాదు, చిన్నారుల దృష్టిని మరల్చాలని ఇతరులు ప్రయత్నం చేసినప్పటికీ అది సఫలం కాదట. ఇలాంటి పిల్లలు భవిష్యత్తులో మల్టీ మారతారని తెలియజేస్తున్నారు. అంతేకాదు, వెంట వెంటనే విభిన్నమైన పనులు చేయడంలోనూ నేర్పరులుగా రాణిస్తారని వివరిస్తున్నారు. ఎక్కువ భాషలు నేర్చుకొన్న చిన్నారుల్లో ఒకే సమయంలో రెండు పనుల్ని చేయగలిగే సామర్థ్యం పెరుగుతుందని పలు అధ్యయనాల్లో తేలింది.మెదడు చురుగ్గా : భాషలు పనిచేయడానికి సంబంధం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఎలాగంటే, ఒకటి కంటే ఎక్కువ భాషలు నేర్చుకొన్నప్పుడు వాటికి సంబంధించిన పదజాలమంతా బ్రెయిన్?లో నిక్షిప్తమై ఉంటుంది. ఇది జ్ఞాపకశక్తిని పెంచుతుందట. అంతేకాదు, ఏ భాషనైతే మాట్లాడు తున్నామో, దానికి సంబంధించిన పదజాలాన్ని మాత్రమే ఎంచుకొనేలా మెదడు వేగంగా స్పందిస్తుందని అంటున్నారు. ఇలా మెదడుకు చురుకుదనం అలవాటవుతుందట. దీనికి సంబంధించి నిర్వహించిన వివిధ పోటీల్లో ఒకే భాషపై పట్టున్న వారి కంటే రెండు కంటే ఎక్కువ భాషలు మాట్లాడగలిగే వారు చాలా చురుగ్గా ఉన్నట్లు కొన్ని పరిశోధనల్లో గుర్తించాత్రణ : పిల్లలకు సంతోషమొచ్చినా, కోపమొచ్చినా వారిని నియంత్రించడం కష్టం. కానీ, ఒకటి కంటే ఎక్కువ భాషలు తెలిసిన చిన్నారులు మాత్రం తమ భావోద్వేగాలను తామే నియంత్రించుకునే అవకాశం ఎక్కువగా ఎలాగంటే, ఎక్కువ భాషలు తెలిసిన పిల్లలు ఒక భాషలో మాట్లాడుతున్నప్పుడు దానికి సంబంధించిన పదాలను మాత్రమే చెందిన పదాలు రాకుండా జాగ్రత్త పడతారు. ఈ క్రమంలో ఎలాగైతే ఇతర భాషా పదాలు రాకుండా తమని తాము నియంత్రించుకొంటారో, అలాగే భావోద్వేగాల విషయంలోనూ ప్రవర్తిస్తారని పలు అధ్యయనాల్లో తేలింది. అలాగే వీరిలో ఏకాగ్రత కూడా ఎక్కువగా ఉంటుందట. ఎలాంటి కష్టమైన పనైనా సరే పూర్తి దృష్టి దాని పైనే పెట్టగలరట. అంతేకాదు, తాము అనుకొన్న దాన్ని సాధించాలనే దృఢ సంకల్పంతో ఉండడం బహు భాషా ప్రావీణ్యం ఉన్న చిన్నారుల నైజం. పైగా తాము చేసే పని వినూత్నంగా ఉండాలనీ అనుకుంటారట.

# పవిత్ర వైశాఖ మాసంలో నృసింహ జయంతి- ఆ రోజున స్వామిని భక్తితో పూజిస్తే అనేక శుభాలు!



పరమ పవిత్రమైన వైశాఖ మాసంలో ప్రతిరోజూ పండుగే! ప్రతి తిథి విశిష్టమైనదే! శ్రీ మహావిష్ణువుకు సంబంధించిన దశావతారాల్లో మూడు అవతారాలు ఒక్క వైశాఖ మాసంలోనే రావడం విశేషం. అంతేకాదు ఎందరో గురువులు, మహానుభావుల జననంతో వైశాఖ మాసం మరింత పవిత్రతను సంతరించుకుంది. శ్రీ మహావిష్ణువు దశావతారాల్లో ప్రధానమైన నరసింహ అవతారం వైశాఖ శుద్ధ చతుర్దశి రోజునే ఆవిర్భవించినట్లుగా పురాణాలు చెబుతున్నాయి. ఈ పవిత్రమైన రోజు నృసింహ జయంతిగా జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం. ఈ సందర్భంగా నృసింహ జయంతి విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

## నృసింహ జయంతి ఎప్పుడు?

అంతరంగంలో కరుణ, ఆహార్యంలో రౌద్రాన్ని ప్రదర్శిస్తూ దుష్టశిక్షణ శిష్టరక్షణ కోసం వెలసిన అవతార స్వరూపం నరసింహ స్వామి. తన భక్తుని కోసం వైశాఖ శుద్ధ చతుర్దశి రోజు స్తంభంలో స్వయంగా ఉద్భవించిన స్వయంభు అవతారమూర్తి నరసింహమూర్తి. ఏప్రిల్ 30, గురువారం నృసింహ జయంతి సందర్భంగా నృసింహ అవతార విశిష్టత తెలుసుకుందాం.

## నృసింహ అవతార విశిష్టత

హిందూ పురాణాల ప్రకారం త్రిమూర్తుల్లో విష్ణువు లోకపాలకుడు. సాధు పరిరక్షణ కొరకు, దుష్టశిక్షణ కొరకు ఆయన ఎన్నో అవతారాలలో యుగయుగాన అవతరిస్తాడు. అలాంటి అవతారాల్లో 21 ముఖ్య అవతారాలను ఏకవింశతి అవతారములు అంటారు. వాటిలో అతి ముఖ్యమైన 10 అవతారాలను దశావతారాలు అంటారు. ఈ దశావతారాలలో నాలుగో అవతారమే నృసింహావతారము. హిరణ్యకశ్యపుని సంహారం కోసమే ఉద్భవించిన అవతారం నృసింహావతారం.

## ఎవరీ హిరణ్య కశ్యపుడు

కశ్యప ప్రజాపతి భార్య దితికి జన్మించిన అసురులు హిరణ్యాక్షుడు, హిరణ్య కశ్యపుడు. హిరణ్యాక్షుడు బలగర్వితుడై దేవతలను యుద్ధంలో ఓడిస్తూ అందరినీ భయభీతులను చేస్తున్న సమయంలో శ్రీ మహావిష్ణువు వరాహావతారంలో హిరణ్యాక్షుని సంహరిస్తాడు. సోదరుని మరణానికి చింతించిన హిరణ్యకశ్యపుడు ఎలాగైనా శ్రీహరిని అంతమొందించడం కోసం రాజ్యభారాన్ని మంత్రులకు అప్పగించి మంధర పర్వతానికి వెళ్లి ఘోరమైన తపస్సు చేయసాగాడు. అతని తపస్సుకు ముల్లోకాలు కంపించి పోసాగాయి. అప్పుడు బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై ఏమి వరం కావాలో కోరుకోమన్నాడు.

## హిరణ్య కశ్యపుడు కోరుకున్న వరం

హిరణ్య కశ్యపుడు విధాతకు మొక్కి తనకు గాలి, ఆకాశం, భూమి, నీరు, అగ్ని, రాత్రి, పగలు, దేవ, దానవ, మనుష్యులు, జంతువులు, ఆయుధములు, ఇంట, బయట వేటి కారణంగానైనా మరణం ఉండరాదని కోరాడు. అలాగే అని బ్రహ్మ వరాన్ని అనుగ్రహించాడు. ఇంక వరగర్వంతో హిరణ్యకశిపుడు విజృంభించాడు. అప్పుడు దేవతలు విష్ణువును ప్రార్థించగా 'హిరణ్య కశ్యపుడు తన కన్నకొడుకుకు ఆపద తలపెట్టిన రోజున వాడిని సంహరిస్తానని' దేవతలకు అభయమిస్తాడు.

## ప్రహ్లాద జననం

హిరణ్యకశ్యపుని భార్య లీలావతి గర్భం ధరించింది. అతిలోక సౌందర్యవతి అయిన ఆమెపై మోహంతో ఇంద్రుడు ఆమెను అపహరించుకొని పోతుండగా నారద మహర్షి అడ్డుకుని లీలావతి తన ఆశ్రమంలో ఆశ్రయమిచ్చి కాపాడుతాడు. నిరంతరం హరి నామ స్మరణతో మారుమ్రోగే ఆ ఆశ్రమ పరిసరాల్లో ఉన్నందున తల్లి గర్భంలో ఉండగానే ప్రహ్లాదుడు గొప్ప హరిభక్తి పరాయణుడవుతాడు.

## పువ్వు పుట్టగానే పరిమళించినట్లు

ప్రహ్లాదుడు పుట్టి పుట్టగానే హరి నామాన్ని ఉచ్చరిస్తూ తన తండ్రి ఆగ్రహానికి కారణమవుతాడు. అసలే విష్ణు ద్వేషి అయిన హిరణ్య కశ్యపుడు తన సొంత కుమారుడు నిరంతరం హరి నామాన్ని స్మరించడం కంటగింపుగా మారింది. హరినామ స్మరణ మానమని పసిప్రాయంలో ఉన్న ప్రహ్లాదుని ఎన్నో కఠినమైన శిక్షలకు గురి చేస్తాడు. కానీ అపార కరుణా మూర్తి అయిన ఆ శ్రీహరి తన భక్తుడైన ప్రహ్లాదుని అనేక ఆపదల నుంచి రక్షిస్తాడు.

## నరసింహుని ఉద్భవం

చివరకు ఒకరోజు హిరణ్య కశ్యపుడు విసిగిపోయి "ఎక్కడ ఉన్నాడురా! నీ శ్రీహరి, ఇప్పుడే చూపించు" అని ఆగ్రహంతో ప్రశ్నిస్తాడు. ఆ సమయంలో హిరణ్య కశ్యపుడు దేనిని చూపించి అందులో హరిని చూపించమంటాడేమో అని ఆ శ్రీహరి సర్వాంతర్యామిగా చరాచర సృష్టి మొత్తం వ్యాపించాడు. ఆ సమయంలో హిరణ్యకశ్యపుడు ప్రహ్లాదునితో 'ఈ స్తంభంలో హరిని చూపించమని' అంటాడు.

## నృసింహుని ఆవిర్భావం

ఆ సమయంలో బ్రహ్మాండ కటాహం బ్రద్దలయ్యే ఛటఛట ఫటఫటారావములు ధ్వనించాయి. పదిదిక్కుల నిప్పులు చెదిరాయి. దిక్కులు పిక్కటిల్లే శబ్దంతో నరసింహావతారంలో శ్రీహరి స్థంభం నుంచి ఉద్భవించాడు. మహా రౌద్రమైన స్వరూపంతో ఉన్న ఆ నరసింహ స్వామిని సామాన్యులు చూడలేక పోయారు. హిరణ్య కశ్యపుడు కోరుకున్నట్లే నరుడు కాదు జంతువూ కాదు అయిన నరసింహావతారంలో, పగలు రాత్రి కానీ సంధ్యా సమయంలో, ఇంటా బయటా కాకుండా గడప మీద, ప్రాణమున్నవి, లేనివి అయిన గోర్లతో నరసింహ స్వామి హిరణ్య కశ్యపున్ని ఆ నరసింహ స్వామిని సామాన్యులు చూడలేక పోయారు. హిరణ్య కశ్యపుడు కోరుకున్న కడుపును చీల్చి సంహరించాడు. ఇదంతా జరిగింది వైశాఖ శుద్ధ చతుర్దశి రోజు. ఆనాటి నుంచి వైశాఖ శుద్ధ చతుర్దశి రోజును నృసింహ జయంతిగా జరుపుకోవడం సంప్రదాయంగా మారింది.

## నృసింహ జయంతి రోజు ఏం చేయాలి?

నృసింహ జయంతి రోజు భక్తులు రోజంతా ఉపవాసం ఉండి, సాయంత్రం సంధ్యా సమయంలో నరసింహ స్వామికి అభిషేకం, పూజ చేస్తారు. ఈ రోజు శ్రీ నరసింహ కవచం, శ్రీ లక్ష్మి నరసింహ కరావలంబ స్తోత్రాలు పఠించడం చాలా మంచిది. నరసింహ జయంతి రోజున దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు ప్రతీక అయిన నరసింహ స్వామిని పూజించడం వల్ల శత్రుబాధలు తొలగుతాయని, కోర్టు వివాదాలు, ఆస్థి తగాదాలు, ఆర్థిక సమస్యలు తొలగుతాయని శాస్త్రవచనం. రానున్న నృసింహ జయంతి రోజు మనం కూడా నరసింహ స్వామిని భక్తితో పూజిద్దాం, సకల శుభాలు పొందుదాం.

**ఓం నమో నారసింహాయ నమః**

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం

# ఈ మొక్కలతో ఇల్లు చల్లగా ఉంటుందట - మీరూ ఇలా ట్రై చేసి చూడండి!



ఇప్పుడు బయట ఎండ మండిపోతోంది. ఇంట్లోనూ ఉక్కపోత తప్పట్లేదు. దీన్ని నుంచి ఉపశమనం పొందడానికి ఏసీలను తెగ వాడేస్తున్నాం. అలా వాడటం అనేక ఆరోగ్య సమస్యలకు కారణం కావొచ్చుంటున్నారు నిపుణులు. దీనికి పరిష్కారంగా ఇంట్లోనే కొన్ని రకాల మొక్కల్ని పెంచుకుంటే గాలి శుద్ధి, ఆహ్లాదకర వాతావరణంతో పాటు చల్లగా కూడా ఉంటుందని సూచిస్తున్నారు. ఈ క్రమంలో ఇంట్లో ఎలాంటి పెంచుకుంటే మంచిదో ఇప్పుడు తెలుసుకుందాం!కలబంద : ఎండా కాలంలో ఇంట్లో కలబంద మొక్కల పెంపకం ప్రయోజనకరంగా ఉంటుంది. కేశ సంరక్షణకు, చర్మ సౌందర్యానికి ఉపయోగపడే కలబంద. గది ఉష్ణోగ్రతలను క్రమబద్ధీకరించడంలోనూ ఉపయోగపడుతుందని నిపుణులు అంటున్నారు.వెదురు పామ్ : ఈ మొక్కలు కాంతి తక్కువ ఉన్న పరిస్థితుల్లోనూ పెరుగుతాయి. కాలుష్యాన్ని తొలగించి గాలి తాజాగా, చల్లగా ఉండేలా చేస్తాయి.మీ ఇంట్లో ఇద్దరు పిల్లలున్నారా? – మీరు ఈ విషయాలు తెలుసుకోవాల్సిందే!బేబీ రబ్బర్ : ఇంట్లో పెంచుకునే అందమైన మొక్కల్లో బేబీ రబ్బర్ ఒకటి. ఈ మొక్కలు గాలిలో టాక్సిన్లు తొలగించి, నాణ్యతను మెరుగుపరిచి వాతావరణాన్ని చల్లగా ఉంచుతాయి. చిన్నగా ఉంటుంది. కాబట్టి, దీన్ని ఇంట్లో ఎక్కడైనా సులభంగా పెంచుకోవచ్చు. రోజూ నీరు పోయాల్సిన అవసరం లేదు. 2010లో టెక్సాస్ ఎ అండ్ ఎం యూనివర్సిటీ అధ్యయనం ప్రకారం, బేబీ రబ్బరు మొక్కలు కార్బన్?డయాక్సైడ్ స్థాయిలను తగ్గించడంలో, ఇంట్లో గాలి నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడతాయి.ఇంట్లో ఉండే పచ్చని మొక్కలను చూడడం వల్ల కంటికి ప్రశాంతత కలిగి మనసు ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. ఈ మొక్కల్ని వారంలో నాలుగు రోజులు ఇంట్లో, రెండు రోజులు ఆరు బయట పెడితే ఎక్కువ కాలం ఉంటాయి. – ఎం. శ్రీధర్, ఉద్యాన శాఖ, అసిస్టెంట్ డైరెక్టర్

ఫైకస్ : దీన్ని చిన్నపాటి కుండీ లేదా తొట్టెలో ఇంట్లోనే పెంచుకోవచ్చు. ఈ మొక్క గాలిని శుద్ధి చేస్తుంది. ఫార్మాల్డి హైడ్, బెంజీన్, ట్రైక్లోరో ఎథిలీన్ వంటి గాలిలోని కాలుష్యాలను తొలగించడంతో పాటు వేడిని తగ్గించడంలో సాయపడుతుంది.లెమన్?గ్రాస్ : ఆక్సిజన్?తో పాటు యాంటీ ఆక్సిడెంట్లకు గొప్పగా పని చేస్తాయి. ఇవి గాలిని శుద్ధిచేసి పరిసరాలు తాజాగా ఉండేందుకు తోడ్పడతాయి.

ఫెర్న్ : ఎండాకాలంలో ఇంటిని చల్లగా ఉంచగల మొక్క ఇది. నిండా ఆకులతో కనువిందు చేసే ఫెర్న్ గాలిలో తేమను నిలిపే గుణం కలిగి ఉంటుంది. గాలిలోని కార్బన్?డయాక్సైడ్?ను గ్రహించి ఆక్సిజన్?ను విడుదల చేస్తుంది. ఇంట్లో గాలి నాణ్యతను వ ా ం ో ం గ ా ం వ ో చ ా డ ో ం లో న ా సహాయపడుతుంది.స్నేక్ ప్లాంట్ : ఈ మొక్కలు ఫార్మాల్డిహైడ్, బెంజీన్ వంటి టాక్సిన్లను తొలగించడంతో ఇంట్లో గాలి శుభ్రపడుతుంది. ఇది రాత్రిపూట ఆక్సిజన్?ను విడుదల చేస్తుంది.స్పైడర్ ప్లాంట్ : గాలిలో ఉండే కార్బన్?డయాక్సైడ్, ఫార్మాల్డి హైడ్?లను తొలగించడంలో స్పైడర్ ప్లాంట్?లు ప్రభావవంతంగా పనిచేస్తాయి. ఇవి గాలిలో తేమను జోడించి ఇల్లంతా చల్లగా ఉండేలా చేస్తాయట.తులసి : తులసి ఇంట్లోని కార్బన్?డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ వంటి హానికరమైన కాలుష్య కారకాలను గ్రహించి గాలిని శుద్ధి చేస్తుంది. ఇది రోజులో సుమారు 20 గంటల వరకు ఆక్సిజన్?ను విడుదల చేస్తుంది.

# బుమ్రా కూడా మనిషే.. మరమనిషి కాదు

**•ముంబై ఇండియన్స్ బౌలింగ్ కోచ్ కీరన్ పోలార్డ్**



పేలవ ఫామ్‌తో సతమతమవుతున్న ముంబై ఇండియన్స్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు ఆ జట్టు మేనేజ్‌మెంట్ అండగా నిలిచింది. బుమ్రా కూడా మనిషేనని, ఫామ్ కోల్పోవడం సహజమేనని ముంబై ఇండియన్స్ బౌలింగ్ కోచ్ కీరన్ పోలార్డ్ అన్నాడు. అతనికి ముంబై ఇండియన్స్ అండగా ఉంటుందని స్పష్టం చేశాడు.ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో బుమ్రా దారుణంగా విఫలమయ్యాడు. 4 ఓవర్లు బౌలింగ్ చేసి ఒక్క వికెట్ తీయకుండా 54 పరుగులు సమర్పించుకున్నాడు. ఇప్పటి వరకు 8 మ్యాచ్‌లు ఆడిన బుమ్రా రెండు వికెట్లు మాత్రమే తీసాడు. బుమ్రా ఐపీఎల్ కెరీర్‌లోనే ఈ సీజన్ అతనికి వరస్ట్‌గా మారిపోయింది. దాంతో అతనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న కీరన్ పొలార్డ్.. బుమ్రా వైఫల్యం గురించి మాట్లాడాడు. 'ఏ ఆటగాడైనా సరైన ప్రదర్శన చేయలేకపోతే.. వెంటనే ప్రతి చిన్న విషయాన్ని నిశితంగా పరిశీలిస్తుంటాం. సదరు ఆటగాడు ఎందుకు ఆడలేకపోతున్నాడనే దానిపై చర్చలు పెడుతుంటాం. ఇలాంటి వాటి నుంచి జస్‌ప్రీత్ బుమ్రా మినహాయింపేమీ కాదు. గత కొన్నేళ్లుగా అతను ఎలాంటి ప్రదర్శన కనబర్చాడో మనం చూశాం. బుమ్రా కూడా మనిషే కదా.. అతను కూడా తప్పులు చేస్తాడు. కాలం కలిసి రానప్పుడు గతంలో చేసిన మంచిని గుర్తు చేసుకోవాలి. బుమ్రా తన స్థాయికి తగ్గట్లు రాణించ లేకపోయాడు. అయినా.. ఇప్పటికీ అతను వరల్డ్ నంబర్‌వన్ బౌలర్. అలానే మా ముంబై ఇండియన్స్‌కు కీలక బౌలర్.

# అగ్రస్థానంపై కన్నేసిన ఆర్సీబీ



ఇండియన్ ప్రీమియర్ లీగ్ వేదికగా నేడు మరో రసవత్తపోరుకు రంగం సిద్ధమైంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌లో ఆతిథ్య గుజరాత్ టైటాన్స్ జట్టుతో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తలపడనుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకోవాలని ఆర్సీబీ చూస్తుండగా.. మరో విజయాన్ని తమ ఖాతాలో వేసుకోని ప్లేఆఫ్స్‌కు మార్గం సుగమం చేసుకోవాలని గుజరాత్ జట్టు ప్లాన్ చేస్తోంది. ఐపీఎల్ పాయింట్ల పట్టిక ప్రకారం.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఇప్పటివరకు ఆడిన 8 మ్యాచ్‌లలో 6 గెలిచింది. o1.919 నెట్ రన్ రేట్‌తో టేబుల్‌లో రెండో స్థానంలో నిలిచింది. ఒకవేళ గుజరాత్ టైటాన్స్ మ్యాచ్‌లో గెలిస్తే.. ఆర్సీబీ అగ్రస్థానానికి చేరుతుంది. ఆర్సీబీ ఆడిన గత 5 మ్యాచ్‌లను పరిశీలిస్తే 4 విజయాలు ఉండడం విశేషం. అలాగే శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని గుజరాత్ టైటాన్స్ జట్టు ఆడిన 8 మ్యాచ్‌ల్లో 4 మ్యాచ్‌ల్లో విజయం సాధించి.. పాయింట్ల పట్టికలో -0.475 నెట్ రన్ రేట్‌తో 5వ స్థానంలో నిలిచింది. ఈ మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో గురువారం అనగా ఏప్రిల్ 30న, భారత కాలమానం ప్రకారం రాత్రి 7:30 గంటలకు జరుగుతుంది. టాస్ రాత్రి 7 గంటలకు ఉంటుంది. ఈ మ్యాచ్ స్టార్ స్పోర్ట్స్ లేదా జియో హాట్‌స్టార్ వేదికలా ప్రత్యక్ష ప్రసారం చూడవచ్చు. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు 7 సార్లు తలపడ్డారు. అందులో ఆర్సీబీ 4 మ్యాచ్‌ల్లో గెలుపొందగా.. గుజరాత్ టైటాన్స్ 3 మ్యాచ్‌ల్లో నెగ్గింది. దీన్ని బట్టి పరిశీలిస్తే గుజరాత్‌పై ఆర్సీబీ పైచేయిగా ఉంది. అయితే నేడు జరిగే మ్యాచ్‌లో ఏం జరుగుతుందో చూడాలి. ఈ రెండు టీమ్స్ కలిసి ఏప్రిల్ 24న బెంగళూరులోని ఎం.చిన్నస్వామి స్టేడియంలో తలపడ్డారు. ఆ మ్యాచ్‌లో ఆర్సీబీ 5 వికెట్ల తేడాతో గెలిచింది. జీటీ 205/3 స్కోరు చేసింది. ఇప్పుడు లీగ్ దశలో మరోసారి ఇరు జట్లు తలపడనున్నాయి. ఆ మ్యాచ్‌లో సాయి సుదర్శన్ సెంచరీ సాధించగా, శు భ్‌మన్ గిల్ 32 పరుగులు చేశాడు. ఆర్సీబీ లక్ష్యాన్ని ఛేదించి, 206/5 స్కోరుతో ముగించింది. విరాట్ కోహ్లీ 81 పరుగులు చేయగా, దేవదత్ పడిక్కల్ 55 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో టోర్నీలో అత్యధిక పరుగులు రాబట్టి విరాట్ కోహ్లీ ఆరెంజ్ క్యాప్ దక్కించుకున్నాడు. అలాగే గుజరాత్ టైటాన్స్ జట్టుపై అతని సగటు 60కి పైగా ఉంది. అలాగే అత్యధిక పరుగులు సాధించిన వారిలో

# సూర్య ఆటపై మండిపడుతున్న అభిమానులు



2026 ఐపీఎల్‌లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన ముంబయి ఇండియన్స్ పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. ముఖ్యంగా ఆ జట్టు స్టార్ ప్లేయర్ సూర్య కుమార్ యాదవ్ ఫామ్ ఆందోళన కలిగిస్తోంది. తాజాగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లోనూ ఇదే పరిస్థితి. ఐదు పరుగులే చేసి పెవిలియన్ బాట పట్టాడు. ఈ సీజన్‌లో ఎనిమిది మ్యాచ్‌లు ముగిసినా సూర్య నుంచి చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ రాలేదు. దీంతో "స్కై"పై అభిమానులు విమర్శలు గుప్పిస్తున్నారు. అతడి కెరీర్ ముగిసినట్లేనా అంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.ఈ సీజన్‌లో సూర్యకుమార్ పూర్తిగా ఫామ్ కోల్పోయాడు. ఎనిమిది ఇన్నింగ్స్‌లలో 20.25 సగటున 162 పరుగులు మాత్రమే చేశాడు. సగటు మరీ దారుణంగా ఉంది. స్ట్రైక్ రేట్ 140.87 నమోదైంది. అయితే మిడిలార్డర్‌లో బాగా ఆడతాడనుకున్న స్కై ఈ సీజన్‌లో సత్తా చాటలేకపోతున్నాడు. చివరి ఆరు ఇన్నింగ్స్‌లో సూర్య వరుసగా 6, 33, 0, 15, 36, 5 స్కోర్లు చేశాడు. అప్పుడప్పుడు మెరిసినా, ఈ సీజన్‌లో గేమ్‌ఛేంజర్ లాంటి ఆట మాత్రం ఆడలేకపోయాడు. ముంబయి ఇండియన్స్ మిడిల్ ఆర్డర్‌కు సూర్యకుమార్ ఎంతో కీలకం. ఓపెనర్లు కష్టపడుతున్న సమయంలో బాధ్యత తీసుకోవాల్సిన అతడు తరచూ నిరాశ పరుస్తున్నాడు.సూర్యకుమార్ ఫామ్ విఫలమవుతుండటంపై సోషల్‌మీడియాలో తీవ్ర చర్చ జరుగుతోంది. గతంలోలాగా సూర్య ఎందుకు ఆడలేకపోతున్నాడని, అతడి పేలవ ప్రదర్శన వల్ల టీమ్ నుంచి వైదొలగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందా అంటూ కామెంట్లు పెడుతున్నారు. కీలక మ్యాచ్‌లలో రాణించలేకపోతున్నాడని అంటున్నారు. సూర్యకుమార్ ముంబయి ఇండియన్స్ స్టార్ బ్యాటర్లలో ఒకడు. 'సూర్య కంప్లీట్‌గా ఫామ్ కోల్పోయాడు. అసలు అతడు టచ్‌లోనే లేడు. ఇలాంటి వ్యక్తి టీమ్‌ఇండియాకు ఎలా నాయకత్వం వహిస్తున్నాడో అర్థం కావట్లేదు. కెప్టెన్ అనేవాడు ముందుండి జట్టును నడిపించాలి. కానీ అతడు పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాడు. ఇది ఇలాగే కొనసాగితే అతడు అనేక ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. కెప్టెన్సీ అనేది ప్రదర్శన ఆధారంగా వస్తుంది' అని ఓ నెటిజన్ ఎక్స్‌లో రాసుకొచ్చాడు. అలాగే 2024 సౌతాఫ్రికాతో సిరీస్ నుంచే సూర్య ఫామ్‌లో లేదని, అతడు 2025 ఆసియా కప్‌లోనూ విఫలమయ్యాడని మరో నెటిజన్ పోస్టు చేశాడు. టీ20 వరల్డ్‌కప్‌లోనూ సూర్య ఒక్క మ్యాచ్‌లో మాత్రమే రాణించాడని రాసుకొచ్చాడు. సూర్య కెరీర్ దాదాపు ముగిసినట్లే! 2028 టీ20 వరల్డ్‌కప్ కోసం టీమ్‌ఇండియా ఇప్పట్నుంచే కొత్త కెప్టెన్‌ను నియమించి ప్రిపరేషన్ ప్రారంభించాలని మరో యూజర్ అన్నాడు. అయితే మరికొంత మంది మాత్రం సూర్యకు మద్దతుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం సూర్యకు బ్యాడ్ ఫేజ్ నడుస్తుందని, కొంత ఓపిక పడితే అతడు సెట్ అవుతాడని భారీ ఇన్నింగ్స్‌తో కమ్‌బ్యాక్ అయ్యే ఛాన్స్ ఉందని అంటున్నారు. అయితే సూర్య ఇప్పటికైనా ఫామ్ అందుకొని పరుగులు సాధించాల్సిన అవసరం ఉంది. లేదంటే టీమ్‌ఇండియాలో అతడి స్థానం కూడా గల్లంతయ్యే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. ప్రస్తుత ఐపీఎల్‌లో వైభవ్ సూర్యవంశీ, ప్రియాంశ్ ఆర్య లాంటి కుర్రాళ్లు రాణిస్తుండడం, శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా ఆకట్టుకుంటుండంతో జట్టులో చోటు కోసం తీవ్ర పోటీ ఏర్పడుతుంది. అందుకే 35ఏళ్ల సూర్యను టీ20





# ఐపీఎల్‌లో దుమ్మురేపుతున్న సన్‌రైజర్స్..

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తన అద్భుత ప్రదర్శనతో దూసుకెళ్తూ.. ప్రత్యర్థి జట్లకు చుక్కలు చూపిస్తుంది. వరుసగా 5 విజయాలతో అదరగొట్టింది ఎస్ఆర్‌హెచ్ టీమ్. కేవలం మ్యాచ్‌ల్లో విజయాలతోనే కాకుండా.. వ్యక్తిగత అవార్డుల పరంగా కూడా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆధిపత్యం చాటుతోంది. ప్రస్తుతం ఆరెంజ్ క్యాప్, పర్పుల్ క్యాప్ రేసుల్లో టాప్‌లో సన్‌రైజర్స్ నిలిచింది. బ్యాటింగ్ విభాగంలో స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ అద్భుత ఫామ్‌లో కొనసాగుతున్నాడు. ఇప్పటివరకు 9 మ్యాచ్‌ల్లో ఏకంగా 209.35 స్ట్రైక్ రేట్ తో 425 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ రేసులో ఫస్ట్ ప్లేస్‌లో నిలిచాడు. ఇందులో ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. తన సూపర్ బ్యాటింగ్‌తో జట్టుకు మంచి ఆరంభాలు అందిస్తున్నాడు. ఇక అభిషేక్ శర్మకు తోడుగా కాటేరమ్మ కొడుకు హెన్రిచ్ క్లాసెన్ కూడా సూపర్ ఫామ్‌తో అదరగొడుతున్నాడు. క్లాసెన్ కూడా 414 పరుగులతో రెండో స్థానంలో కొనసాగుతూ ఉన్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్‌లో మిడిల్ ఓవర్లలో జట్టుకు స్థిరత్వాన్ని అందిస్తూ భారీ స్కోర్లను అందిస్తున్నాడు. మరోవైపు బౌలింగ్ విభాగంలో ఇషాన్ మలింగా కళ్లు చెదిరే ప్రదర్శనతో పర్పుల్ క్యాప్ రేస్‌లో మొదటి స్థానానికి దూసుకొచ్చాడు. 9 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసి టాప్‌లో నిలిచాడు. అతని బౌలింగ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. డెత్ ఓవర్లలో మలింగ వేసే యార్కర్లు, వేరియేషన్స్ ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేస్తున్నాయి. అలాగే బౌలింగ్‌లో ఇషాన్ మలింగా తర్వాత భువనేశ్వర్ కుమార్, జోఫ్రా ఆర్చర్‌లు కూడా వికెట్ల వేటలో దూసుకొస్తున్నారు.



# నా సక్సెస్ సీక్రెట్ ఇదే!

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ పరుగుల సునామీ సృష్టిస్తున్నాడు. ప్రస్తుతం టీ20 ఫార్మాట్‌లో ప్రపంచ నంబర్ వన్ బ్యాటర్‌గా ఉన్న అభిషేక్, తన అద్భుతమైన ఫామ్ వెనుక ఉన్న అసలు కారణాన్ని వెల్లడించాడు. ఆస్ట్రేలియా స్టార్ ఆటగాడు, తన టీమ్ మేట్ ట్రావిస్ హెడ్ ప్రభావం తన బ్యాటింగ్ శైలిపై చాలా ఎక్కువగా ఉందని అభిషేక్ పేర్కొన్నాడు. జియో స్టార్ తో జరిగిన సంభాషణలో అభిషేక్ తన మనసులోని మాటలను పంచుకున్నాడు. హెడ్ తన బ్యాటింగ్ అప్రోచ్ ను ఎలా మార్చాడో, మైదానంలో భయం లేకుండా ఎలా ఆడాలో నేర్పించాడో వివరించాడు. ట్రావిస్ హెడ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులోకి రాకముందు నుండే తాను అతని ఆటను గమనిస్తున్నానని, దాదాపు ఏడాదిన్నర కాలంగా అతని బ్యాటింగ్ స్టైల్ తనను ఆకట్టుకుందని అభిషేక్ తెలిపాడు. అతను తన టీమ్ మేట్ అయినప్పుడు తాను చాలా సంతోషించానని, అతనితో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం ఒక గొప్ప అనుభవమని వెల్లడించాడు. అతనితో మాట్లాడినప్పుడు మొదట అడిగింది అతని బ్యాటింగ్ మైండ్‌సెట్ గురించేనని, మూడు ఫార్మాట్లలోనూ అతను బౌలర్లపై ఎలా ఆధిపత్యం చెలాయిస్తాడో తెలుసుకోవాలని అనుకున్నానని అభిషేక్ చెప్పాడు. బ్యాటింగ్ విషయంలో ట్రావిస్ హెడ్ చాలా సింపుల్ ప్లాన్ ఫాలో అవుతాడని అభిషేక్ తెలిపాడు. "బంతిని జాగ్రత్తగా గమనించు, మొదటి బంతి నుండే బాదగలనని నీకు అనిపిస్తే ఏమాత్రం ఆలోచించకుండా షాట్ ఆడేయ్ అని హెడ్ నాకు సలహా ఇచ్చాడు. ఐపీఎల్ ప్రాక్టీస్ సెషన్లలో నేను అదే ఫాలో అయ్యాను. ఇప్పుడు నా

# రియాన్ పరాగ్‌కు భారీ షాకిచ్చిన బీసీసీఐ!



రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ సిగరెట్ వివాదాన్ని బీసీసీఐ తీవ్రంగా పరిగణించింది. అతడి మ్యాచ్ ఫీజులో 25శాతం కోత విధిస్తున్నట్లు పేర్కొంది. అలాగే పరాగ్ ఖాతాలో 1 డీమెరిట్ పాయింట్ కూడా చేర్చినట్లు తెలిపింది. ఈ మేరకు ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ అధికారికంగా ఓ ప్రకటన విడుదల చేసింది. పరాగ్ ఐపీఎల్ నిబంధనలు ఉల్లఘించినట్లు ఆ ప్రకటనలో పేర్కొంది.'పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి కోడ్ 2.21ను రియాన్ పరాగ్ ఉల్లంఘించాడు. దీనిని లెవెల్ 1 తప్పిదంగా భావిస్తూ అతడి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తూ, 1 డీమెరిట్ పాయింట్ చేర్చుతున్నాం' అని ఐపీఎల్ అడ్వైజరీ కమిటీ పేర్కొంది. పరాగ్ కూడా తన తప్పును అంగీకరించినట్లు తెలిసింది. అలాగే మ్యాచ్ రిఫరీ అమిత్ శర్మ విధించిన ఫైన్‌ను స్వీకరించాడు. కాగా, ఇటీవల ముల్లాన్‌పుర్ వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రియాన్ పరాగ్ చేసిన పని వివాదాస్పదం అయ్యింది. ఈ మ్యాచ్ సెకండ్ ఇన్నింగ్స్ 16వ ఓవర్లో డ్రెస్సింగ్ రూమ్‌లో కూర్చొని ఉన్న పరాగ్ ఈ సిగరెట్ (ఎలక్ట్రిక్ సిగరెట్) తాగుతూ కనిపించాడు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీనిపై పెద్ద దుమారమే రేగింది. డ్రెస్సింగ్ రూమ్‌లో అలాంటి పనులు చేయడంపై నెటిజన్లు సైతం పరాగ్‌పై మండిపడ్డారు. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న బోర్డు ఈ మేరకు చర్యలు చేపట్టింది.

అయితే భారత్‌లో ఈ సిగరెట్ల వాడకంపై నిషేధం ఉంది. వీటిని కేంద్ర ప్రభుత్వం 2019లోనే బ్యాన్ చేసింది. ఎలక్ట్రిక్ సిగరెట్లు, ఆ పరికరాల ఉత్పత్తి, అమ్మకం, కొనుగోలు, వాడకాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది. దీంతో పరాగ్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. అయితే ఈ నిబంధన ఉల్లంఘిస్తే ఎవరైనా సరే 'ప్రొహిబిషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్ సిగరెట్స్ యాక్ట్ (రాజుజూా) 2019' ప్రకారం రూ. లక్ష జరిమానాతోపాటు, జైలు శిక్ష కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది.

శుక్రవారం,
మే 01, 2026

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# తిరుమల శ్రీనివాసుని సన్నిధిలో.. ఘనంగా బెల్లంకొండ శ్రీనివాస్ వివాహం



టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న యువ కథానాయకుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఒక ఇంటివాడయ్యారు. ఆయన తన కొత్త జీవితంలోకి అడుగుపెట్టారు. కావ్య రెడ్డితో కలిసి ఏడడుగులు వేశారు. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి కొలువైన తిరుమల క్షేత్రంలో బుధవారం రాత్రి వీరి వివాహం అత్యంత వైభవంగా జరిగింది. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వేడుకను శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ వివాహ మహోత్సవంలో వధూవరులు బెల్లంకొండ శ్రీనివాస్, కావ్య రెడ్డి సంప్రదాయ పట్టు వస్త్రాలలో మెరిసిపోయారు. నూతన దంపతులు చూడముచ్చటగా కనిపించి అందరి దృష్టిని ఆకర్షించారు. ఈ శుభకార్యానికి తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేకంగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు రాజకీయ, సినీ రంగ ప్రముఖులు కూడా ఈ వేడుకకు విచ్చేసి కొత్త జంటకు శుభాకాంక్షలు తెలియజేశారు. టాలీవుడ్‌కు చెందిన పలువురు నటీనటులు, నిర్మాతలు, దర్శకులు కూడా ఈ పెళ్లికి హాజరై సందడి చేశారు.

అత్యంత సన్నిహితుల మధ్య జరిగిన ఈ వివాహ వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తమ అభిమాన హీరో కొత్త జీవితాన్ని ప్రారంభించడంతో అభిమానులు, నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. కొత్త దంపతులు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తున్నారు.

# మోదుగ ఆకుల గంపతో అనుపమ..

## 'భోగి' నుంచి ఆకట్టుకుంటున్న ఫస్ట్ లుక్!

యంగ్ హీరో శర్వానంద్ కథానాయకుడిగా, మాస్ డైరెక్టర్ సంపత్ నంది దర్శకత్వంలో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'భోగి'. ఈ చిత్రం నుంచి తాజాగా హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో ఆమె 'కందుల సులోచన రాణి' అనే పవర్ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. ఈ లుక్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సినీ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

విడుదలైన పోస్టర్‌లో అనుపమ పూర్తి గ్రామీణ యువతి అవతారంలో కనిపించారు. కాళ్లకు చెప్పులు లేకుండా మట్టి దారిలో నడుస్తూ, తలపై మోదుగ ఆకులు నింపిన పెద్ద గంపను మోస్తున్నారు. మరో చేతిలో ఆకులు, టిఫిన్ బాక్స్ పట్టుకుని ఉన్నారు. పాతకాలపు లంగావోణి, ఆమె ముఖంలో కనిపిస్తున్న దృఢమైన భావాలు పాత్రలోని తీవ్రతను సూచిస్తున్నాయి. వెనుక మట్టి ఇళ్లు, పశువులతో కూడిన పల్లెటూరి వాతావరణం కనిపిస్తోంది. ఈ చిత్రంలో సులోచన రాణి ప్రకృతితో మమేకమై జీవించే, ఎంతో ధైర్యంగల యువతిగా కనిపించనుందని తెలుస్తోంది. మోదుగ ఆకులతో విస్తరాకులు తయారు చేస్తూ జీవనం సాగించే ఆమె పాత్రలో సహనం, బలం రెండూ ఉట్టిపడతాయని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే శర్వానంద్ పుట్టినరోజు సందర్భంగా ఆయన 'గంగ' అనే పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడించిన విషయం తెలిసిందే.

1960ల ప్రారంభంలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లోని ఓ కల్పిత గ్రామంలో జరిగే పీరియడ్ యాక్షన్ డ్రామాగా 'భోగి' తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో డింపుల్ హయతి మరో కథానాయికగా నటిస్తున్నారు. ఇటీవల రాజమహేంద్రవరం, రంపచోడవరం, మారేడుమిల్లి అటవీ ప్రాంతాల్లో భారీ యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణను చిత్రబృందం పూర్తి చేసింది. తదుపరి షెడ్యూల్ మే మొదటి వారం నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రారంభం కానుంది.

భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి కిషోర్ కుమార్ అరోకియా సినిమాటోగ్రఫీ, కిరణ్ కుమార్ మన్నె ప్రొడక్షన్ డిజైన్ అందిస్తున్నారు. పాన్-ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాను రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆగస్టు 28న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.






# ప్రశాంతంగా నిద్రపోవడానికి 2062 వరకు ఆగాలేమో

దక్షిణాది చిత్రసీమలో చెక్కుచెదరని అందంతో, తిరుగులేని క్రేజ్‌తో దూసుకుపోతున్న త్రిష ఇన్‌స్టాగ్రామ్ లో పెట్టిన పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఎప్పుడూ గ్లామర్ ఫొటోలు, సినిమా అప్‌డేట్స్ ఇచ్చే త్రిష, ఈసారి తన వ్యక్తిగతమైన 'నిద్ర' గురించి చేసిన వింత లెక్క నెటిజన్లను అటు నవ్విస్తూనే, ఇటు ఆశ్చర్యానికి గురిచేస్తోంది. "ఒక గంట నిద్రను కోల్పోతే, దాని నుండి కోలుకోవడానికి నాకు నాలుగు రోజులు పడుతుంది. ఈ లెక్కన నేను మళ్ళీ ప్రశాంతంగా నిద్రపోవాలంటే 2062 వరకు ఆగాల్సిందేమో" అంటూ త్రిష చేసిన కామెంట్ వైరల్ అవుతోంది. ఆమె సరదాగా అన్నప్పటికీ, ప్రస్తుతం ఆమె షూటింగ్ షెడ్యూల్స్ ఎంత బిజీగా ఉన్నాయో, ఆమె ఎంతటి పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారో ఈ మాటలు ప్రతిబింబిస్తున్నాయి. త్రిష ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యుత్తమ దశలో ఉన్నారు. మెగాస్టార్ చిరంజీవితో భారీ సోషియో ఫాంటసీ మూవీ 'విశ్వంభర'తో పాటు, తమిళంలో సూర్యతో 'కరుప్పు' వంటి క్రేజీ ప్రాజెక్టులతో ఆమె డైరీ ఫుల్ అయిపోయింది. వరుస ప్రయాణాలు, రాత్రింబవళ్లు షూటింగులతో తీరిక లేకుండా గడపడం వల్లే ఆమెకు సరైన విశ్రాంతి దొరకడం లేదని స్పష్టమవుతోంది. సినిమాలతో పాటు తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న పుకార్లు, రాజకీయ అరంగేట్రంపై జరుగుతున్న ప్రచారం వంటివి కూడా ఆమెను కొంత ఒత్తిడికి గురిచేస్తుండవచ్చు. అందుకే తనకున్న మానసిక అలసటను ఇలా చమత్కారంగా సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు.



# రణ్‌వీర్ సింగ్ 'ప్రళయ్' ఆగిపోయిందన్న వార్తల్లో నిజం లేదన్న టీమ్

ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి

'ధురంధర్' ఫ్రాంచైజీతో భారీ విజయాన్ని అందుకున్న బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్, దర్శకుడు జై మెహతాతో కలిసి 'ప్రళయ్' అనే పోస్ట్-అపోకలిప్టిక్ థ్రిల్లర్ చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఇటీవల ఈ ప్రాజెక్ట్ ఆగిపోయిందంటూ వార్తలు గుప్పుమన్నాయి. రణ్‌వీర్‌కు, దర్శకుడికి మధ్య సృజనాత్మక విభేదాలు తలెత్తాయని, దాంతో సినిమాను పక్కన పెట్టారని ప్రచారం జరిగింది. ఈ పుకార్లపై చిత్రబృందానికి చెందిన సన్నిహిత వర్గాలు స్పందించాయి. 'ప్రళయ్' ఆగిపోయిందంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని వారు స్పష్టం చేశారు. "ప్రళయ్ సినిమా గురించి వస్తున్న ఊహాగానాలు పూర్తిగా నిరాధారమైనవి. ఈ ప్రాజెక్ట్ షెడ్యూల్ ప్రకారమే ముందుకు సాగుతోంది" అని తెలిపారు. అంతేకాకుండా, ఈ ఏడాది ఆగస్టు నుంచి సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుందని వెల్లడించారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని, స్క్రిప్ట్‌ను రణ్‌వీర్, జై మెహతా ఇప్పటికే ఫైనల్ చేశారని పేర్కొన్నారు.

# లండన్ ప్రేమ కథతో ఆనంద్ దేవరకొండ 'ఎపిక్'..

బేబీ' బ్లాక్ బస్టర్ తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య జంటగా నటిస్తున్న చిత్రం 'ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్'. 'చ90ం: ఏ మిడిల్ క్లాస్ బయోపిక్' వెబ్ సిరీస్‌తో ప్రేక్షకులను మెప్పించిన ఆదిత్య హాసన్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీ టీజర్ బుధవారం విడుదలై ఆసక్తిని రేకెత్తిస్తోంది. 'చ90ం' సిరీస్‌లో మెప్పించిన ఆదిత్య పాత్ర చుట్టూనే ఈ సినిమా కథ తిరుగుతుంది. మధ్యతరగతి కుటుంబంలో పెరిగిన ఆ యువకుడు ఇంటి సభ్యుల ఒత్తిడితో పైచదువుల కోసం యూకే వెళతాడు. అక్కడ వైష్ణవీ చైతన్యతో ప్రేమలో పడితే ఎలాంటి పరిణామాలు ఎదురయ్యాయనేది ఈ టీజర్‌లో చూపించారు. ఆనంద్ దేవరకొండ తన సహజ సిద్ధమైన నటనతో మధ్యతరగతి యువకుడిగా ఒదిగిపోయారు. పక్కా లోకల్ అబ్బాయి ఫారిన్ వెళితే పడే ఇబ్బందులను కామెడీగా చూపిస్తూనే, మరోవైపు ఎమోషనల్ లవ్ ట్రాక్‌ను కూడా ఆదిత్య హాసన్ టచ్ చేసినట్లు టీజర్‌ను బట్టి తెలుస్తోంది. యూకే నేపథ్యంలోని విజువల్స్ చాలా కలర్‌ఫుల్‌గా ఉన్నాయి. ఆనంద్, వైష్ణవి మధ్య కెమిస్ట్రీ మరోసారి వర్కవుట్ అయ్యేలా కనిపిస్తోంది. ఫస్ట్ సెమిస్టర్ అని టైటిల్‌లో ఉండటంతో ఇది యూత్, స్టూడెంట్స్ ఆడియన్స్‌ను టార్గెట్ చేసినట్లు స్పష్టమవుతోంది.




# అందరినీ అలరించే సినిమా

డిఫరెంట్ ఎంటర్‌టైనర్స్ చేస్తున్న తరుణ్ భాస్కర్... రైటర్–, డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి 'గాయపడ్డ సింహం'తో అలరించబోతున్నారు. ఈ చిత్రంలో హీరో శ్రీవిష్ణు స్పెషల్ రోల్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని పవన్ సాదినేని సమర్పణలో, కళ్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సల్ సప్తస్వ మీడియా వర్క్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ బ్యానర్ల పై నిర్మించారు. ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి కథానాయికలుగా నటించారు. జేడి చక్రవర్తి కీలక పాత్ర పోషించారు. 'గాయపడ్డ సింహం' విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ వీసా స్టాంపింగ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌లో హీరో శ్రీ విష్ణు మాట్లాడుతూ "డైరెక్టర్ కశ్యప్‌కి ప్రత్యేకమైన కామెడీ టైమింగ్ ఉంది. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది"అని అన్నారు. డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్ మాట్లాడుతూ "జేడీ, తరుణ్ ఇచ్చిన సపోర్ట్‌ను ఎప్పటికీ మర్చిపోలేను. శ్రీ విష్ణు ఈ సినిమాలో భాగం కావడం మా అదృష్టంగా భావిస్తున్నాను. అందరినీ అలరించే సినిమా ఇది"అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారా రోహిత్, జేడీ చక్రవర్తి, ఫారియా అబ్దుల్లా, మానస చౌదరి, పవన్ సాదినేని, స్వీకర్ అగస్తి, శ్రీరామ్ ఆదిత్య, సాయి మార్తాండ, హుస్సేన్ షా కిరణ్, హసిత్ గోలి, సందీప్ రాజ్, సందీప్, భాను కిరణ్, దివ్య పాల్గొన్నారు.



Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com